# సర్వేశ్వర శతకము



యధావాక్కుల అన్నమయ్య



# సర్వేశ్వర శతకము

## యధావాక్కుల అన్నమయ్య

తాత్పర్య వివరణ

సిహెచ్.వి బృందావన రావు

శ్రీ సర్వేశ్వర శతకము యథావాక్కుల అన్నమయ్య వ్రాసినది. తెలుగు సాహిత్యంలో ఇద్దరు అన్నమయ్యలు ఉన్నారు. ఒకరు యథావాక్కుల అన్నమయ్య, మరొకరు తాళ్ళపాక అన్నమయ్య. తాళ్ళపాక అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరునికి భక్తవరుడై ఆస్వామి మీద వేలాది కీర్తనలు వ్రాస్తే, ఈ అన్నమయ్య సర్వేశ్వరుడైన సాంబశివుని మీద శతక పద్యాలు వ్రాశాడు. ఈ అన్నమయ్య తాళ్ళపాక అన్నమయ్య కన్నా మూడువందలేండ్ల ముందు వాడు. పదమూడో శతాబ్దపు తొలి సగంలో జీవించాడు. వారి పేర్లు ఒకటిగా ఉండడంవల్ల ఈ రెండు ముక్కలూను.

యథావాక్కుల అన్నమయ్య గొప్ప శివభక్తుడు. వీర శైవుడనే చెప్పొచ్చు. దేశంలో శైవ వైష్ణవ జగడాలు బాగా జరిగే రోజుల్లోనివాడు. బసవ పురాణాది శివకావ్యాలు వ్రాసిన పాల్కురికి సోమనాథునికి సమకాలికుడో కొద్దిగా తరువాతవాడో అని నిర్ణయించారు పెద్దలు. ఈయన కర్నూలు జిల్లాలోని దూదికొండ వాస్తవ్యుడనీ, దరిమిలా మాచర్ల దగ్గరి కృష్ణాతీర గ్రామమైన సత్రశాలలో నివసించాడనీ, అక్కడే ఈశతకం

వ్రాశాడనీ సాహిత్యకారులు నిర్ధారించారు. ఈయన గురించి ఒక ముచ్చట జన ప్రవాదం లో ఉంది. తాటాకు మీద ఒక పద్యం వ్రాసి ఆ ఆకు కృష్ణలో విడిచేవాడనీ, అది ఏటిలో ఎదురీది పోయి మరలా తిరిగివచ్చేదనీ, అప్పుడు దాన్ని స్వీకరించేవాడనీ, ఏ పద్యపు ఆకైనా తిరిగి రాకపోతే దానిని శివుడు అంగీకరించ లేదని భావించి గండకత్తెర వేసుకుంటానని బాస చేసుకున్నా డనీ ఆ కథ. ఒక పద్యం ఆకు అలా తిరిగి రాకపోయే సరికి గండకత్తెర వేసుకోబోతుండగా ఒక పల్లెజనుడు ఒక ఆకు దొరికిందని తెచ్చిచ్చాడనీ, అది కొంత సవరింపబడిన తన పద్యం కలిగి ఉన్నదనీ, శివుడు తన పద్యాన్ని స్వీకరించి సవరించి పంపాడనీ భావించి తన ఆత్మహత్యా ప్రయత్నాన్ని విరమించాడనీ అంటారు. ప్రజాభిమానం పొందిన ప్రతి ప్రముఖుని గురించీ ఇలాంటి ఐతిహ్యాలు ఉంటూనే ఉంటాయి. అవి ఆయన గొప్పతనాన్ని చెప్పడానికి అభిమానులు కల్పించేవి. అయితే ఏకవి సమర్థతనైనా తెలియపరచేది ఆకవి కవిత్వమే గాని ఇలాంటి కథలు కావు, అవి సదుద్దేశంతో కల్పించినవైనా. ఈకథ లేకపోయినా అన్నమయ్య గొప్ప కవే. సందేహం లేదు. అఖండధారతో సాగిపోతాయి ఆయన

పద్యాలన్నీ. గొప్ప శివభక్తి తత్పరత కనిపిస్తుంది. దీర్ఘమైన సంస్కృత సమాసాలతో పద్యాలు ప్రౌఢంగా ఉంటాయి. గహనమైన భావాలను కూడా సుబోధకంగా చెప్పే ప్రయాస కనిపిస్తుంది. హృదయంలోని భావాన్ని స్పష్టంగా చెపుతాడు. రచనలో బాగా చేయితిరిగినతనం కన్పించే ఉచ్చస్థాయి ఐన కవిత్వం వెలయించాడు. ఇప్పుడు నేను చేసేది ఆ శతకం పద్యాల భావాన్ని తెలియ పరచే చిరు ప్రయత్నమే. కొన్ని పదాలకు అర్థం వివరించి పద్యంలోని బాహ్యార్థాన్ని పరిచయం చేయడమే. అందుకని కవిని గురించీ, శతకాన్ని గురించీ ఈ కొద్దిపాటి వివరణ చాలను కుంటాను. ఇక ఒక్కో పద్యం గురించీ ముచ్చటించు కుందాము.

1

**శా. శ్రీకంఠుం,బరమేశు,నవ్యయు,నిజశ్రీపాద దివ్యప్రభా.**
**నీకోత్సారిత దేవతా నిటల దుర్నీత్యక్షర ధ్వాంతు జి**
**త్ప్రాకామ్యాంగు,నపాంగమాత్ర రచిత బ్రహ్మాండ సంఘాతు జం**
**ద్రాకల్పుం,బ్రణతింతు నిన్ను,మది నాహ్లాదింతు ,సర్వేశ్వరా!**

ఈ ప్రారంభ పద్యం ప్రధానంగా సంబోధనాత్మకమైనది. ఓ సర్వేశ్వరా! నిన్ను ప్రస్తుతిస్తాను. పూజిస్తాను.అలా ప్రణుతించడంలో అపారమైన సంతోషాన్ని పొందుతాను. నీవేమి సాధారణుడివా! శ్రీకంఠుడవు. సురాసురులు క్షీరసముద్రాన్ని చిలికేటప్పుడు అమృతాని కన్నా ముందుగా హాలాహలం అనే మహావిషం ఉద్భవిస్తే దాన్ని నివారించడం ఎవరికీ సాధ్యం కాకపోతే, దానిని పట్టుకొని మ్రింగి కంఠంలో దాచుకుని గరళ కంఠుని వైనావు. ఆ సమర్థత మరెవరికుంది? నీవు పరమేశ్వరుడవు. అసలు నిన్ను మించిందీ నీకు అతీతమైనదీ ఏమీలేదు. నీవు అవ్యయుడవు. అంటే, అంతము లేనివాడవూ శుభములు కలిగించే వాడవూను. నీ శ్రీపాదముల దివ్య

కాంతిపుంజం దేవతలనుదుట బ్రహ్మ వ్రాసిన దుర్నీతి అనే అక్షరాల చీకటిని పోగొడుతుంది. అంటే, సర్వ దేవతలూ తమ నొసళ్ళు ఆనించి స్వామి పాదములకు నమస్కృతులు చేస్తూ ఉంటారు. ఆ పాదాల కాంతిలో దేవతల పాపాలు అనే చీకట్లు కొట్టుకుపోతాయి. దేవతల పాపాలను తొలగించే స్వామీ అని అర్థం.దేవా!నీవు చిత్ప్రాకామ్యాంగుడవు! చిత్ అంటే శుద్ధ జ్ఞానము. ప్రాకామ్యము అంటే ఐశ్వర్యము. స్వామీ, నీవు శుద్ధ జ్ఞానమనే మహైశ్వర్యానికి అంగభూతుడై నటువంటివాడివి. నీ కడగంటి చూపు మాత్రం చేతనే ఈ అండ పిండ బ్రహ్మాండాది సర్వలోకాలూ నిర్మాణమౌతాయి. (అపాంగ మాత్ర రచిత బ్రహ్మాండ సంఘాతుడు. అపాంగముఅంటే కడగంటిచూపు) స్వామి చంద్రాకల్పుడు. ఆకల్పము అంటే ఆభరణము. చంద్రుణ్ణి ఆభరణంగా కలిగిన వాడు గదా స్వామి! ఇంత అద్భుత లక్షణాలు గలిగిన దేవుడవు నీవు. నిన్ను కీర్తిస్తాను. పూజిస్తాను. అలా పూజించడంలో నాకు అఖండమైన ఆనందం లభిస్తుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదములకు మ్రొక్కు లు!

2

మ. **ఒకమాటీ సకలంబునీమయముగానూహించుచున్,వెండి యొ**
**క్కొకమా టింతయు నీవుగాదనుచు నేయుక్తిన్ బ్రశంసింప నే**
**రక వేదంబులు చిక్కుబడ్డ వనినన్వ్యక్తమై యుండు భా**
**వకుడై ,నీ నిజరూప మిట్టిదన నెవ్వండోపు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా! ఈ చతుర్దశ భువన భాండాలలో నిన్ను మించిన దేమున్నది. నీవు కాని దేమున్నది. ఈ చరాచర సృష్టి నిండా నీవు నిండి ఉన్నావని ఒక్కోమారూ, ఔనా కాదా అనే అనుమానంతోనో, కాదులే అనే భ్రమతోనో ఇదమిత్థం అని ఏమీ తేల్చుకోలేక నాలుగు వేదాలు కూడా గందరగోళపడు తుంటాయి. ఎందుకంటే నీవు వేదాతీతుడవు. సకల జ్ఞానానికీ సారభూతాలయిన వేదాలే ఇది ఇదీ అని నిర్ణయించడానికి సమర్థాలు కాకపోతే నీ నిజరూపమేదో నాకు తెలుసు అని కేవలం భావనతోఊహించి వాచాలతతో చెప్పడానికి ప్రయత్నించే వాళ్ళ సంగతి వేరే చెప్పాలా! నీవు అవాఙ్మానస గోచరుడవు. వాక్కుకూ మనస్సుకూ అందని వాడివి. నిన్ను ఎవ్వరూ

సంపూర్ణంగా ఎరుగలేరు. స్వామీ! సర్వేశ్వరా! నీ పాదములకు మ్రొక్కులు!

3

**శా. జ్ఞానాతీతుడవైన నీ మహిమ ప్రజ్ఞం బూని తర్కించుట**

**జ్ఞానాంగంబగు,నైననుం తమ యథాశక్తిస్ బ్రశంసించి ది**

**వ్యానందస్థితి బొందువారిగని భక్త్యావృత్తి నిన్నెట్టివా**

**డైనంబ్రస్తుతిజేయుచుండు దన చే నైనంత సర్వేశ్వరా!**

ఓపరమేశ్వరా! ఈ లోకంలో కొంతమంది మనుషులు ఏవో నాలుగక్షరాలు నేర్చుకొని తామే అఖండ ప్రజ్ఞావంతుల మనుకుంటుంటారు. ఆ కొద్దిపాటి తెలివిడితోనే నీ మహిమ గురించీ నీగురించీ ఎంతో తెలిసున్నట్టు చెపుతుంటారు. చర్చిస్తుంటారు. తర్కిస్తుంటారు. ఎంత అజ్ఞానం స్వామీ! సర్వ జ్ఞానానికీ అతీతుడవైన నిన్నుగూర్చి అంతా తెలిసున్నట్టు చెప్పడం కేవలం అజ్ఞానం కాక మరేమిటి? ఐనా కానీ, వారిలో ఒక భక్తి తత్పరత ఉంది. ఆభక్తితోనే పరవశులౌతుంటారు. నిన్ను ప్రస్తుతిస్తుంటారు. ఆ భక్తితోనే పరమానందాన్ని అనుభవి స్తుంటారు. అతని భక్తి యొక్క ఆవృత్తిని (పరంపరను) ఆభక్తి అనుభవంలో అతను పొందే ఆనందానుభవాన్నీ చూచిన ఇతరులు కూడా నీకు ఆకృష్టులై తామూ నిన్ను ప్రస్తుతిస్తూ,

పూజిస్తూ ఆ ఆనందాన్ని వారూ అనుభవిస్తుంటారు. అంటే, నిన్ను సేవించడానికి జ్ఞానం అక్కర్లేదయ్యా! జ్ఞానులకు మాత్రమే నిన్ను సేవించే హక్కున్నదనడం సరికాదు. ఎట్టి పామరుడైనా భక్తి ఉంటే చాలు, నిన్ను తెలుసుకునే అవకాశం ఉందన్నమాట. ఒక చిన్న గవాక్షంలోంచి చూసి, ఆ చిన్నదృశ్యానికే పరవశుడై పోయే మనిషికి ఆగవాక్షం అవతల ఒక బ్రహ్మాండమైన జగత్తు ఉన్నదనే సంగతి అనవసరం. తనకు చేతనైనంత సేవా, ఆరాధనా, పూజా తాను చేస్తాడు. అతన్నిచూసి ఇతరులూ అలాగే చేస్తారు. భక్తి అనేది ఉంటే చాలు. అది కొంచెమా ఎక్కువా అనేది అప్రస్తుతం. జ్ఞానం అనేది మంచిదే. కానీ నిన్ను చేరేందుకు జ్ఞానంకన్నా భక్తి ముఖ్యం. అయినా, సర్వజ్ఞుడివీ, సర్వ జ్ఞానానికీ అతీతుడవీ ఐన నిన్ను తెలుసుకునే జ్ఞానం ఎవరి కున్నది? నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

4

**మ. అమితాంభోజభవాండభాండనిలయంబై యుండు నీ యంతరం
గము పట్టెంతయొ,దానికింక బహిరంగంబెట్టిదో,సూక్ష్మ త
త్వము దా నంతకుమీద నేమివిధమో! తానిట్టి నీ పెంపు మా
ర్గము నీకైన నచింత్యమెట్లొరుడెరుంగం జాలు సర్వేశ్వరా!**

పరమేశ్వరా! నీ విరాట్ స్వరూపము వాక్కులకూ మానసానికీ అగోచరమైనది. ఇది ఇంతఅని వివరించడం ఎవరికీ సాధ్యంకాదు. ఈమహాబ్రహ్మాండమంతా నీ అంతరంగంలో నిబిడీకృతమై ఉన్నది. అంతరంగమే అంతదైతే ఇక నీ బహిరంగపు పరిమాణమూ, నీ బాహ్యాప్రకృతి విస్తారమూ ఎలాంటివో, ఆ అంతరంగ బహిరంగాలూ వాటి సూక్ష్మతత్వమూ ఏదో, నీ పెంపు మార్గము అంటే నీ అతిశయము యొక్క విజృంభణ ము ఎలాంటిదో ఎవరు తెలుసుకో గలరు? ఈ చతుర్దశ భువనాలూ, అండపిండ బ్రహ్మాండాలూ అన్నీ నీ విరాణ్మూర్తి అంతరంగంలోని చిరుభాగాలు. ఇక నీ నిజ తత్త్వం ఏమిటో తెలుసుకోవడం సాధ్యమయ్యే పనేనా! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( అంభోజ భవుడు అంటే బ్రహ్మ. అంభోజ భవాండము అంటే బ్రహ్మాండము.)

5

మ.

**ఇన,విఘ్నేశ్వర,మాతృకా,ద్రుహిణ,బ్రాహ్మీ,స్కంద,దుర్గా,రమా**
**వనితాధీశ్వర,భైరవుల్ బలిసి భాస్వద్యుక్తి సంయుక్తి నీ**
**కనిశంబుస్ బరివార భృత్యు నికరంబైరన్న నిన్నింక గొ**
**ల్వని వారెవ్వర జాండ భాండములలో వర్ణింప సర్వేశ్వరా!**

పరమేశ్వరా! లోకానికి వెలుగును ప్రసాదించే మహాత్ముడూ, జగత్కర్మసాక్షీ సూర్యభగవానుడు. సర్వ లోకాలచేతా తొలి వందనాలందుకుని విఘ్నాలను నివారించే స్వామి వినాయకుడు. కాళి, కౌశిక, ఉద్ధత, హవిషి, శారిక, ఆర్య, వైధాతి అనే పేర్లతో ఉండే సప్త మాతృకలు కుమారస్వామి చేత లోకమాతృత్వాన్ని పొందినవారు. ఇక బ్రహ్మ సర్వసృష్టికీ విధాత. శారదాదేవి సర్వ వాంగ్మయానికీ అధినేత్రి. కుమార స్వామి అఖిల దేవతాసైన్యానికీ సేనాధిపతి. తారక శంబరా సురులను నిర్మూలించిన కారణజన్ముడైన మహనీయుడు. దుర్గమమైన సర్వ పాపాలనూ హరించి లోకాలకు భద్రత చేకూర్చే తల్లి దుర్గ. లక్ష్మీ వల్లభుడైన విష్ణుమూర్తి లోక రక్షకుడు.

స్థి తి కారకుడు. ఇక కాలభైరవుడు లోకంలో శాంతిభద్రతలను కాపాడే అధికారి. దుష్టులను అదుపు చేసే వీరుడు. ఇలా వీరందరూ ఎవరికి వారే మహాత్ములు. మహాశక్తి సంయుతులు. తమ తమ కార్యక్రమాలతో ఈ సృష్టి సజావుగా సాగిపోయేట్టు తమ కర్తవ్యాలు నిర్వహిస్తుంటారు. ఓ కపాలీ! ఇట్టి వీరందరూ నీ పరివారం. పరివారమే కాదు, నీ భృత్యులు వీరందరూ. నీ నియోగంతోనే వీరందరూ తమ కర్తవ్యాలను నిర్వహిస్తుంటారు. వారికి ఆశక్తి అంతా నీ అనుగ్రహం వల్లనే లభిస్తుంది. వీరు నిత్యమూ నిన్ను సేవిస్తుంటారు. ఇక ఈ బ్రహ్మాండంలో ఇటువంటి మహాత్ములందరూ నిన్ను సేవిస్తుంటారంటే ఇక ఈ బ్రహ్మాండభాండాల్లో, నిన్ను సేవించని వారెవరు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( ఇనుడు=సూర్యుడు,ద్రుహిణుడు=బ్రహ్మ

బ్రాహ్మి=సరస్వతి,స్కందుడు=కుమారస్వామి

రమావనితాధీశ్వరుడు=విష్ణువు, అనిశము=ఎల్లప్పుడూ,

అజాండ భాండము=బ్రహ్మాండ భాండము)

6

**శా. ఏపారంగ నజాండ భాండ నికరం బేరూపులోబుట్టి యు**

**ద్దీపించుస్, మరి రూపులెల్ల సమ సుప్తిం బొంది,యే రూపులో**

**లోపించుం, గలయంగ నంతటికి తా లోనై విజృంభించి యే**

**రూపం బవ్యయమై వెలుంగు-నది నీ రూపంబు సర్వేశ్వరా!**

ఈ పద్యం అన్నమయ్య పరమ జ్ఞానపూరితమైన భక్తికి పరాకాష్ఠ అని చెప్పవచ్చు. పరమేశ్వరుని అసలు రూపమేదో దానిని భావిస్తున్నాడు కవి. బాహ్య సగుణా కారాన్ని కాకుండా ఆ దేవుని జ్యోతి స్వరూప విభూతిని భావిస్తున్నాడు. స్వామి మూలతత్వాన్ని ఆవాహన చేస్తున్నాడు. ఈ చరాచర సృష్టి ఈ బ్రహ్మాండ భాండాలన్నీ ఏ రూపంలో పుడుతున్నాయో, ఏ రూపంలో చిరనిద్ర పొంది లయమౌతున్నాయో ఆ రూపానికి అతీతమై ఏకాకృతిగా అఖండంగా అవ్యయంగా వెలిగే మహాజ్యోతి ఏదైతే ఉందో అది నీవయ్యా స్వామీ అని తన హృదయంలో తాను దర్శించిన పరమేశ్వరుని విరాణ్మూర్తిని ఆవిష్కారం గావించుకుంటున్నాడు. ఇదే రకమైన భావాన్ని

మనం భాగవతంలో కూడా చూస్తాము. మొసలికి చిక్కి ఇక తన పని అయిపోయిందని తెలుసుకుని నీవే తప్ప మరి వేరే దిక్కు లేదని పరమాత్మను ప్రార్థించిన గజేంద్రుడు కూడా ఇలాగే అన్నాడు. లోకంబులు, లోకేశులు, లోకస్థులు, తెగిన తుది నలోకంబగు పెంజీకటి కవ్వల నెవ్వండేకాకృతి వెలుగు_నతని నే సేవింతున్ అని. లోకాలూ, లోకాధిపతులూ, లోకంలోని సర్వజీవులూ అందరూ అంతమయ్యాక ఈ బ్రహ్మాండాన్ని ఆవరించుకునే మహా గాఢాంధకారానికి ఆవల ఒకేమూర్తిగా, అవ్యయంగా, అఖండంగా వెలుగుతూ ఉండే దేవా నిన్ను ఆశ్రయిస్తున్నాను అన్నాడు గజరాజు ఆనాడు. అదే భావాన్ని అన్నమయ్య కూడా ఈపద్యంలో చెప్తున్నాడు. గజేంద్రుడు హరిని భావిస్తే అన్నమయ్య హరుని భావిస్తున్నాడు. హరీ, హరుడూ అనేవి మనం కల్పించుకున్నవేగాని అంతా ఒకటే పరమాత్మ గదా! యశోదమ్మ పాలు ప్రీతిగా తాగిందీ ఆయనే, హాలాహలాన్ని అలవోకగా ఆరగించిందీ ఆయనే! నీ లీలా విలాసాన్ని అర్థం చేసుకోగలిగిన వారెవరు? నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కు లు!

7

మ.

**జలజాత ప్రభవాండ బుద్బుదము లశ్రాంతంబునుం బుట్టుచున్**

**గలయం గ్రాగుచు నుండు నీ పృథుల లింగ స్ఫార గర్భాబ్ధి లో**

**పల, తద్బుద్బుద గర్భవాసులు హరి, బ్రహ్మాది దేవాళియున్**

**గలదే వారికి నీ మహత్వ మెరుగంగా శక్తి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా! ఈ బ్రహ్మాండమంతా ఒక నీటి బుడగ. ఇలాటి అనేకానేక బ్రహ్మాండాల నీటిబుడగలన్నీ నీ మహా లింగము అనే విశాల సాగరంలో పుడుతూ గిడుతూ ఉంటాయి. నీళ్ళల్లో బుడగలు సహజమే కదా. లింగాకారమైన నీ విరాడ్రూపము ఒక విస్తారమైన మహా సముద్రం. విష్ణువూ, బ్రహ్మా, ఇతర సర్వ దేవతలూ ఈ బ్రహ్మాండవాసులు. అంటే ఆ బుడగల గర్భంలో ఉండేవారు. వారందరూ, ఆ బుడగలతో సహా నీనుండి ప్రభవించి, నీలోనే నివసించి, నీలోనే లయమై పోయేవారే! బ్రహ్మ సృష్టిని గావించినా, శ్రీ హరి స్థితి కారకుడైనా వారా పనులు నీ నియోగం వల్లనే చేస్తారు. నిజానికి సృష్టి స్థితి లయ కారకుడవు నీవే! నీ అనుగ్రహంతోనే తమ తమ

ధర్మాలను నిర్వర్తిస్తూ నీలోనే పుట్టి, నీలోనే ఉండి, నీలోనే అడగిపొయ్యే హరి బ్రహ్మేంద్రాదులకు నీ మహత్వం తెలుసుకునే సామర్ధ్యం ఎలా ఉంటుంది? నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కు లు!

8

మ.

**భవదున్మేష విజృంభణమ్ము పరికింపంగా సరోజాత సం**

**భవు జన్మంబు,భవన్నిమేష మమిత బ్రహ్మాండ కల్పాంత భై**

**రవ సంక్షోభితమన్న తక్కిన భవత్ప్రారంభ భూరిక్రియా**

**నివహం బెవ్వరు నేర్తు రిట్టిదని వర్ణింపంగ సర్వేశ్వరా!**

ఓం పరమేశ్వరా! బ్రహ్మదేవుడు జన్మించడమూ ఈ సృష్టి క్రమాన్ని నిర్వహించడమూ అనేది కేవలం నీ విలాసం యొక్క అతిశయమే. నీవు కన్ను మూసి తెరిస్తే చాలు, నీ రెప్పపాటు ఈ సకల బ్రహ్మాండానికీ కల్పాంతమై భీకరమైన కల్లోలానికి కారణమౌతుంది. నీ రెప్పపాటే భువనాల యుగాంత సంక్షోభాన్ని కలిగించ గలిగితే, స్వామీ, నీ ఇతర చర్యలుగానీ వాటి విజృంభణం గానీ ఎలాంటి ఫలితా లు ఇస్తాయో, వాటి ప్రభావం ఈ జీవ జాలంపైన ఎలా ఉంటుందో వర్ణించడం ఎవరికి సాధ్యమౌతుంది? ఈ సర్వ సృష్టిలోనూ నిన్ను మించి ఏదీలేదు. నీప్రభావం కానిదీ ఏమీలేదు. సృష్టికీ, దాని సర్వ కార్యక్రమాలూ,

దాని మనికీ మనుగడా  అంతా  కేవలం నీ లీలా విలాసమే! నీ అనుగ్రహమే! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

9

మ.

**పవనుండై,హిమధాముడై,యనలుడై,పానీయమై,యాత్మయై రవియై,యంబరమై,మహీవలయమై రమ్యాష్టమూర్తి క్రియస్ భువనాండంబులు లక్షణాంగములుగా బుట్టించు నత్యద్భుతో త్సవ లీలా విభవంబుతోడ భవదాజ్ఞా శక్తి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా! ఈ సమస్త బ్రహ్మాండ భాండాలూ అష్టమూర్తివైన నీవల్లే ఉద్భవిస్తున్నాయి. నీ ఆజ్ఞాశక్తి వల్లనే మనుతున్నాయి. అష్టమూర్తి అంటే ఎనిమిది లక్షణాంగాలు గల స్వామివినీవు. పృథివీ, జలమూ, అగ్ని, వాయువూ, ఆకాశమూ అనే పంచభూతాలూ, సూర్యుడూ, చంద్రుడూ అనే రెండు జ్యోతిర్గ్రహాలూ, ఆత్మా అనే ఎనిమిది లక్షణాంగాలతో నీవు అష్టమూర్తివి. వీటితోనే నీవు ఈ లోకాలను సృష్టిస్తుంటావు. అవి లేకపోతే ఈసృష్టేలేదుకదా. వాయువు నీ ఉచ్ఛ్వాస నిశ్వాసలు అగ్ని నీ మూడో కన్ను. జలం నీ అభిషేకం. ఆకాశం నీ వలువ. భూమి నీ రథం. సూర్యచంద్రులు నీ నేత్రాలు. సమస్త జగదంత

రాత్మవూ నీవేఅయి సర్వజీవుల్లోనూ ప్రకాశిస్తుంటావు. నీ ఆజ్ఞాశక్తితోనే అవన్నీ సృష్టిగా రూపొందుతాయి కాబట్టి నీవే ఈ బ్రహ్మాండ మంతా నిండి ఉన్నావు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

10

మ.

**జలజాత ప్రభవాండ భాండములు దుశ్చారిత్రులం బాత్రులం**
**జెలువై యుండ యథా ప్రమాణములుగా శిక్షింప రక్షింప ని**
**శ్చల లీలం ప్రభవించు రాజు భవదాజ్ఞా శక్తిగా కింతవ**
**ట్టెలమిం జేకొని నిర్వహింప మరి రాజెవ్వండు సర్వేశ్వరా!**

పరమేశ్వరా! ఈ చతుర్దశ భువనాల లోనూ అంటే ఈ బ్రహ్మాండంలో దుర్మార్గులూ ఉంటారు. శిష్టులూ ఉంటారు. వారివారి చర్యలను బట్టి దుష్టులు శిక్షించ బడాలి. మంచివారు రక్షింపబడాలి. వారి చర్యలకు అనుగుణంగా యథాప్రమాణంగా శిక్షించడానికీ రక్షించడానికీ ఒకరాజో అధికారో ఉంటాడు. ఆ రాజుకో అధికారికో అలా శిక్షించేందుకు అధికారం నీ ఆజ్ఞా శక్తి వల్లనే సంక్రమిస్తుంది.ఆహా,నేనింత శక్తిమంతుణ్ణి, శిక్షించేందుకు రక్షించేందుకూ సమర్థుణ్ణి అనీ, తాను సర్వ శక్తిమంతుడినీ అని అనుకునే చక్రవర్తులు కేవలం నీ అనుగ్రహం వల్లా, నీ ఆజ్ఞాశక్తి వల్లా ఆ అధికారం పొందారుగాని వాస్తవానికీ సర్వమూ నిర్వహించేవాడవు నీవే. మానవుడి అహంకారానికి పరిమితే

లేదు. శివుని ఆజ్ఞ లేనిదే గడ్డిపోచకూడా కదలదని గ్రహించక, సర్వ శక్తి యుతుడివైన నిన్ను మరచి తామే సర్వానికీ అధినాధుల మనుకుంటుంటారు. అంతకన్నా అజ్ఞానం ఉంటుందా. నీవు గాక మరి రాజెవడు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

11

**శా. జ్ఞానజ్యోతి విజృంభమాణముగ నోజస్ విష్ణు,విధ్యాది దే**
**వానీకాత్మ దశావళిం దవిలి,నీ వారంగ వారిం గళా**
**జ్ఞాన ప్రౌఢుల జేయుచు స్ వెలయగా సర్వజ్ఞ శబ్దంబు దా**
**నీ నామాంకముగా విధించె నిగమానీకంబు సర్వేశ్వరా!**

సర్వేశ్వరా ! ఈ లోకంలో సర్వజ్ఞుడు అనే పేరు నీకొక్కడికే ఉంది. ( సర్వజ్ఞ నామధేయము శర్వునకే యుర్వింజెల్లును, తక్కొరు సర్వజ్ఞుండనుట కుక్క సామజమనుటే. ఈశ్వరుణ్ణి కాకుండా మరెవరినైనా సర్వజ్ఞుడంటే కుక్కను ఏనుగు అన్నట్టే అని ఒక చాటువు కూడా ఉంది) సర్వజ్ఞుడు అంటే అంతా తెలిసినవాడు అని సామాన్యార్థం. అంతా అంటే ఇక నిన్ను మించిన, నీకు అతీతమైన జ్ఞానమే లేదు. నీవు నీ జ్ఞానజ్యోతి తోనే విష్ణువునూ, బ్రహ్మనూ ఇతర దేవతలందరినీ జ్ఞాన వంతులను కావిస్తావు. ఆ జ్ఞానదీపపు ప్రకాశంతోనే వారందరినీ కళా, జ్ఞానాల్లో ప్రౌఢులను కావిస్తావు. అందుకనే నీవే సర్వజ్ఞుడ వని సర్వ వేదాలూ ఘోషిస్తున్నాయి. ఈ బ్రహ్మాండ భాండాల్లోని

సర్వ జ్ఞానమూ నీయందే ఉద్భవిస్తుంది. నీవే జ్ఞానస్వ రూపుడవు. నిన్నుమించిన తెలివిడేలేదు. నిన్ను తెలుసుకుంటే సర్వమూ తెలిసిపోయినట్లే. ఐతే నిన్ను సంపూర్ణంగా ఎవరు తెలుసుకోగలరు? అందుకనే నీవొక్కడివే సర్వజ్ఞుడవు. నా తండ్రీ ! సర్వేశ్వరా ! నీ పాదాలకు మ్రొక్కులు!

12

మ.

**సురలన్ మర్త్యసమూహిగా, మనుజులన్ శోభిల్లు బృందారకో**

**త్కరముంగా ,ఘను నల్పు ,నల్పుని ఘనుంగా పుణ్యపాపాలిచే**

**తిరుగన్సేచుచు నీ మహా మహిత భ్రీతిం బద్మజాండంబునం**

**దరయన్ జీవుల నింద్రజాలములుగా నాడింతు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా! ఈ లోకమంతా నీ క్రీడాస్థలం. ఈ బ్రహ్మాండ జాలంలో జరిగేదంతా నీ ఇంద్రజాలం. వారివారి పాప పుణ్యాలనుబట్టి దేవతలను మనుషులుగా జేసి భూలోకానికి పంపించి కష్ట సుఖాలకు పాత్రులనుగా జేస్తావు. అలాగే మానవులకు దైవసుఖాలు అనుగ్రహిస్తావు. అల్పుణ్ణి ఘనుని గానూ ఘనుని అల్పునిగానూ చేయడం నీ కేళీ విలాసమూ, వారివారి సుకృత దుష్కృతాల పరిపాకమూ. నీ ఇచ్ఛానుసారం ఈ సర్వసృష్టినీ ఇంద్రజాలకునిగా ఆడిస్తుంటావు. స్వామీ, నీవు సర్వశక్తిమయుడవు. మనుషులు తాము గొప్పవాళ్ళమనీ అంతా తమ ఘనతేననీ అనుకొంటూ విర్రవీగుతుంటారు గాని

గొప్పవాణ్ణి అధమునిగా, అధముని ఉన్నతునిగా క్షణంలో మార్చడం నీకొక క్రీడ ప్రాయమేనని అర్థం చేసుకోలేరు. దేవతలు కూడా తమ దైవత్వం శాశ్వతమేనని భావిస్తుంటారు. కాని వారి సౌభాగ్యమంతా నీఇచ్ఛాశక్తి కి లోబడినదే నని తెలుసుకోకుండా గర్విస్తుంటారు. నా తండ్రీ! సర్వేశ్వరా ! నీ పాదాలకు మ్రొక్కులు!

13

మ.

**ఘనుడై యేచి దశాననుండు బలిమిం గైలాస శైలేంద్ర మె**

**త్తిన,దద్దానవనాథు ద్రొక్క, నతడర్థిన్మొక్కినం గాచి ప్రా**

**క్తన శౌర్యాధికుజేసి,దుష్టు నణపంగా ,శిష్టు రక్షింప రం**

**జనతో నెప్పుడు వేచియుండు భవదా జ్ఞాశక్తి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, రావణాసురుడు ఉద్ధతుడైన వీరుడు .గర్వోన్మాది. కాముకుడు. అనేక దుష్కృత్యాలు చేశాడు. అన్నయైన కుబేరునితో యుద్ధం చేసి అతని పుష్పక విమానాన్ని హరించాడు. ఇన్ని చెడ్డ లక్షణాలున్నా వేదాది సకల విద్యలనూ ఆపోశన పట్టినవాడు. నీకు మహా భక్తుడు.ఐతే లాభమేముంది. పరమ దర్పంతో నీవుండే కైలాసపర్వతాన్నే పెకలించాలని చూశాడు. ఎంత భక్తుడైనా నీ యెడనే అంత తూంష్ణీభావమా? అంత పొగరా? నీవు తలుచుకుంటే అతని దర్పమెంత, అతనెంత? ఒక్క త్రొక్కు త్రొక్కి అతన్ని అణచివేసి కైలాస పర్వతం క్రింద నలిగి పోయేటట్లు చేశావు. (అప్పుడు భరించలేని బాధతో అతను భీకరంగా రావం చేస్తే దశాననుడికి

రావణుడు అనే పేరు వచ్చింది) అప్పటికి బుద్ధి వచ్చి నీ మహత్వం తెలిసి రక్షించమని ప్రార్థించాడు. నీవు దయచూపి అతని పాత శౌర్యాన్ని అతనికి ప్రసాదించావు. దుష్టత్వం ప్రదర్శిస్తే శిక్షించడానికీ, నీవు తప్ప మరిదిక్కులేదని శరణాగతి పొందితే రక్షించడానికీ నీ ఆజ్ఞాశక్తి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందిగదా! దుష్టులయెడ ఆగ్రహమూ, భక్తులయెడ అనుగ్రహమూ నీ నైజాలు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

14

మ.

**తమకం బెత్తిన నాత్మజం గడు మదాంధవ్యాప్తి నేకాంత ప**

**క్షమునం దెవ్వరు గానకుండ గవయంగావోయి నీ బాణ ఘూ**

**తమునం బద్మభవుండు ద్రెళ్ళెనినం,దా దప్పవర్తించులో**

**కమునం దెవ్వరికింక నిన్ను నెరుగంగావచ్చు సర్వేశ్వరా!**

బ్రహ్మ సరస్వతిని సృజించాడు. తాను సృజించాడు కాబట్టి ఆమె తనకు కూతురు. ఐనా ఆమె దివ్య సౌందర్యాన్ని చూసి ఆమెను మోహించాడు బ్రహ్మ. తన తమకం ఆపుకోలేక ఏకాంతంలో ఎవ్వరూ చూడకుండా ఆమెను కవయడానికి ప్రయత్నించాడు. కామికి వావివరస లేముంటాయి. ఎవ్వరూ చూడటంలేదులే అనుకున్నాడు గాని మూడుకండ్లవాడిని ఏమార్చగలడా. సొంతకూతుర్నే మోహించిన బ్రహ్మ దుర్మార్గాన్ని శివుడు సహించలేక పోయాడు. అప్పుడు బ్రహ్మకు ఐదు ముఖాలు ఉండేవి. బ్రహ్మపై కోపించిన శివుడు శూలంతో బ్రహ్మను పొడిచాడు.ఒక తలతెగి శివుడి కాళ్ళ దగ్గర

పడింది. హిమాలయాల్లో శిరస్సు పడిన ప్రదేశమే బ్రహ్మకపాలం. బ్రహ్మ తన తలకు ఏదైనా యోగ్యత కల్పించమని వేడుకోగా ఆ కపాలాన్ని శివుడు తన భిక్షాపాత్రగా చేసుకున్నాడు.

ఓ పరమేశ్వరా,మోహంతో చెడ్డ పనిచేసిన బ్రహ్మంత వాణ్ణే నీవు తీవ్రంగా శిక్షించావు.ఇక లోకంలో దుష్ట కార్యాలు చేసినవారు ఎవరు నీ ఆగ్రహం నుండి తప్పించుకోగలరు? నా తండ్రీ! సర్వేశ్వరా !నీ పాదాలకు మ్రొక్కులు!

15

మ.

**పలుజన్మంబుల గూడబడ్డ భవ శుంభద్ఘోర దుష్కర్మ రా**

**సులు పైగూలి సమస్త జీవులు వెసస్ శోషించుచుస్ పెద్ద దు**

**ర్బలులై చిక్కిన దద్భవాపహరణార్థంబొ ప్ప బద్మోద్భవ**

**ప్రళయం బొక్కొకమాటు సేయుదు తుదిన్భావింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా! లోకంలోని ప్రతిజీవీ నిత్యమూ ఏవో పాపాలు చేస్తూనే ఉంటాడు. ఆ పాపాల ఫలితంగా మళ్ళీ మళ్ళీ జన్మ లెత్తుతూనే ఉంటాడు. ఎత్తిన ప్రతి జన్మలోనూ మళ్ళీ పాపాలు చేస్తూనే ఉంటాడు. అలా ఘోరమైన దుష్కర్మల రాశులు ప్రతి వాడిలో నూ పేరుకు పోతుంటాయి. ఆ పాపాల బరువుతో బాధలనుభవిస్తూ శోషించి దుర్బలులై , శాపవిముక్తి కి ఏకైక మార్గం నీ అనుగ్రహమేననేది గుర్తింపక , నవసి పోతూనే ఉంటారు. ఈ పాపాల పుట్ట, ఈ పాపుల రాశి సమూలంగా లయమై పోవడానికి, లయమూర్తివీ, లయకారకుడివీ అయిన నీవు ఒక మహా బ్రహ్మ ప్రళయాన్ని కల్పనం చేస్తావు. అలా జన్మ దుఃఖాలనన్నిటీ కల్పాంత ప్రళయంలో లయంచేసి ఒక

నూత్న సృష్టికి దారిచేస్తావు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

16

మ.

**సుమహత్పద్మభవాండ పంక్తుల లయ క్షోభ ప్రతాపంబుతో**

**నిమిషార్ధంబున గ్రాచి,పెంపెసగు నీ నేత్రానల జ్యోతి య**

**య్యమ,మీనాంక,జలంధర,త్రిపురదైత్యాలిన్విజృంభించి భ**

**స్మముగా జేయుట నిశ్చయింప నిదిదా శౌర్యంబె, సర్వేశ్వరా!**

పరమేశ్వరా,నీవు యముని శిక్షించావు.మన్మధుని నీ కంటిమంటతో భస్మం చేశావు. జలంధరుని వంటి లోకకంటక రాక్షసుని, విష్ణువు కూడా చంపలేక పోయినవానిని వధించావు. త్రిపురాసురులను అంతంచేసి త్రిపురాంతకునివైనావు. ఇవ్వన్నీ ఏవో మహా కార్యాలని చెపుతారుగాని, వాస్తవానికి ఈ బ్రహ్మాండ భాండాలనే, కల్పాంతంలో, నీ లయకారియైన పరాక్రమంతో క్షోభింపజేసి నిమిషార్ధంలో భస్మంచేస్తావు.అలాంటి నీ మహత్వం ముందు పైన చెప్పిన లాంటి పనులన్నీ చాలా చిన్నవిగదా. నా తండ్రీ,! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

(సుమహత్= చాలా గొప్ప,పద్మభవాండ పంక్తులు= బ్రహ్మాండాలమొత్తాలు, నేత్రానల జ్యోతి= నేత్ర, అనల, జ్యోతి=కంటిమంటజ్వాల, దైత్యాలి= రాక్షసుల గుంపు)

సందర్భాంశాలు 1) అల్పాయుష్కుడైన మార్కండేయుని ప్రాణాలు తీసేందుకు యముడు వచ్చాడు. ఆ సమయంలో ఆ బాలుడు శివలింగాన్ని కావిలించుకొని, శివుణ్ణే జపిస్తూ కూర్చున్నాడు. అతని మీదికి యముడు విసిరిన పాశం శివలింగాన్ని తాకుతుంది . శివుడు కోపించి యముణ్ణి శూలంతో వధించాడు. దేవతలందరూ వచ్చి ప్రార్థిస్తే మళ్ళీ బ్రతికించాడు. మార్కండే యునికి  చిరంజీవిత ప్రసాదించాడు.

2) మీనాంకుడు అంటే మన్మధుడు. శివపార్వతులకు పుట్టే పుత్రుడే తారకాసురుని చంపగలడని బ్రహ్మ చెప్పినందున, అంతవరకూ వివాహం కాని పార్వతీ పరమేశ్వరులకు పరస్పరం మోహం పుట్టించేందుకు దేవతలు మన్మధుని ఉసిగొల్పుతారు. తపస్సు చేసుకునే శివునిపై మన్మధుడు తన పూలబాణాలు వేయగా  శివుని మనస్సులో మోహం అంకురిస్తుంది. తన మనస్సు చలించి, తపోభంగం కావడానికి కారణమైన

మన్మధుని తన కంటిమంటతో కాల్చివేశాడు శివుడు. మన్మధుని భార్య రతీదేవి ఏడిస్తే, పార్వతి నచ్చజెబితే మన్మధుణ్ణి బ్రతికించాడు. ఐతే రతీదేవికి మాత్రమే కనపడేటట్టూ, మిగిలినవారికి అనంగునిగా, అంటే శరీరం లేనివానిగా ఉండేట్లు అనుగ్రహించాడు.

3) శివుడు మన్మధుని కాల్చిన నేత్రాగ్ని జ్వాల కొంతభాగం పోయి సముద్రంలోపడి ఒక రాక్షసునిగా జన్మించింది. అతడు జలంధరుడు. కాలనేమి అనే రాక్షసుని కూతురైన బృంద అనే ఆమెను వివాహ మాడాడు . ఆమె మహా పతివ్రత. జలంధరుడు దేవతల మీదికి యుద్ధానికి పోయాడు.దేవతలకు సహాయంగా విష్ణువు వచ్చినా జలంధరుని చంపలేక పోతాడు. నారదుడు వచ్చి పార్వతీదేవి చాలా అందంగా ఉంటుంది, ఆమెను తెచ్చుకో అని జలంధరునికి బోధిస్తాడు. వాడు ఆ ప్రయత్నం చేస్తుంటే శివునికి కోపం వచ్చి వాడి మీదికి వెళతాడు గాని వాడు చావడు. అప్పుడు పార్వతి విష్ణువు దగ్గరికి వెళ్ళి ,జలంధరుని భార్యయిన బృంద పాతివ్రత్యం ప్రభావంవల్ల అతడు అవధ్యుడైనాడు, ఆమె పాతివ్రత్యం చెరచు అని చెపుతుంది.

విష్ణువు జలంధరుని రూపంలో వెళ్ళి ఆమెను చెరుస్తాడు. ఆమె శీలభంగం జరగగానే శివుని చేతులతో జలంధరుడు మరణిస్తాడు. తనకు జరిగిన మోసాన్ని తెలుసుకొని బృంద విలపిస్తుంటే అమ్మా నీవు మహా పవిత్రురాలివి, తులసిగా మొక్కపై ఇంటింటా పూజలందుకుంటావు, నేను నిత్యమూ నీ పత్రాలమాలను ధరిస్తాను, నీవు విష్ణుప్రియగా ఆరాధించ బడతావు అని ఆమెను ఆశ్వాసిస్తాడు విష్ణువు.

4) తారకాసురుని పుత్రులు ముగ్గురు, విద్యున్మాలి, తారకాక్షుడు, కమలాక్షుడు అనేవాళ్ళు. వీరు బ్రహ్మను గూర్చి తపస్సు చేసి మూడు ఎగిరేనగరాలను సంపాదించారు. ఎక్కడికి పోయినా నగరాలతో సహా పోయి, ఎక్కడంటే అక్కడ దిగి ఊళ్ళను నాశనం చేస్తుండేవారు. వారిని చంపడం ఎవరికీ సాధ్యం కాలేదు. శివుడు ఆ త్రిపురాల మీదికి యుద్ధానికి పోయాడు.భూమిని రథంగానూ, సూర్యచంద్రులు రథచక్రాలు గానూ, బ్రహ్మ సారథిగానూ, వాసుకిని పగ్గంగానూ, మేరు పర్వతాన్ని విల్లుగానూ, విష్ణువును బాణంగానూ చేసుకుని యుద్ధం చేశాడు. త్రిపురాసురుల రక్తం నేల మీద పడితే ఒక్కొక

బొట్టుకూ వేలమంది రక్కసులు పుట్టుకొస్తారట. అందుకని వారి నెత్తురు కింద పడకుండా పార్వతీదేవి తన నాలుకను పరిచిందిట. ఇన్ని పరికరాలతో యుద్ధం చేసి శివుడు తన పాశుపతాస్త్రంతో త్రిపురాసురులనూ వారి పురాలనూ దగ్ధం చేశాడు.

17

మ.

**అతిదక్షుండగు దక్షుడీ జగములో యాగంబు సల్లక్షణ**

**స్థితిగా జేయుచునుండి ,మిమ్ము మది నుద్దేశింపమిం జేసి తా**

**హతుడయ్యెం దుది,నట్టి కార్యములు పొందై యుండునే! కర్త స**

**మ్మతి తో జేయని దుర్మదుండు మనునే భావింప సర్వేశ్వరా!**

దక్షుడు ప్రజాపతి. దేవాదులకూ ఋషులకూ గొప్ప గౌరవభాజనుడైన పెద్ద.నీకు మామగారు. ఆయన కూతురు సతీదేవి నీ భార్య. ఐనా, ఎప్పుడో నీవు ఆయనకు గౌరవం చూపలేదని నీమీద కోపం ఆయనకు. ఆయన మూర్ఖత్వం కాకపోతే ఈ చరాచర సృష్టికీ అధినేతవూ దేవాది దేవుడవూ ఐన నీవు ఆయనకు గౌరవం చూపడం ఏమిటి. ఎంత మామ అయినా నిన్ను తృణీకరిస్తాడా.

ఆయన ఒకసారి యజ్ఞం చేస్తూ సర్వదేవతా గణాన్నీ, మునులనూ ఆహ్వానించాడు. నిన్ను మాత్రం కావాలనే పిలవలేదు. ఋషులు హితబోధ చేసినా వినకుండా గర్వంతో

వినలేదు. పైగా నిన్ను దూషించాడు. శివుణ్ణి దూషిస్తూ చేసే యజ్ఞం అదేమి యజ్ఞం. అసలు అలాంటి కార్యక్రమం పొసగుతుందా. నీవు వద్దంటున్నా తండ్రి చేసే యజ్ఞం చూడటానికి వచ్చిన తన సొంతకూతురు సతీదేవిని కూడా అమర్యాదగా చూశాడు దక్షుడు. ఆమె ముందే నిన్ను దూషించాడు. అవమానిత అయిన సతీదేవి పతిదూషణ సహించలేక యోగాగ్నిని కల్పించుకొని ఆత్మాహుతి చేసుకున్నది. ఈ విషయం తెలిసి, పరమేశ్వరా, నీవు భయంకరుడవై వీరభద్రుని సృష్టించి దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేసి, ఆ యాగానికి వచ్చిన వారినందరినీ శిక్షించి ఒక్కొక్కరినీ వాయగొట్టి దక్షుని తలనరికావు. శివదూషణ ఫలితం అనుభవించాడు దక్షుడు. తరువాత తన తప్పు తెలుసుకుని ప్రార్థిస్తే దక్షునికి పొట్టేలు తల అమర్చి బ్రతికించావు. నిన్ను తృణీకరించి మదంతో ప్రవర్తిస్తే పుట్టగతులు ఉంటాయా ఎవరికైనా. అలా చేపట్టిన కార్యాలు గట్టెక్కుతాయా. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

18

**మ .జగతీ చక్రము పాదఘట్టన సదృశ్యంబై ప్రవర్తింపగా**

**గగనం బంతయు బాహుమండల సమగ్ర వ్యాప్తులం దద్భుతం**

**బుగ ఘూర్ణిల్ల నజాంత్య వేళల సముద్భూతాంగ హారావళుల్**

**నిగుడం బొంగి నటింతు తాండవ మహా నృత్యంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీవు నటరాజువు. నీ తాండవనృత్యం సర్వభువన ప్రసిద్ధం. కైలాస శిఖర మైదానాలమీద మునిమాపు సమయంలో తల్లి పార్వతీ నీవూ సంధ్యానృత్యం చేస్తుంటారట. కానీ నీవు కల్పాంత వేళలో చేసే మహా తాండవానికి ఈ సర్వ జగత్తూ రంగస్థలి. ఆ తాండవ నృత్యకేళికి నీ శరీరపు అవయవాలన్నీ ప్రకంపిస్తుండగా నీ నాట్య విన్యాసంతో ఆకాశమంతా ఘూర్ణిల్లిపోతుంది. ఆ ఉత్సాహంలో నీ సర్వాంగాలూ పొంగి నిగిడి నీ బాహు మండల చాలన విశేషం రోదసి నిండా సమగ్రంగా నిండిపోతుంది. అలా సర్వజగత్తునూ నీ నాట్యరంగంగా చేసుకొని ఆకాశాన్ని ఆక్రమిస్తూ మహాతాండవాన్ని నిర్వర్తించే ఓ మహా లయకారకా! నా తండ్రీ! నీ పాదాలకు మ్రొక్కులు!

19

**మ.అమరేంద్రాబ్జభవాళికెన్న దుది నీ వాదిం బ్రసాదింప న**
**ర్థము సిద్ధించుచు నుండుగాని,సురమాత్రుం గోరిన న్వీరి కా**
**ర్యము సిద్ధింప దనేక మార్గముల బ్రారంభించిరే నిశ్చయా**
**ర్థముగా నీవ సమస్త కర్త వగుటం దర్శింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, ఈ సర్వ ప్రపంచాలకూ నీవే కర్తవు. నీవే భర్తవు. నీవే హర్తవు. ఎవరికి ఏ ప్రయోజనం సిద్ధించాలన్నా కేవలం నీవే ప్రసాదించాలి. ఆఖరికి దేవేంద్రుడికైనా, బ్రహ్మ దేవునికైనా ఇతర దేవతల కెవరికైనా కేవలం నీ అనుగ్రహం వల్లనే ఏదైనా సిద్ధిస్తుంది. ఏ ఇతర దైవాన్ని కోరినా వారెవరూ ఏదీ స్వతంత్రంగా ఈయగల సమర్థులు కారు. మానవులుకానీ, దేవతలుకానీ అనేక మార్గాల్లో అన్య దైవాలను సేవించి ఏ ప్రయోజనమూ సిద్ధింపక సమస్తకర్తవైన నిన్నే నిశ్చయార్థంగా ఆశ్రయించి నీ వలననే కార్యసాఫల్యం పొందారు, పొందుతున్నారు. ఒక్కదైవాలను పదేపదే కొలుస్తుంటారు కొందరు. అలా కాదు. కొలిస్తే నిన్నే కొలవాలి. మోక్షం ప్రసాదిస్తే

నీవే ప్రసాదించాలి. అంతే!  వేరేమాటలేదు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( పెక్కు రు బక్కదైవముల వేమరు గొల్చెద రట్లు కాదయా, మ్రొక్కిన నీకె మ్రొక్కవలె, మోక్షమొసంగిన నీవయీవలెన్, తక్కిన మాటలేమిటికి దాశరధీ కరుణా పయోనిధీ _ అన్నాడు దాశరథీ శతకంలో రామదాసు(కంచెర్ల గోపన్న ). ఈ పద్యం లోని భావమూ దాదాపు అదే.)

20

**మ. అమరంగా స్ఫుట భక్తి నాటకము భాషాంగ క్రియాంగాభి ర**

**మ్యముగా జూపిన మెచ్చి,మీరిల బలే యన్నంతకుస్,యోని గే**

**హములస్ రూపులు బన్నుకొంచును నటుండై వచ్చి,సంసార**

**రం**

**గములోనం బహురూపమాడు వెలయంగా జీవి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, ఈ ప్రపంచమంతా నీ దర్శకత్వంలో, నీనిర్వాహకత్వంతో, నీ ఇచ్ఛావిధిగా నడుస్తున్న ఒక నాటక రంగస్థలం. మాతృ గర్భాలద్వారా జీవులన్నీ తలా ఒక రూపంతో ఈలోకంలోకి ప్రవేశించి తమ తమ పాత్రలను నిర్వర్తిస్తూ, సమయంకాగానే తెరవెనక్కు తప్పుకుంటుంటారు. జీవన పరమార్థమేదో తెలియకుండానే _ పునరపి జననం పునరపి మరణం అన్నట్లుగా ఈ జనన మరణ చక్రంలో చర్వితచర్వణు లౌతూ ఉంటారు. వారు పాల్గొనే ఈ జగన్నాటకంలో_అంటే వారి జీవనయానంలో, నీవునచ్చి మెచ్చితేనే వారికి జన్మ రాహిత్యమూ, ముక్తీని. వారికి స్ఫుటమైన భక్తి ఉంటేనే గదా

నీవు నచ్చేదీ, మెచ్చేదీ, అంగీకరించేదీ. ఆ భక్తి కూడా వారు భూషాంగ,  క్రియాంగ రమ్యముగా చూపితేనే నీవు భళీ అంటావు. భూషాంగము, క్రియాంగము అంటే ఆహార్యమూ, నటనా అని పైపై అర్థం. మనో , వాక్, క్రియలకు ఏకత్రమైన సిద్ధీ, శుద్ధీ వుండే స్ఫుటమైన భక్తి అని అసలర్థం. అలాంటి భక్తిగల జీవుల వర్తననే మెచ్చుకొని వారి బ్రతుకులను సార్థకం కావించి వారిని ధన్యులను చేస్తావు నీవు. అప్పటి దాకా, "యోని గేహములన్_రూపులు బన్ను కొంచు ను_నటుండైవచ్చి_ సంసార రంగములో నన్_బహురూపులై" ఆడుతూనే ఉంటాడు జీవి. అంటే, జీవి తరించడానికి నీ పాదాలపై స్ఫుటమైన, త్రికరణశుద్ధియైన భక్తి ఒక్కటే మార్గం. నాతండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( గేహము= ఇల్లు)

21

**శ్రీ వత్సాంకు రమావిశేషతయు,,వాక్ప్రినాథు చాతుర్య మున్
దేవాధీశ్వరు వైభవోన్నతియు,నా తిగ్మాంశు తేజంబు శ్రీ
దేవీనందను రూపవిభ్రమము,చింతింపంగ నీ భక్తి స
ద్భావాత్ముండగు పుణ్యమూర్తి కి దృణ ప్రాయంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా! నీ పాద సరోజములందు ఏకాగ్రమైన భక్తి ప్రపత్తులు కలిగి, ఆ భక్త్యామృతం నిరంతరం సేవిస్తూ, చొక్కి, పారవశ్యంతో నిన్నే భావించే భక్తునికి ఈ ప్రపంచంలోని ఇతర వైభవాలూ, ఐశ్వర్యాలూ అన్నీ గడ్డిపోచతో సమానం. కౌస్తుభ మణినీ, సాక్షాత్తూ లక్ష్మీదేవిని వక్షస్థలంలో ఉంచుకున్న విష్ణుమూర్తి ఐశ్వర్యం గానీ, వాణీ నాథుడైన ఆ చతురానన బ్రహ్మ చతురత గానీ, త్రిలోక రాజ్య వైభవోన్నతుడైన దేవేంద్రుని ప్రాభవం గానీ , ఆ సూర్యదేవుని దుర్నిరీక్ష్య మైన తేజస్సు గానీ, లక్ష్మీపుత్రుడైన మన్మధుని రూపసౌందర్యాతిశయం కానీ, ఇవన్నీ నీ భక్తి సౌభాగ్యం కలిగిన పుణ్యాత్మునికి కేవలం తృణ ప్రాయాలు. నీ పై నిక్కమైన భక్తి కలిగిన వారిని ఈ ప్రపంచం లోని

ఏ ఐశ్వర్యాలూ మోహింప జేయలేవు. సర్వ ప్రాభవాలకన్నా మహనీయమైనది నీ పాదాలపై భక్తి.నా తండ్రీ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

( శ్రీ వత్సాంకుడు = విష్ణువు,వాక్ఛ్రీనాథుడు = బ్రహ్మ,తిగ్మాంశుడు = సూర్యుడు)

22

మ.

**ఇల సద్భక్తుల పాదధూళి పటలం బే మర్త్యు ఫాలంబునం**

**జిలుకున్,వా డపవర్గ నాథుడనినన్ సిద్ధంబు గా వారి ని**

**ర్మల హస్తార్పిత భూతి బ్రీతి నొసలారం బూయు విశ్వాసికిన్**

**ఫలమూహించి విధించి యెవ్వరికి జెప్పన్వచ్చు సర్వేశ్వరా!**

( శైవుల దృష్టిలో శివభక్తునికీ శివునికీ భేదం లేదు.శివభక్తుని శివుని లాగే పూజించాలి.వీబూది అత్యంత పవిత్రమైనది.లింగమును ధరించిన భక్తుడు సాక్షాత్తూ శివుడే)

ఓ పరమేశ్వరా,నీ భక్తుల పాదధూళి ఎవరు నొసట ధరిస్తారో వాడు సాక్షాత్తూ అపవర్గనాథుడు. అంటే మోక్షాన్ని కైవసం చేసుకున్న వాడు. ఇక శివభక్తుడు తన పావన హస్తాలతో ప్రసాదించే వీభూదిని స్వీకరించి, ఆ భస్మాన్ని పరమ భక్తితో తన నుదుట పూసుకునే విశ్వాసికి లభించే ఫలితం ఇంతా అని నిర్ణయించి చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు. విశ్వాసికి అంటే భక్తి విశ్వాసాలతో ధరించాలన్న మాట. అలాంటి మహాత్మునకు మోక్షమూ, అనంతైశ్వర్యమూ కరతలా మలకం.

ఇందుకు సందేహం లేదు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

23

మ.

**పలుతీర్థంబులు గ్రుంకుకంటె మహిలో భక్తాంఘ్రి పానీయముల్**

**తలమీదం జిలికించు కున్న శుచి,తీర్థంబాడ భారంబు త**

**త్ఫల మత్యల్పము,భక్త పాద యుగళాంభ స్పర్శ నిర్భారమై**

**యలరుస్,శాశ్వత భుక్తి, ముక్తి,ఫలదంబై యుండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, లోకంలో జనాలు పుణ్యక్షేత్రాలనీ, తీర్థాలనీ, ఎక్కడెక్కడికో పోతుంటారు. ఎన్ని వాగుల్లోనో మునుగుతుంటారు. ఇలా తీర్థాలలోకి పోయి మునుగులాడే కంటే శివభక్తుల పాదతీర్థాన్ని తలమీద చిలకరించు కుంటే మనిషి పవిత్రుడౌతాడు. ఆతీర్థమనీ ఈ నది అనీ దూరాలు తిరగడం ఎంత కష్టం . కష్టమనేదే కాకుండా ఫలంకూడా అత్య ల్పము. భక్తుల యొక్క పాదాల స్పర్శ కలిగిన నీటిని మించిన తీర్థం ఏమీలేదు. పైగా దాని కోసం దేశదేశాలూ తిరగక్కర లేదు. అదేమీ భారమైన పని కాదు. శివభక్తుల పాదతీర్థ స్పర్శ శాశ్వతమైన భుక్తినీ, ముక్తినీ ప్రసాదిస్తుంది. శివభక్తులు సాక్షాత్శివులు. వారిచ్చే విభూదీ, వారి పాదతీర్థమూ మోక్ష

దాయకాలు. అది తెలుసుకోకుండా ఆ ఏట్లో ఈ ఏట్లో మునగడం కేవలం వృధా.  నా తండ్రీ! సర్వే శ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు! ( భక్తాంఘ్రి= భక్తుల పాదములు,పాద యుగ ళాంభ స్పర్శ= రెండు పాదముల నీటి స్పర్శ) .

24

మ.

**రమణస్ భక్త సమగ్ర దర్శనము తీర్థశ్రేణి,సద్గోష్ఠి తీ**

**ర్థము,తద్దివ్య దయావలోకనము తీర్థం బెన్నగా నిట్టి జం**

**గమ తీర్థాంబుధి నోలలాడక,వివేక భ్రష్టులై పోయి లో**

**కములో తీర్థములంచు నేఱులు నొఱంగా నేల సర్వేశ్వరా!**

యథావాక్కుల అన్నమయ్య వీరశైవుడు. వీరశైవులకు జంగముడే శివుడు. శివభక్తులకూ శివునికీ వారి దృష్టిలో తేడాయే లేదు. యాత్రలూ, తీర్థాలూ ఏమాత్రం ముఖ్యమైనవి కావు. ఆ సంగతి ప్రతి పద్యంలో నూ పదేపదే చెపుతాడు.

ఓ పరమేశ్వరా,ఈ లోకంలో జనం వివేకం భ్రష్టమైపోయి పుణ్యతీర్థాలనీ, తీర్థయాత్రలనీ అనవసరంగా తిరుగు తుంటారు. ఆ నదిలో ఈ నదిలో మునుగుతుంటారు. వాస్తవానికి శివ భక్తుల సమగ్ర దర్శనమే తీర్థ దర్శనము. వారితో గోష్ఠి చేయడమే తీర్థము. భక్త జంగముల దయా దృష్టియే తీర్థము. అటువంటి పవిత్రులైన శివభక్తుల దర్శనమూ, గోష్ఠి, వారి సేవా, వారి

పాదతీర్థమూ, వారిచ్చే విభూదీ. ఇవి అసలైన తీర్థాలు. ఈతీర్థ సముద్రంలో మునకలు వేయకుండా తీర్థాలంటూ ఆనదిలో ఈనదిలో మునకలెందుకు! నా తండ్రీ ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

25

మ.

**కమనీయంబగు సర్వతీర్థములు లింగంబున్నచో మూర్తిమం**
**తములై యొప్పుచు నుండు,లింగమును తాత్పర్యంబుతో భక్త గా**
**త్రములం దెప్పుడు నుండుగాన మహిలో తత్వార్థ మూహింప దీ**
**ర్థములం దెల్లను దివ్యతీర్థము భవద్భక్తుండు సర్వేశ్వరా!**

ఓపరమేశ్వరా, శివభక్తులైనవారు ఎప్పుడూ లింగమును మెడలో ధరించి ఉండటం తప్పనిసరి. ఎక్కడ లింగ ముంటుందో అక్కడ ప్రపంచం లోని సర్వ క్షేత్రాలూ తీర్థాలూ కొలువై ఉంటాయి. శివభక్తుడైన వాడు అఖండమైన భక్తి తాత్పర్యాలతో లింగమును తన దేహం మీద నిత్యమూ ధరించి ఉంటాడు కాబట్టి అతనిలో సర్వతీర్థాలూ నిలిచి ఉంటా యి.ఆందువలన అన్ని తీర్థాలలోకీ పావనమైన, దివ్యమైన తీర్థం నీభక్తుడే. లింగము సర్వ పాపాలనూ పోగొడుతుంది. లింగమే సర్వైశ్వర్యాలనూ ఇస్తుంది. లింగమే మోక్షప్రదాయిని. శివ భక్తుడంటే సాక్షాత్తూ శివుడే కాబట్టి వారిని సేవిస్తే నిన్ను

సేవించినట్లే. ఆ క్షేత్రమనీ ఈ తీర్థమనీ మరెక్కడికీ తిరగక్క
ర్లేదు.నా తండ్రీ !సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

26

మ.

**ధరణిం దీర్ఘము లాడుకంటె నతిమోదంబొప్ప యజ్ఞంబులం**

**బరగం జేయుట కంటె సువ్రతము లొప్పం వేదశాస్త్రార్థ త**

**త్పరుడై యాదట జల్పుకంటె మది నుత్సాహించి నీ భక్తి త**

**త్పురుష శ్రేష్ఠుల బూజసేయుట మహా పుణ్యంబు సర్వేశ్వరా!**

క్షేత్రదర్శనాలూ, తీర్థస్నానాలూ, యజ్ఞ యాగాదులూ, నోములూ, వ్రతాలూ వీటన్నింటికీ వీరశైవంలో ఏమాత్రం ప్రాముఖ్యం లేదు. వారి దృష్టిలో ఇవన్నీ పనికిమాలిన పనులు. యథావాక్కుల అన్నమయ్య ప్రతి పద్యంలోనూ ఈ సంగతి పదేపదే చెపుతాడు

ఓ పరమేశ్వరా, తీర్థస్నానాలు అంటూ నదుల్లో మునగడం వృథా. యజ్ఞ యాగాలు చేయడం దండగ. వ్రతాలనీ నోములనీ అనవసర ఆర్భాటాలు చేయడంవల్ల ప్రయోజనం శూన్యం. శ్రద్ధతో శివభక్తులను రావించి వారిని భక్తితో సేవించడం వీటన్నిటికన్నా పుణ్యమైన కార్యము. అవివేకులు ఆవిషయం

తెలుసు కోకుండా ఏ ఫలితమూ ఇవ్వని ఈ పనులన్నీ చేస్తుంటారు. శివభక్తుడంటే కళ్ళ ఎదుట ఉన్న పరమశివుడే అని అర్థంచేసుకోరు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

27

మ.

**భవదీయామల తత్వ నిర్ణయ కళా ప్రఖ్యాత సద్భక్త పుం**

**గవ గోష్ఠీ సుఖవార్ధి లోన గడు వేడ్కం దేలినంగాక యీ**

**భువిలో తీర్థ జలంబులం గడిగినం బోనేర్చునే ఘోర దు**

**ర్భవ సంఘాకలితాత్మ తామస మహా పంకంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, మానవులు ఈ జనన మరణ చక్రంలో చిక్కుకుని అవస్థలు పడుతుంటారు. పుట్టిన తర్వాత సంసారపు వలలోపడి సతమతమౌతుంటారు. ఈ పుట్టుకా, ఈ సంసారమూ అనేది ఒక పెనుచీకటి. ఇదొక ఊబి. బురద. ఈ బురదను కడగడానికి ఏ తీర్థ స్నానాల వల్లా ప్రయోజనం లేదు. ఈ జన్మపరంపరల చీకటీ మాలిన్యమూ పోవాలంటే ఒక్కటే మార్గము. నీ పాదాలదాపుకు చేరడమే. ఆదారిని చూపించేవారు నీ తత్వాన్నీ, నీ మహత్వాన్నీ తెలుసుకొని అది ఇదీ అని నిర్ణయించగల కళానిపుణులైన నీ భక్తులే. అటువంటి భక్త శ్రేష్ఠుల సద్గోష్ఠి అనే సముద్రంలో మునిగితే తప్ప ఆ మాలిన్యమూ ఆ బురదా పోదు. ఆ తామసం అంతరించదు.

నిన్ను చేరే త్రోవా, ఈ భవసాగరాన్ని తరించడానికి నావా, ఒక్కటే. నీభక్తుల సేవ. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( భవదీయ= నీయొక్క,సద్భక్త పుంగవులు= శ్రేష్ఠులైన భక్తులు,దుర్భవ సంఘము= ఘోర మైన జన్మలపరంపర.తామసము= చీకటి, శంఖము= ఋరద)

28

మ.

**ధరణిం బ్రాక్తన భక్త నిర్మిత మహా స్థానంబు లై యొప్పు శ్రీ**
**గిరి ముఖ్యంబగు దివ్యతీర్థములు భక్తిం జూచిరే వారి దు**
**స్తర దోషంబులు వాయునన్న మరి సాక్షాద్భ క్తులం జూచినం**
**బరమార్థంబుగ బాయదే నరుల పాపంబెల్ల సర్వేశ్వరా!**

ఇంతవరకూ చెప్పిన అన్ని పద్యాల్లోనూ తీర్థాలను ఈసడిస్తూనే వచ్చాడు ఈ కవి. కానీ ఈ పద్యంలో కొంత మినహాయింపు ఇచ్చాడెందుకో. క్షేత్రం వద్దు, తీర్థం వద్దు అని ఎంత కరాఖండిగా చెప్పినా భక్తుడనేవాడికి క్షేత్రాలన్నా తీర్థాలన్నా ఎంతోకొంత ఆసక్తీ, ప్రశ్రయమూ ఉంటూనే ఉంటుంది. చిత్తశుద్ధిలేకుండా, మనసులో భక్తి అనేది లేకుండా ఎన్ని క్షేత్రాలు తిరిగినా ఏం ప్రయోజనం అని చెప్పడం బాగానే ఉంటుంది గాని అసలు క్షేత్రాలనే నిరాకరించడం సరైనదేనా. కొంచెం గందరగోళ పడ్డాడు ఈ కవి అనిపిస్తుంది. ప్రాక్తన భక్త నిర్మిత మహా క్షేత్రాలైన శ్రీశైలంలాంటి ముఖ్య దివ్య తీర్థాలు భక్తితో దర్శిస్తే ఘోరపాపాలు పోతాయని కొంత అంగీకరించాడు

ఈ పద్యంలో. ప్రాక్తన అంటే పూర్వపు  మహాభక్తులు నిర్మించిన శ్రీగిరి లాంటి దివ్య క్షేత్రాలు అని స్పష్టంగానే చెప్పాడు. అలాంటి తీర్థాలను చూస్తే పాపాలు పోతాయంటే మరి సాక్షాత్తూ శివ భక్తులను దర్శిస్తే మానవుల సర్వపాపాలూ హరిస్తాయి గదా అని అంటున్నాడీ పద్యంలో. శివభక్తుల పవిత్రతనూ, వారి సేవ సకల పాపహరమూ అని చెప్పడం కోసం క్షేత్రాలను వ్యతిరేకించడం అనేది విపరీతపు భావన అనిపిస్తుంది. వీరశైవులది కొంత విపరీత ధోరణే.ప్రాచీన మహా భక్తులచే నిర్మింపబడిన శ్రీశైలం లాంటి పుణ్యక్షేత్రాలు భక్తితో దర్శిస్తే ఘోరమైన పాపాలూ పోయేట్లయితే సాక్షాత్తూ భక్తులనే సేవిస్తే మానవుల పాపాలన్నీ పోతాయిగదా అనేది ఈ పద్యం తాత్పర్యం. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

29

**మ. కని సద్భక్తుల కంతనంత గడు వేడ్కన్ హృత్ప్రణామంబు సే**
**సిన మాత్రం జెడు సర్వదోషములు, తచ్ఛ్రీపాదముల్ ముట్టి మ్రొ**
**క్కిన సర్వాంగ సమగ్ర శుద్ధియగు,భక్తిన్ వారికిన్ బ్రీతి జే**
**సిన ద్వద్దివ్య దయావలోకన ఘన శ్రీ లొందు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ భక్తులు కన్పించినంతనే వారికి వినయంగా భక్తిపూర్వకంగా నమస్కారం చేస్తే చాలు, అన్ని పాపాలూ హరించిపోతాయి. వారి పవిత్రమైన శ్రీపాదాలకు మ్రొక్కితే చాలు, సర్వదేహమూ సంపూర్ణంగా పరిశుద్ధ మౌతుంది. ఇక వారికి ప్రీతి కలిగేట్లుగా ప్రవర్తిస్తే నీవు సంతోషిస్తావు. నీ అపారకృపా దృష్టిని ప్రసరింప జేసి అఖండమైన ఐశ్వర్యాలను ప్రసాదిస్తావు. నీ భక్తులను సేవిస్తే నీవు తృప్తుడవౌతావన్న మాట. వారు తృప్తిపొందేట్లు వారికి సేవలు చేస్తే అట్టివారిపై నీకు కృప కలుగుతుంది. వారికి ఘనమైన వైభవ ప్రాభవాలను దయచేస్తావు. నీ భక్తులంటే నీకు అంత ప్రీతి! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

30

**మ. జలజాత ప్రభవాచ్యుతాదులు మదిం జర్చించి,చర్చించి నీ**
**కలరూపారయలేక చిక్కుల బడంగా నిన్ను హస్తార్పితా**
**మలక వ్యాప్తికి దెచ్చి యేర్పరచి సంబంధించి చేకొన్న భ**
**క్తుల శౌర్యం బుపమింప నెవ్వడు సమర్థుండింక సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, సృష్ట్యాది కాలంలో ఆవిర్భవించిన నీ లింగమును చూచి బ్రహ్మ, విష్ణువూ ఆశ్చర్యపోయి ఇదేమిటి దీనికి మొదలెక్కడ, తుది యెక్కడ అని తెలుసుకునేందుకు చెరొకవైపుకూ పోయి వెదికారట. ఇద్దరికీ నీ ఆద్యంతాలూ అసలు రూపమూ తెలుసుకోవడం చేతకాలేదు. విష్ణువు బొడ్డుతామరలో పుట్టిన బ్రహ్మకూ, ఆ బ్రహ్మనే పుట్టించిన అచ్యుతునికీ నీ నిజతత్వము తెలుసుకోవడం సాధ్యం కాలేదు. కానీ నిన్ను భక్తి తత్పరతతో సేవించే నీ భక్తులే నీ కలరూపును కనుగొని కరతలామలకం అయ్యేలా వ్యాప్తిలోకి తేగలిగారు. బ్రహ్మ విష్ణువులైనా సరే, నీ భక్తి లేకుంటే ఏమీ చేయలేరు. నీ భక్తులే నిజంగా వారికన్నా సమర్థులు. నీ భక్తుల సామర్థ్యం

ఇంతా అని వివరించి చెప్పడం ఎవరికి చేతనౌతుంది. నా తండ్రీ !సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

31

**మ. అమరస్ భక్త గణాత్మ మధ్యమము లింగావాస మీ లింగమ**
**ధ్యమముం పద్మభవాండభాండ నిలయంబై యుండుటస్ భక్త**
**తృ**
**ప్తి మహాలింగము తృప్తియై మహిమ నుద్దీపించు,తల్లింగ తృ**
**ప్తి మహత్త్వంబున నీ సమస్తమును దృప్తింబొందు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ భక్తుల యొక్క ఆత్మలో నీవు లింగరూపిపై నివసిస్తుంటావు. ఆ లింగం లోపల సర్వ బ్రహ్మాండ భాండాలూ, ఈ చరాచర జగత్తులూ భద్రంగా ఉంటాయి . కాబట్టి శివభక్తుడు తృప్తి చెందితే పరమలింగం తృప్తి చెందుతుంది. ఆ లింగం తృప్తి చెందితే ఆ లింగ మహత్త్వంతో సర్వలోకాలూ తృప్తి చెందుతాయి. అంటే, శివభక్తుని సంతోషమే సకల సృష్టి యొక్క సంతృప్తికీ మూలమన్న మాట. కావున శివభక్తులను సాక్షాత్తూ నిన్నుగానే భావించి సేవించాలి. సర్వలోకాలూ లింగంలో ఉంటే, ఆ లింగం శివభక్తునిలోఉంటే ఇక భక్తుని ఆనందమే జగదానంద

కారకం గదా! శివభక్తుల సేవనం ఎంత గొప్పదో అర్థమౌతున్నది గదా. నా తండ్రీ !సర్వేశ్వరా !నీ పాదాలకు మ్రొక్కులు!

32

**మ. అనురాగంబున నిన్నుజూచు,దల పోయుస్,జొక్కు,కాంక్షించు,వ**
**ర్ణన సేయం దమకించు,సిగ్గు విరియస్ ప్రార్థించు,శోషించు,నం**
**త నెదస్ ధ్యానము దాల్చు,దన్ను మరచుం దానీ దశావస్థలం**
**దనరంగా మది నిన్ను దక్కగొను సద్భక్తుండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,నీకు సద్భక్తుడైనవానికి నీవే సర్వమూ. నిన్ను హృదయంలో స్థిరంగా, శాశ్వతంగా నిలుపుకునే క్రమంలో అనేకమైన దశలను అనుభవిస్తాడు. అనేకమైన అవస్థ లను పొందుతాడు. అన్నీ నిన్ను గురించే. 1) ఎంతో భక్తితో, ప్రేమతో నిన్ను దర్శిస్తాడు 2) మనస్సులోనే మననం చేసుకుంటూ ధ్యానిస్తాడు. 3) పరవశం పొందుతాడు. 4) నీపై కోరికను పెంచుకుంటాడు. నిన్నే కాంక్షిస్తాడు. 5) తాను చూస్తున్న నీ దివ్యరూపాన్నీ, నీ మహత్త్వాన్నీ వర్ణన చేయడానికి త్వరపడతాడు. 6) సిగ్గును మనసులోకి రాకుండా చేసుకుంటాడు. 7) ప్రార్థిస్తాడు. 8) శోషించిపోతాడు. 9) హృదయంలో నిన్ను కుదురుగా నిలుపుకొని నిన్నే ధ్యానం చేస్తాడు. 10) ఇక తన్ను తాను మరిచి పోతాడు. దేహభ్రాంతి

నశిస్తుందన్న మాట.    ఈ పది అవస్థల్లో పయనించి నిన్ను స్థిరంగా మనస్సులో ప్రతిష్ఠించుకుంటాడు. ఏకాగ్రంగా నిన్నే భావిస్తూ ఈ దశలన్నీ అనుభవించి నిన్ను అందుకుంటాడు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీపాదాలకు మ్రొక్కులు!

33

**మ. ఎలమిన్ భక్తుడు వక్రుడై నడిచెనే నేపారగా దానికిం**
**గలుషింపం,గలహింప,గింకిరిపడం గాదెట్టిచో నైన ని**
**ర్మల గంగా పృథుల ప్రవాహ మరయం బ్రస్ఫూర్తి దానెన్ని వం**
**కలుగా బారిన దాని నోండు బలుకంగా జన్నె సర్వేశ్వరా!**

వీరశైవభక్తులది కొంతతీవ్రమూ విపరీతమూ ఐన ధోరణి. వారి విశృంఖలత్వం కారణంగానో చాదస్తంతోనో మొండితనంతోనో అప్పుడప్పుడూ పొరపాటుగా ప్రవర్తిస్తారు. శివభక్తుడైనవాడు అలా ఎప్పుడైనా తప్పుగానో, క్రమ విరుద్ధంగానో ప్రవర్తిస్తే అతన్ని నిరసించ గూడదు అంటున్నాడు అన్నమయ్య ఈ పద్యంలో. ఒక చక్కని పోలిక కూడా చెప్పాడు. ఆయన కాలంలో శివ భక్తులు కొంత దుందుడుకుగా ఉండేవారనీ, కవి దానిని గమనించాడనీ అర్థమౌతున్నది.

ఓ పరమేశ్వరా, ఎప్పుడైనా శివభక్తులు వక్రంగా ప్రవర్తించినా అతన్ని తప్పుపట్ట కూడదు. అతనితో కలహించ

కూడదు. కోపగించుకో గూడదు. ఎందుకంటే శివభక్తుడు సాక్షాత్తూ శివుడే కాబట్టి. నిర్మలమైన గంగానదీ ప్రవాహం దాని వేగంవల్లనో, వరదకారణంగానో వంకరటింకరగా ప్రవహించొచ్చు. అంత మాత్రం చేత ఆ నది పవిత్రత తగ్గుతుందా. ఆ నదిని నిరసిస్తామా. అలాగే వక్రంగా ప్రవర్తించి నా శివభక్తు డెప్పుడూ వందనీయుడే. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

34

మ.

**సికతా ధామము నీకు జేసి ,మదిలో జెన్నొంది క్రీడించు బా**

**లకు లింద్రాధికులన్న,నీ గుడు లతి శ్లాఘ్యేష్ట కాష్ఠాదులస్**

**సుకుమారంబుగ నెత్తి భూతలములో శోభిల్లు వంశ ప్రదీ**

**పకు సౌభాగ్యము మాన నెవ్వరికి జెప్పన్వచ్చు సర్వేశ్వరా!**

ఈ పద్యములో కవి శివాలయాలు నిర్మించే వారి గొప్పతనాన్ని వివరిస్తున్నాడు.

ఓ పరమేశ్వరా,సముద్రపుటొడ్డున ఇసుకతో నీ గుడులు కట్టి నీ లింగాన్ని పెట్టి ఆడుకుంటూ ఆనందించే బాలురు ఇంద్రునికన్నా గొప్ప వారు. అమా యకంగా వారు చేసే పనీ, ఆడే ఆటలూ నీ గుడీ నీ లింగమూ కలిగి ఉన్నాయి గాబట్టి వారిని పుణ్యాత్ములుగా చేస్తున్నాయి. ఇక మంచి మంచి ఇటుకలూ కలపా ఉపయోగించి జాగ్రత్తగా సుకుమారంగా లోకంలో నీ ఆలయాలు నిర్మించేవాడు తన వంశానికి గొప్ప పేరు తెచ్చి వంశోద్ధారకుడౌతాడు. అటువంటి వారి పుణ్యమూ

సౌభాగ్యమూ ఎంతని చెప్పగలం .నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( సికతా ధామము=ఇసుక గుడి, శ్లాఘ్య ఇష్టకాష్ఠాదులు= మంచి మంచి ఇటుకలూ, కలపా మొదలైనవి)

35

మ.

**భవదభ్యర్చనవేళలన్ భవుల సంపద్భ్రాంతులన్,దీనమా**
**నవులన్ విద్విషులన్ భవాతురుల సన్మానించుటల్ సౌఖ్యము**
**ఖ్య విహారేచ్ఛలు నీమహత్వములు నిత్యానందమూహించుచో**
**భువి నీ భక్తుల కాత్మలో విరసముల్ పుట్టించు సర్వేశ్వరా!**

శివభక్తులు కాని వారిని వీరశైవులు నిరసిస్తారు. అలాంటి వాడిని వారు 'భవి' అంటారు. మహమ్మదీయులు కాని వారిని ముస్లిములు 'కాఫిర్లు' అని పేర్కొని ద్వేషించినట్లు శివ భక్తులు శివునితమలాగా భావించి సేవించనివారిని 'భవులు' అని పేర్కొని ద్వేషించేవారు. ఈ పద్యం అలా భవులను నిరసించేదే.

ఓ పరమేశ్వరా,నిన్ను పూజించే సమయంలో నీ భక్తులు కాని దీన మానవులను, సంపదల మీద భ్రాంతితో నిన్నుకాదనే వారినీ, విద్వేషులనూ, శివద్వేషుల మీద ఆదరం కలవారినీ చూస్తుంటే విరసం కలుగుతుంది. నీ మహత్త్వము

నిత్యానందదాయకమైనది. అలాంటి నీ పాదాలను శరణు కోరకుండా సౌఖ్యంమీదా విహారాలమీదా కోరిక కల్గిన ఈ భవులు ఎంతో తిరస్కారానికి అర్హులు. వీరి ధోరణి ఎంతో నిరసన కలిగిస్తుంది.నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

36

**మ. కరుణం జేకొనిరేని రౌరవ పద గ్రస్తాత్తు దేవేంద్రుగా**

**బరగం జేయుదు,రాత్మలో నలిగిరేబర్జన్యు నా రౌరవో**

**త్కర పంక ప్రవిలీన కీటకముగాగల్పింతు రన్నట్టిచో**

**నరయస్ భక్తుల శక్తి యెట్లు గురి సేయస్ వచ్చు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ భక్తులు సర్వశక్తి సంపన్నులు. కోపిస్తే శాపాన్ని ఈయగలరు. అనుగ్రహిస్తే ఆదరించి ఐశ్వర్యాన్ని ప్రసాదించగలరు. వారు తలచుకుంటే చేయలేనిది లేదు. కరుణ జూపి చేరదీస్తే రౌరవాది మహాఘోరనరకాలలో బాధలనుభవించే వాడికి మహేంద్ర భోగాలను ప్రసాదించ గలరు. మనస్సులో ఆగ్రహిస్తే ఇంద్రుడినైనా ఆ రౌరవ నరకాల బురదలో కీటకంగా పడివుండే దుస్థితి దాపురించేలా చేయగలరు. శివభక్తుల సామర్థ్యం అంతా ఇంతా అని నిర్ణయించి వివరించడం ఎవరికీ సాధ్యం కాదు. వారి శక్తిని ఎదుర్కొని నిలవడం కూడా ఎవరికీ సాధ్యం కాదు. నా తండ్రీ ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

37

**మ. రమణీయ క్షితిపాలు డింద్రుని చతుర్మాస క్రమా యుష్యుడా**
**యమరేంద్రుం డజు నాడికాద్వయము వాడా బ్రహ్మయుష్మన్నిమే**
**షము వాడంచును వీరిసెల్ల నగు నీ సాలోక్య సామీప్య స**
**త్తమ రాజ్యస్థితి పట్టభద్రుడగు సద్భక్తుండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ సద్భక్తుడు నీలోకంలో నీతో పాటు ఉంటాడు. నీకు సమీపాన ఉంటాడు. అంటే నీ సాలోక్యాన్నీ సామీప్యాన్నీ కలిగి ఉండే పరమ సౌభాగ్య పూరితమైన మహా సామ్రాజ్యాన్ని పొంది ఉంటాడు. ఇక వానికి లయమే ఉండదు. శివభక్తుడు కానివాడు మహారాజు అయినా సరే వాని ఆయుష్షు కేవలం ఇంద్రుని యొక్క నాలుగు నెలల కాలంతో సమానం. ఆ ఇంద్రుడి ఆయుష్షు బ్రహ్మదేవుని రెండు గడియల కాలమంత. ఇక ఆ బ్రహ్మఆయుస్సు మాత్రమెంత. కేవలం నీకు ఒక నిముషం పాటు ఎంతో అంత. ఈ అల్పాయుష్కులైన రాజూ, ఇంద్రుడూ, బ్రహ్మ మొదలైన వారిని చూచి నిరంతరానందాన్ని నీ సాన్నిధ్యంలో అనుభవించే శాశ్వతులైన శివభక్తులు

నవ్వుకుంటారు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

38

**మ. ప్రకటింపంగ సమస్త పాతకములం బాపంగ నీ పూజ యం**
**దొక పుష్పాంశము జాలు నిన్ను మహిలోనూహింపగా నీ పదా**
**ర్చకులే మార్గమునందు శుద్ధులు,మదింజర్చింప ద ద్దుర్గుణ**
**ప్రకరం బెన్నెడివాడు లోకములలోబాపిష్ఠి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, శివభక్తులు నిరంతరమూ నీ పాదాలను వీడకుండా అర్చిస్తూ ఉంటారు. వారు చేసే పూజలోని ఒకేఒక పుష్పం చాలు సమస్త పాతకాలనూ పోగొట్టడానికి. ఒక పూజా పుష్పమే అంత మహిమకలిగి నప్పుడు ఎల్లప్పుడూ నీ సేవలోనే ఉండే నీ భక్తులకు పాపమనేది ఉంటుందా. వారు ఎలా భావించినా పరమ పుణ్యులే. పరిశుద్ధులే. అటువంటి వారిని దుర్గుణాలు కలిగి వున్నారని ఎవరైనా దూషిస్తే వారి వంటి పాపిష్ఠులు ఈ లోకంలో మరెవరూ ఉండరు. నా తండ్రీ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

( ఈ కవి కాలంలో వీరశైవం బాగా విజృంభణలో ఉంది. వీరశైవులు బాగా దుందుడుకుగా ఉండేవారు. రాజాదరమూ

ఉండేది. బిజ్జలునిలాంటి రాజులు వీరశైవాన్ని బాగా ప్రోత్సహించారు. అందుకని శైవులు విశృంఖలంగా ప్రవర్తించేవారు. శివభక్తి ముసుగులో దుష్కార్యాలనూ చేస్తుండేవారు. సమాజంలో కొంత దూషణకూ పాత్రులౌతుండేవారు. దుర్గుణాలు కలిగివున్నా శివభక్తులను దూషించకూడదని చెపుతున్నాడు అన్నమయ్య ఈ పద్యంలో)

39

**మ. తమతేజంబు తృణీకరించుచు సముద్యత్తేజులై మీది లో**
**కములందుఁ జరియించు నీ యచల భక్తశ్రేష్ఠులఁ జూచి నె**
**య్యమునం దారును దద్విధంబునను నిన్నర్చింప నూహించి మ**
**ర్త్యమునం బుట్టగ వాంఛ జేయుదు రమర్త్యశ్రేణి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ భక్తుల తేజస్సు ఇంతింతని చెప్పరానిది. దేవతల తేజస్సు కన్నా ప్రకాశ వంతమైనది. దేవతలు వారివారి లోకాల్లో నే ఉంటారు. ఊర్ధ్వలోకాలైన బ్రహ్మ లోకానికీ, నీ లోకానికీ వారికి ప్రవేశం లేదు. నీ భక్తులో, అఖండమైన తేజస్సుతో సర్వలోకాల్లోనూ చరిస్తుంటారు. అలా దివ్య తేజోయుతులై స్వేచ్ఛగా నీ లోకంలో చరించే నీ భక్తులను చూసి దేవతలు తాము కూడా మానవులుగా పుట్టి నీ భక్తులైతే బావుండు గదా అనుకుంటారు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మొక్కులు!

40

**మ. అమరస్ భక్తులకెల్ల నీవ హృదయంబై యుండుట న్వారి సౌ
ఖ్యము నీ సౌఖ్యము వారి కూర్మియు సమగ్రంబైన నీ కూర్మి త
త్త్వము భావింపగ వారికోపము భవ త్ప్రఖ్యాత రౌద్ర ప్రభా
వము దా వారల వాక్య నిర్ణయము నీ వాక్యంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,నీ భక్తుల హృదయాల్లో నీవు నిండి ఉంటావు. అలాగే నీ హృదయం కూడా నీ భక్తులకు నిలయమై ఉంటుంది. అందువలన నీ భక్తుల బాగోగులన్నీ నీవే చూచు కుంటావు. వారి సౌఖ్యమే నీ సౌఖ్యంగా భావించి దానికి నీవే బాధ్యత తీసుకుంటావు. వారు నీ యెడ చూపించే ఆత్మీయతకు ప్రతిగా నీ సంపూర్ణమైన ఆత్మీయతను వారియెడల కలిగి ఉంటావు. కావున వారు ఎవరినైనా కోపగించుకున్నారంటే నీవు కోపించినట్లే. నీ కోపం సంగతి లోకమంతా ఎరిగిందే గదా. నీవు లయకాల రుద్రుడవు! శివభక్తులకు కోపం తెప్పించినవారు నీ క్రోధాన్ని చవి చూడాల్సిందే

అలాగే నీ భక్తులు ఒకమాటన్నారంటే ఆమాట నీవే అన్నట్టుగా భావించి దానిని నీవే చెల్లిస్తావు. ఇంతెందుకు. శివభక్తుడంటే స్వయంగా నీవే. వారికీ నీకూ ఏ భేదమూ లేదు. నా తండ్రీ !సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

41

**మ. అవనిం బెన్నిధి భాగ్యహీనునకు బ్రత్యక్షంబు గాకప్పు డొం**
**డవ భాండాకృతి దాల్చి ,మాటువడి,మాయా వృత్తి నున్నట్లు ,దా**
**భవదీయ ప్రతిబింబ మూర్తియగు సద్భక్తుండు సంసార దు**
**ర్వ్యవసాయాత్ముల కెల్ల కేవల నరుండైతోచు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, ఏ నరుడికైనా సంపదలు లభించాలంటే ముందు వాడి మొహమ్మీద భాగ్యరేఖ ఒకటి ఉండాలి. అదిలేని దురదృష్ట వంతుని ముందు బంగారమూ, రత్నరాసులూ తెచ్చిపెట్టినా వాడికవి కన్పించవు. అవి మాయగానే మరుగుపడి ఉంటాయి. అందువల్ల వాడు వాటిని సొంతం చేసుకోలేడు. ధన రాసులు నిండి వున్న లంకె బిందెలు కన్పించి నా కూడా ఇవేవో మామూలు కడవలే అనుకుంటాడు గాని అవేమిటో తెరిచి చూసి తెలుసు కుందామనుకోడు. వాడి దురదృష్టం వాడికా బుద్ధి కలగనీయదు. అలాగే ఈ సంసారమనే మాయలో మునిగివున్న మానవులు సాక్షాత్తూ నీకు ప్రతి మూర్తులైన నీ భక్తులను చూసి వీళ్ళు సాధారణ మానవులే అనుకుంటారు . శివ భక్తుడంటే శివుడే అని అర్థం చేసుకోరు కళ్ళ

ఎదుట ఉన్న సంపదలను భాగ్యహీనుడెలా గుర్తించలేడో అలాగే సంసారమాయలో ఉన్న మనిషి కళ్ళ ఎదుట ఉన్న సద్భక్తుణ్ణి శివుని గా గుర్తించలేడు. అది వాడి దౌర్భాగ్యం.  నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

42

**మ. క్షితిపై శ్వేతమునీంద్రు జంప నలుకంగీనాశు డేతెంచి నీ**
**యతికోపజ్వలనాహతిన్మడిసె,దథ్యం బేకనిష్ఠా సమ**
**న్వితులం జేకొని భక్తవత్సలుడవై నీవెప్పుడుం గావగా**
**ప్రతిపక్షావలి కెట్లు వారిదెస జేరన్వచ్చు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, మార్కండేయుడు పుట్టడమే అల్పాయుష్కునిగా మృకండమహర్షి, మనస్వినీ దంపతులకు పుట్టాడు. బాల్యంలోనే చనిపోతాడని అతని తల్లిదండ్రులకు తెలుసు. తనకు ఆఖరు గడియలు సమీపించాయని తెలుసుకున్న మార్కండేయుడు నీ ఆలయానికి వచ్చి నీ లింగాన్ని గట్టిగా కౌగిలించుకుని ఏకాగ్రంగా నిన్నే జపిస్తూ ఉండి పోయాడు. ఆ సమయంలో అతని ప్రాణాలను తీసుకొని పోవడానికి యమధర్మరాజు స్వయంగా వచ్చాడు. తన పాశాన్ని మార్కండే యునిపై విసిరాడు. అప్పుడా బాలుడు నిన్ను ఆర్తితో గొంతెత్తి ప్రార్థించాడు. నీవు కోపించి నీ భక్తుని బాధిస్తున్న యముణ్ణి అక్కడి కక్కడే చంపివేశావు. మార్కండేయుని రక్షించి

అతన్ని చిరంజీవునిగా అనుగ్రహించావు. అప్పటి నుంచీ నీవు అంతకాంతకుడివైనావు. తరువాత దేవతలంతా వచ్చి ప్రార్థిస్తే యముణ్ణి బ్రతికించావు. ఏకాగ్ర నిష్ఠతో నిన్ను సేవించే భక్తులను ఎల్లప్పుడూ కాపాడటానికి భక్తవత్సలుడవైన నీవుండగా నీ ప్రతి పక్షులు ఎవరైనా వారి సమీపానికైనా రాగలరా. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

43

**శా. కింకం దన్ను నదల్చి చక్రమున దా గృష్ణుండనిన్వైచినం**
**బొంకంబొప్పగ దాని దుత్తురుముగా బోదట్టి యుప్పొంగె ని**
**శ్శంకాత్ముండు దధీచి ,శాశ్వతులు నీ సద్భక్తు లూహింపగా**
**సంకల్ప ప్రభవ ప్రతాప వన భాస్వద్దావ! సర్వేశ్వరా!**

దధీచి గొప్పముని. శివభక్తుడు. ఒకసారి దేవతలందరూ తమ ఆయుధాలను దాచమని ఈయన చేతికిచ్చారు. ఆయన వాటిని కాపాడుతూ వచ్చాడు. ఎంత కాలానికీ దేవతలు వచ్చి తమ ఆయుధాలను తీసుకుపోలేదు. అందుకని ఆ ఆయుధాలన్నింటినీ ఆయన పానంచేశాడు.ఆ తర్వాతెప్పుడో దేవతలు వచ్చి అడుగగా, లేవు తాగేశాను జీర్ణమై పోయాయి అని చెప్పాడు. దేవతలు విష్ణువునకు మొరపెట్టుకోగా ఆయన దధీచి పై చక్రం ప్రయోగించాడు. దధీచి ఆ చక్రాన్ని కూడా తాగేశాడు. ఇక చేసేదేమీలేక దేవతలు ఆయన్నే ప్రార్థించారు ఎలాగైనా మా ఆయుధాలు మాకిమ్మని. నన్ను చంపి నా ఎముకలతో మీ ఆయుధాలు తయారు చేసుకోండి అన్నాడాయన. నీవు బ్రాహ్మణుడివి నిన్ను చంపలేము అన్నారు వారు. అగ్నిని

కల్పించుకొని ఆయన దగ్గ మౌతాడు. ఆయన అస్థులతో దేవతల ఆయుధాలు తయారైనాయి. వెన్నెముకతో వజ్రాయుధం తయారైంది. చక్రం కూడా అలానే బయటికి వచ్చింది. (ఈ పద్యంలో దధీచి పై కృష్ణుడు చక్రం వేశాడనీ దానిని ఆయన పొడి పొడి చేశాడనీ కవి చెప్పిన ఐతిహ్యం ఏ పురాణంలో ఉందో తెలియదు. అనేక పురాణాల్లో అనేకరకాలుగా కొద్ది కొద్దిగా ఇలాంటి కథలు కనిపిస్తాయి.)

ఓ పరమేశ్వరా, మన్మధుని దర్పంఅనే అడవిని నీ కంటిమంటతో దగ్ధం చేసిన దేవా! నీ భక్తులను ఎవరూ ఏమీ చేయలేరు. నీ భక్తుడైన దధీచి పై కృష్ణుడు ప్రయోగించిన చక్రాన్ని ఏమాత్రమూ శంకా, జంకూ లేకుండా ఆయన తుత్తుమురు చేశాడు. నీ భక్తులు శాశ్వతులు. ఏ ఆయుధాలూ వారినేమీ చేయలేవు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

44

**మ. ఘటదుగ్ధంబులు పేరుగాక వెలయంగా నెంత తోడంటిన**

**న్నట దుగ్ధాంబుధి పేరునే ; జగములోనల్పుండు దుస్సంగతిం**

**జటులాత్మ్కుండగుగాక యెయ్యెడల నీసద్భక్తు డే కార్యము**

**త్కటమై తాకిన నన్య చిత్తుడగునేతర్కింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,కుండలో ఉన్న పాలలో తోడు వేస్తే అది పేరి పెరుగౌతుంది. అలాఅని పాలసముద్రంలో తోడు చుక్క చిలకరిస్తే పాలకడలి పెరుగు సముద్రమౌతుందా! దుష్టునితో సహవాసం అల్పుణ్ణి చెడగొడుతుంది గాని ఎంతమంది దుర్మార్గుల సాంగత్యమైనా నీ సద్భక్తుల చిత్తాన్ని చెడగొట్ట జాలదు. నీ భక్తులు పాలసముద్రం లాంటి మహనీయులు. ఏ దుస్సంగతీ వారిని అన్య చిత్తులను గావించలేదు. నా తండ్రీ! సర్వేశ్వరా !నీ పాదాలకు మ్రొక్కులు!

45

**మ. సతి వేడ్కం దన ప్రాణవల్లభునితో సంయోగమర్థించుగా**
**కతనిం బ్రార్థనజేసి సొమ్ముగొనిపోనర్రాడునే,భక్తుడీ**
**క్షితి నీ భక్తియె వేడుగాక మరినీ శ్రీపాదముల్గొల్చి కు**
**త్సిత కామ్యార్థము లొండు వేడుకొనునేచింతింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నిజమైన భార్య, దాంపత్యంలోని ఔన్నత్యాన్నీ, సౌభాగ్యాన్నీ అర్థం చేసుకున్న భర్తృవ్రత అయిన భార్య, తన భర్తతో సుఖంగా కాపురం చేసుకోవాలని కోరుకుంటుంది. భర్తతో నిరంతర సన్నిహితత్వాన్ని కోరుకుంటుంది. పతితో కలిసి ఉండడంలోని ఆనందాన్ని కోరుకుంటుంది. పరస్పర అనురాగంతో కూడిన పొందును కోరుకుంటుంది.

అలాంటి అవకాశం ఇమ్మని భర్తను ప్రార్థిస్తుందేకాని డబ్బులిమ్మనీ, నగలూ, కోకలూ తెచ్చిమ్మనీ, ఇరవైనాలుగు గంటలూ వెంటబడి వేధించదు. అలా ప్రవర్తించేవారు దుష్ట భార్యలే కాని భార్యఅనే పదానికి తగినవారు కారు. అలాగే నిజమైన శివభక్తులు నీ పాదస్మరణ కావిస్తూ నీ సామీప్యాన్నీ,

నీ సారూప్యాన్నీ, నీ సాలోక్యాన్నీ నిత్యమూ నీ భక్తినే కోరుకుంటారు. అంతేకాని పక్కవాడికి బాధలు కల్పించు, వాడి సంపద నాకువచ్చేట్లు చెయ్యి ఈ అవకాశం నాకు కలిగించు అంటూ లౌకిక మైన, కుత్సితమైన కోరికలు కోరి తమ భక్తిని నిరర్థక పరచుకోరు. నిజమైన నీ భక్తులు నీపై భక్తినే కోరుకుంటారు. అన్య ప్రయోజనాలు ఆశించరు. నా తండ్రీ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

47

**మ. భ్రమర ధ్యానము దాల్చి కీటకము సద్భావాది సంయుక్తి దా**
**భ్రమరంబై ఖగవీధి నాడుననినన్నాటించి నిన్నాత్మనె**
**య్యముతో ధ్యానము సేయు మర్త్యుడును నీయట్లే పరవ్యోమత**
**త్వము నం దవ్యయలీల నుండుటరుదే భావింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,భ్ర మర కీటక న్యాయము అని ఒక పద్ధతి ఉంది. నల్లటి పురుగొకటి తుమ్మెదలతో కలిసి పెరిగి, వాటితోనే ఉంటూ, వాటినే ధ్యానిస్తూ క్రమంగా అదికూడా భ్రమరమై పోతుంది. అన్నివిధాలా అదింక భ్రమరమే. అలాగే మానవుడు నీకు భక్తుడై నిరంతరం నిన్నే ధ్యానిస్తూ నీలాగే మారిపోతాడు. అవ్యయుడై పరమేశ్వరతత్వాన్ని సాధిస్తాడు. శివభక్తుడనేవాడు కేవలం శివునితో సమానుడు అని భావింపబడటమే గాక సాక్షాత్తూ శివుడే ఐపోవడానికి నీపై నిరంతరం భక్తీ, సదా నీపై నెలకొనిఉండే ధ్యానమే అసలైన కారణం. నా తండ్రీ! సర్వేశ్వరా ! నీ పాదాలకు మ్రొక్కులు!

47

**మ. అమరశ్రేణులకు న్సుధామయ కళాఘాత్మీయ సారంబు ర
మ్యముగా గ్రోలగ నిచ్చి,తానొక కళామాత్రాంగుడై యున్న చం
ద్రమునిం జూచి జగమ్ము మ్రొక్కు గతి నారస్ భక్త పూజా విధి
క్రమ భారాకృశు జూచి మ్రొక్కుదురు లోకం బెల్ల సర్వేశ్వరా!**

దేవతలు అమృతాంధసులు.అంటే అమృతాన్ని ఆహారంగా స్వీకరించేవారు. వారు ఆ అమృతాన్ని చంద్రుని ద్వారా స్వీకరిస్తారు. చంద్రుడు సుధాకరుడు, సుధా మయుడు. చంద్రకళలన్నీ అమృతంతోనిండి వుంటాయి. ఆ కళలను దేవతలకు ఇచ్చి ఇచ్చి చివరకు ఒకే కళ మిగిలి బాగా కృశించి పోయి ఉంటాడు. ఎంత కృశించినా లోకం ఆయనను పూజిస్తుంది. మ్రొక్కుతుంది. తనకున్నదానిని ఇతరులకు ఇచ్చేవాడు ఎప్పుడైనా, ఎక్కడైనా గొప్పవాడేగదా! ఓ పరమేశ్వరా, నీ భక్తులు కూడా చంద్రుని లాగే మహాత్ములు. నిన్ను గూర్చి అవిశ్రాంతంగా చేసే పూజా విధి క్రమంలో తమ సర్వాన్నీ, దేహాత్మలనూ నీకు సమర్పించి నీ సేవలో కృశించి

పోతారు. అందువలన లోకం వారిని కూడా పూజించి మ్రొక్కులు సమర్పిస్తుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

48

**మ. చెదరంబారు దశ ప్రభంజనములన్ శిక్షన్ సుషమ్నాంబునం**
**గుదియంగట్టి చలింపకుండ శశి నర్కుం గట్టి భాస్వన్మన**
**స్పదనస్థానమునందు నిన్నెలమి సంస్థాప్యంబుగా జేసి తా**
**హృదయానంద రసాబ్ధి దేలు శివ యోగీంద్రుండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ భక్తుడైన శివయోగి నిత్యమూ హృదయానందము అనే రససముద్రంలో తేలుతూ ఉంటాడు. ఆ స్థితిని సాధించడమంటే సామాన్యం కాదు. అత్యంత కఠినమైన యోగపద్ధతి చేతనే అలాంటి అలౌకిక సిద్ధి లభిస్తుంది. నిరంతరమూ చలిస్తూ, చెదరబారుతూ ఉండే పది ప్రభంజ నాలనూ ముందు అదుపులోకి తెచ్చుకోవాలి. ప్రభంజనము అంటే తీవ్రమైన గాలి. ఆ పది ప్రభంజనాలూ చలిస్తూ మనస్సుకు స్థిరత్వం లేకుండా చేస్తూనే ఉంటాయి. ఆ పదీ, ఐదు బాహ్యేంద్రియాలూ, ఐదు అంతరింద్రియాలూ. బయటి ఐదు ఇంద్రియాలూ కళ్ళూ, చెవులూ, ముక్కూ, నాలుకా, చర్మమూ. అంతరింద్రియా లనేవి బాహ్య ఇంద్రియాల ప్రవృత్తులు. వీటినే

పంచతన్మాత్రలు అంటారు. అవి శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు. వాటిని ప్రయత్నపూర్వకంగా సుషమ్నా నాడి వద్ద కట్టివేయాలి. ప్రాణాయామానికి సంబంధించిన నాడులు మూడు. అవి ఇడ, పింగళ, సుషుమ్న అనేవి. వీటిలో సుషమ్న నాడి వెన్నెముకకు సంబంధించినది. ఈ ప్రభంజనాలను నిశ్చలంగా ఉంచడం కోసం వెన్నెముక క్రింది భాగంలో ఉండే సుషుమ్నవద్ద వాటిని కట్టి వేయాలి. చంద్ర సూర్యులలో చంద్రుడు మనస్స్థానీయుడు. సూర్యుడు తేజోమూర్తి. శశినర్కుంగట్టి అంటే మనస్సును తేజోవంతం గావించుకొని, అప్పుడు పరమాత్మ పైన నిన్ను మనస్సులో స్థాపించుకోవాలి. ఆ స్థితిని మించిన మహా రసానంద మేమున్నది! మహాత్ముడైన శివయోగీంద్రుడు ప్రాణాయామాది యోగాలతో బయటీ, లోపలీ, ఇంద్రియాలనూ వాటి ప్రభావాలనూ కదలనీకుండా సుషుమ్న వద్ద బంధించి, మనస్సులో నిన్ను సంస్థాపించుకొని, బ్రహ్మా నందాన్ని అనుభవిస్తుంటాడు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

49

**మ. వెలి వీక్షించిన నీ స్వరూపమె మహా విస్పష్టమై,యాత్మలో**
**పలభావించిన నీ స్వరూపమె మహాప్రవ్యక్తమై,దృష్టులం**
**దలపం జేకొని యున్న నీ యచలితధ్యానంబునం జేసి తా**
**గల నైనస్ శివయోగి తన్ను,జగముం గానండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ భక్తుడు నీపై ఏకైక ధ్యానంతో తన్ను తానే మరచిపోతాడు. బయటఉన్న లోకంగానీ, ఈ లోకంలో ప్రవర్తమానమవుతున్న నడవడులు గానీ ఏవీ అతనికి కన్పించవు. అతను కండ్లు తెరచి బయట వీక్షిస్తే నీ స్వరూపమే అతనికి కన్పిస్తుంది. కనులు మూసుకొని ఆత్మలోపల భావనా ప్రపంచంలో ఉన్నప్పుడు కూడా నీ రూపమే అతను ఇంకా స్పష్టంగా చూస్తాడు. నిశ్చలమైన ధ్యానంతో శివయోగి బయటా లోపలా నిన్నే దర్శిస్తూ ఉంటాడు. కలలో కూడా అతనికి మరేదీ కన్పించదు. తననూ ఈ లోకాన్నీ పూర్తిగా మర్చిపోతాడు.ఎటు చూచి నా నీ రూపమే ! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

50

**మ. భవదాకారమె గాంచు,నీ స్తవ కదంబ శ్రేష్ఠ సద్వాక్యముల్
చెవులారన్విను,నిన్నె చెప్పు, మది దుశ్శీలేంద్రియాటోపదు
ర్వ్యవసాయాత్ముల గాంచుచో,వినెడిచో,వర్ణించుచో చీకునుస్
చెవిటి న్మూగయునై చరించు మహి నీ శీలుండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ భక్తుడు నీ రూపాన్ని మాత్రమే చూస్తాడు. నిన్ను స్తోత్రం చేసే నీ మహాత్మ్యాన్ని వర్ణించే మాటలను మాత్రమే వింటాడు. నిన్ను గురించీ, నీ కృపగురించీ, నీ లీలలను గురించీ మాత్రమే మాట్లాడుతాడు. అలా తన కళ్ళు, చెవులు, నోరు అనే ఇంద్రియాల ఉనికిని సార్థకం కావించు కుంటాడు. ఇంద్రియాటోపంతో ప్రవర్తిస్తూ నీకు సంబంధించని అనవసర విషయాలతో కాలక్షేపం చేసే దుశ్శీలురు కనిపిస్తే వారిని చూడడు. ఆ సమయంలో గుడ్డివాడై పోతాడు. నిన్ను కీర్తించని వ్యర్థసంభాషణలెవరైనా కావిస్తుంటే వినడు. ఆ సందర్భంలో చెవిటివాడైపోతాడు.శి వేతరమైన విషయాలు పలకాలంటే మూగవాడై పోతాడు. నీ భక్తుడు తన

ఇంద్రియాలను నీ కొరకే ఉపయోగిస్తాడు. నీకు సంబంధించని విషయాలు వచ్చినప్పుడు అసలు ఇంద్రియాలే లేనట్లు ప్రవర్తిస్తాడు. తన సర్వేంద్రియాలనూ నీ సేవలోనే సదుపయోగం కావించుకుంటాడు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

51

**మ. అతి లాలిత్యముగా నహర్నిశము నిన్నర్చింపగా వచ్చు,సు**
**వ్రతుడై యుండగ వచ్చు,నెల్లకళలం బ్రౌఢుండు గావచ్చు,వా**
**క్పతి గానైనను వచ్చు గాని మరి నీ భక్తుండు గారాదు సు**
**స్థితిగా నీ దయలేని మానవులకుం జింతింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,ఎంతో సుకుమారంగా రకరకాల పూలూ పూజాద్రవ్యాలూ పెట్టి రాత్రీ పగలూ నీకు పూజచేయవచ్చు. కానీ నీ భక్తుడు కాలేడు. ఎన్నో నోములూ వ్రతాలూ ఎప్పుడూ చేస్తూనే ఉండవచ్చు. అయినా నీ భక్తుడు అని అనిపించు కోవడం వీలుకాదు. గొప్ప విద్వాంసుడై అరవై నాలుగు కళలూ అభ్యసించవచ్చు.  చతుర చతురంగా, బృహస్పతి లాగా మాట్లాడే నేర్పుండవచ్చు. ఇలాంటి ఎన్ని యోగ్యతలున్నా శివభక్తుడు అనిపించుకోవాలంటే ముఖ్యంగా కావాల్సింది నీ దయ. అదే లేకుంటే ఇతరమైనవి ఎన్ని ఉన్నా ప్రయోజనం లేదు. శివభక్తుడు అనేది సామాన్యమైన పదవి కాదు. నీ దయ లేకుండా అది లభించదు. మనిషి నీ కృప సంపాదించు

కోవడానికి  చిత్తశుద్ధి తో ప్రయత్నించాలి గాని బాహ్య ఆడంబరం ప్రదర్శనలతోనూ,  లౌకిక  సాధారణ  మైన  అర్హతలతోనూ  అది లభించదు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

52

**మ. భవికిన్ భక్తి మహత్వ మంకురితమై పాటిల్ల భక్తుండు బాం
ధవమాత్రుం డగు ,భక్తి పుష్పితముగా దద్భక్తు డాత్మేశుడై
సవిశేషస్థితి దోచు, భక్తి సఫలోత్సాహంబునున్నొందగా
నవికల్పస్థితి నంత భక్తుడును నీపై యుండు సర్వేశ్వరా!**

ఒక భావం ముందుగా మనసులో అంకురిస్తుంది. అంకురించడం అంటే మొగ్గతొడగడం. ఆ మొగ్గ క్రమంగా వికసించి ఒక పూవుగా తయారౌతుంది. వికసించిన ఆ పూవే కాలక్రమాన ఫలంగా రూపొందుతుంది. ఒకభావంగానీ కార్యం గానీ ఫలవంతం కావాలంటే ఈ క్రమమంతా జరగాలి. శివభక్తి కూడా మానవులలో అలాగే అంకురించి, కుసుమించి ఫల మౌతుంది. శివభక్తుడైనవాడు శివభక్తిలేనివానికి (భవికి) మనసులో భక్తిని అంకురింపజేయాలి. అప్పుడు భవి అతన్ని బంధువుగా భావిస్తాడు. ఆ భక్తి క్రమంగా పూవై వికసించి నప్పుడు భక్తుడతనికి అత్యంత ప్రియుడౌతాడు. ఇక భక్తి ఫల స్వరూపం దాల్చగానే భక్తుడు అతనికి సాక్షాత్తూ శివుడే

అవుతాడు. తానూ శివభక్తుడైనాడు గనుక తానూ శివుడనే అనే భావం కలిగి అతనిలో అభేద ప్రతిపత్తి జన్మిస్తుంది. ఓ పరమేశ్వరా, భక్తి లేని వాడిలో భక్తి భావం అంకురించి, కుసుమించి, ఫలించే క్రమంలో చివరకు నీకూ భక్తునకూ అభేద మేర్పడుతుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

53

**మ. సుముఖుండై శివయోగి మోదము మదిన్ శోభిల్ల జేకొన్న భి క్షము విప్రోత్తమకోటి భోజన సదృక్షంబన్న, సౌభాగ్య యో గమునం దారయ నమ్మహామహుడు వేడ్కం గోరి యారోగిణం బమరం జేసిన పుణ్య మెట్లు గురి సేయన్వచ్చు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, ఒక శివయోగిని సుముఖుని గావించుకుని అతనికి సంతోషం కలిగేటట్లు భిక్షను సమర్పిస్తే ఒక కోటిమంది ఉత్తమ విప్రులకు భోజనం పెట్టి తృప్తి పరచిన దానితో సమానమౌతుంది. అలాంటిది ఒక శివయోగి తానే స్వయంగాకోరి ఎవరింటికైనావచ్చిభిక్షను అడిగి స్వీకరించాడంటే ఆ మహా పుణ్యం చెప్పడానికి వీలుకాదు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

(వీరశైవులు కులభేదాన్ని పాటించరు. 12 వ శతాబ్దప్రాం తంలో బసవేశ్వరుడు వ్యాప్తి చేసిన ఈ వీరశైవం అందుకనే అన్ని వర్ణాల వారినీ ఆకర్షించింది. శివభక్తుడైతే చాలు, అతను ఏజాతివాడు అనేది పట్టించుకో కూడదనేది సిద్ధాంతం.

బసవేశ్వరునకు రాజా స్థానంలో రాజుతో సమానమైన ప్రాముఖ్య ముండేది. అందుకని శైవులకూ రాజాదరం బాగా ఉండేది. సమాజంలో ఈ శైవులు ఔద్ధత్యంతో ప్రవర్తించేవారు. ఎప్పుడంటే అప్పుడు ఎవరింటికంటే వారింటికి పోయి కావాల్సింది అడిగేవారు. ఈ పద్యంలో ఆవిషయం సూచించబడింది)

54

**శా. ఎచ్చో నీ పదభక్తుడుండు మది నింపెక్కం బ్రయత్నంబుతో**
**నచ్చో నీ వనిశంబు నుండుదు,త్వదీయ ధ్యాన చిన్మూర్తులై**
**యచ్చో సన్మునులెల్ల నుండుదురు మంత్రాంగాక్షరాయుక్తులై**
**యచ్చో తీర్థములెల్ల నుండు,నిది వేదార్థంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,నీపదభక్తుడు ఎక్కడైతే ఉంటాడో అక్కడ ఎల్లప్పుడూ నీవు ఉంటావు. ఇక అక్కడనే నిన్ను ధ్యానం చేస్తూ నీ మంత్రాక్షరాలను జపిస్తూ సకల మునులూ ఉంటారు. నీభక్తుడూ, నీవూ, సకల మునులూ నివసించే చోటును మించిన పరమ పవిత్ర ప్రదేశం ఇంకేముంటుంది. అక్కడికి లోకంలోని అన్ని పుణ్యతీర్థాలూ వచ్చి నిలుస్తాయి. శివ భక్తుడున్నచోటు అంతగొప్పది. ఇదే వేదముల భావం కూడా! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

55

**శా. సత్యం బెప్పుడు దప్పడేనియు,దురాచారుండు గాడేని, యౌ**
**చిత్యం బేమరడేని,దుర్జనుల గోష్ఠిం బొందడే,భక్త సాం**
**గత్యం బాదట బాయడేని,మదనగ్రస్తుండు గాడేని నీ**
**భృత్యుం డాతడు మూడు లోకములలో బెంపొందు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,ఏ మనుజుడైతే సత్యమార్గాన్ని ఏ మాత్రమూ విడిచి పెట్టకుండా ఉంటాడో, చేయకూడని పనులు చేసి దురాచారాలలో మునిగిపోకుండా ఉంటాడో, ఇది తగును ఇది తగదు అని మంచినీ చెడునూ వివేచించుకునే విచక్షణా జ్ఞానాన్ని ఏమరకుండా ఉంటాడో, దుర్మార్గులైన వారితో సహవాసానికి ఏమాత్రమూ జొరకుండా ఉంటాడో, శివభక్తులైన వారి సాంగత్యాన్ని వీడకుండా ఉంటాడో, మన్మథ మాయలో చిక్కుకుని మోహసాగరంలో మునిగి పోకుండా నిశ్చలచిత్తంతో ఉంటాడో, అటువంటి మనుజుడు నీకు నిజమైన భక్తుడు. అతడు ముల్లోకాలలో అభ్యుదయ పరంపరాభివృద్ధి చెందుతూనే

ఉంటాడు. అతనికి తిరుగే లేదు.నా తండ్రీ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

56

**శా. పెంపన్ దల్లియగున్,రుజాపటల దుష్పీడావిధి క్షోభ వా**

**రింపన్ వైద్యుడగుం, గుమార్గ విధులం గ్రీడింప బోకుండ శి**

**క్షింపన్ బల్లిదుడైన తండ్రి యగుచున్,శ్రీమంతుగా నెంతయున్**

**సంపద్వృద్ధి యొనర్ప దాతయగు నీ సద్భక్తి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,మానవునికి నీపై ఏకాగ్రమైన భక్తి ఉంటే చాలు . ఆభక్తే అతన్ని అన్నివిధాలా ఆదరిస్తుంది. భక్తి మనిషిని తల్లిలాగా పెంచుతుంది. జబ్బు చేసినప్పుడు గానీ, ఏదైనా దుష్టపీడ రోకి బాధించేటప్పుడు గానీ ఒక వైద్యునిలాగా అతని సర్వ రోగ బాధలనూ నివారిస్తుంది. చెడు మార్గాల్లో పోతుంటే అతన్ని ఆపి, బోధించి సన్మార్గానుయాయి అయ్యేందుకు తండ్రిలాగా ప్రవర్తించి శిక్షిస్తుంది. ఒక దాతయై సర్వ సౌభాగ్యాలనూ, సంపద లనూ అనుగ్రహిస్తుంది. సద్భక్తి చేయలేని దేముంది? తల్లీ, తండ్రీ, వెజ్జు,దాతా అన్నీ తానేఅయి సద్భక్తి మనిషి జీవితాన్ని తీర్చి దిద్దుతుంది. నాతండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

57

**మ. ఉరు సంసార గజేంద్ర దర్ప దళన వ్యూఢ ప్రతాపోగ్ర కే**
**సరి,దుష్ప్రాప శరీర బంధ విపుల క్ష్మాజ వ్రజ చ్ఛేద వి**
**స్ఫురిత క్రూర కుఠార ధార,దురిత ప్రోద్భూత జీమూత దు**
**స్తర సంఘాత విఘాత మారుతము నీ సద్భక్తి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, గొప్పదైన సంసారము అనే ఏనుగు యొక్క మదమును తన తీవ్రమైన, భయంకరమైన ప్రతాపంతో నిర్మూలించే సింహం నీసద్భక్తి! ఎంతో కష్టమ్మీద లభించిన ఈ శరీరమూ, దానివలన ఏర్పడే బంధనాలూ అనే పెద్ద పెద్దచెట్ల గుంపును నరికేసే గొడ్డలి దెబ్బ లాంటిది నీ సద్భక్తి! దుర్భరమైన పాపాల మబ్బులను చెదరగొట్టే ఝుంఝూమారుతము (తీవ్రమైనగాలి) నీ సద్భక్తి! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( ఈ పద్యంలో కవి గొప్పగొప్ప సంస్కృత పదాల నుపయోగించి పొడుగైన సమాసాలతో ఆ పదాలను బంధించి ప్రౌఢంగా

పద్యాన్ని వ్రాయగల తన శక్తిని చూపించాడు. ఈ పద్యం యొక్క అర్థం మామూలు మాటల్లో చెప్పాలంటే__ ఓ పరమేశ్వరా, సంసారమనే ఏనుగు పాలిట సింహం నీ భక్తి! భవబంధాలను నరికేసే గొడ్డలి నీ భక్తి! పాపాల మేఘాలను చెదర గొట్టే పెనుగాలి నీ భక్తి! ఇంత మామూలు మాటల్లో చెప్పే భావాన్ని ప్రౌఢమైన పదాలతో, పొడుగు పొడుగు సమాసాలలో గుప్పించి వదిలాడు కవి. అంతేగాక ఈ భవబంధాలూ అవీ ఎంతఘోరమైనవో చెప్పడానికి అంతే గంభీరమైన పదాలద్వారా సూచించాడనీ అనుకోవచ్చు.)

58

**మ. అరి వీర ప్రకరంబు భీకర తరంబై తాకుచో,సింహ,సిం**
**ధుర,శార్దూల,మృగోరగాది భయముల్దోతెంచుచో ఘోర దు**
**స్తర సంసార వికార వేదనలు మీదం బర్వుచో ,వజ్రపం**
**జరమై చేకొని తన్ను నెత్తుకొను నీ సద్భక్తి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ సద్భక్తి ఎంతో గొప్పది. ఎల్లప్పుడూ భక్తులను కాపాడుతూనే ఉంటుంది. భయంకరంగా శత్రువులు చుట్టుముట్టి పైబడినప్పుడుగానీ, సింహాలవల్లా, ఏనుగులవల్లా, పులులవల్లా, ఇతర క్రూర జంతువులవల్లా, పాములవల్లా ఆపద ఏర్పడి భయంతో కంపించి పోయేటప్పుడుగానీ, దాటడం సాధ్యంకాని భీకరమైన సంసారసాగరంలో పడి తలమునక లౌతూ భవబాధలు పైకొని తరణోపాయం ఏమీ కనిపించ నప్పుడు గానీ, ఒక వజ్ర పంజరంలాగా చుట్టుకొని, మమ్మల్ను ఎత్తుకొని ఆ భయాలన్నిటినీ బాపేది నీ సద్భక్తి యే. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

59

**మ. కమలాప్తుం డుదయింపగా ననల నక్షత్ర క్షపాధీశ తే**
**జములెల్లం బెడబాసి పోవు గతి నీ సద్భక్తి భావంబు చి**
**త్తము లోనం బ్రభవింపగా నితర మంత్ర ధ్యాన తద్దేవతా**
**క్రమ మాయా పటలంబు లన్నియును వీకం గ్రాగు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,నీవు మహాదేవుడవు. నీపై భక్తీ నీ ధ్యానమూ సర్వసిద్ధి ప్రదాయకాలు. ఐనా కొందరు ఇతర దేవతలను సేవిస్తుంటారు. వారి మంత్ర ధ్యానం కావిస్తుంటారు. అది కేవలం వృధా. అది మాయ. అది నిలవదు. సూర్యుడు ఉదయించగానే ఆ మహా ప్రకాశానికి అగ్ని కాంతీ, నక్షత్ర కాంతీ, చంద్రుని కాంతీ అన్నీ తమ తేజస్సు కోల్పోతాయి. అలాగే నీపై భక్తి మనసులో పొడసూపగానే ఇతర మంత్రాలూ ధ్యానాలూ అన్నీ నిస్తేజమైపోతాయి. నా తండ్రీ ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

( కంచర్ల గోపన్న ( రామదాసు) తన దాశరథీ శతకము లోని ఒక పద్యంలో చెప్పిన భావమే ఇది.పెక్కురు బక్కదైవముల

వేమరు గొల్చెదరు. అట్లుకాదయా, మ్రొక్కిన నీకె మ్రొక్కవలె,
మోక్షమొసంగిన నీవె యీవలెన్ అని.)

60

మ. **చటుల ప్రాయ గుణేంద్రియాత్ముకలకు వాంఛావృత్తి నీ భక్తి సం స్ఫుటమై యుండదు,భక్తి తత్పరులకుం బొల్పొందగా చిత్తము త్కట దుష్టేంద్రియ వర్గ తామస పరిగ్రస్తంబు గాదెట్లు,చీ కటికిం దిగ్మ మరీచికిం గలదె సాంగత్యంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, మనిషి పంచేంద్రియాలకు లోబడి నంత కాలమూ అవి చంచలమైనవి కాబట్టి మనసులో కోరికలు కలిగిస్తూనే ఉంటాయి. చలిస్తూ ఉండడం అనేది ఇంద్రియముల స్వభావం. ఆ ఇంద్రియములను అదుపు చేసుకుని, వాంఛలను అధిగమిస్తేనే నీపైన భక్తి కుదురుతుంది. వాటికి లోబడినంత కాలమూ భక్తి కుదరదు. కుదిరినా ఏకాగ్రంగానూ స్థిరంగానూ ఉండదు. భక్తిలో స్థిరత్వం సాధించిన వారి మనస్సు ఇంద్రియములు కల్పించే కోరికల చీకటిని దరికి రానీయదు.వారి చిత్తం చంచలించదు. ఇంద్రియములను నిగ్రహించ లేక కోరికలకు బానిస కావడమనేది చీకటి లాంటిది.ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని, కోరికలను జయించి,మనస్సును భక్తితత్పరంగా ఉంచుకోవడ మనేది సూర్యుని వెలుగు

లాంటిది.చీకటికీ సూర్యునికీ పొత్తు ఉంటుందా! నా తండ్రీ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

61

మ. **బలవంతుండును దుర్బలుండును మహాప్రౌఢుండు మూఢుండునుం**
**గులజుండుం గులహీన జాతుడు ఘనక్రూరుండు శాంతాతి ని**
**శ్చల చిత్తుండును నొక్క రూపమది నీ సద్భక్తి చిత్తంబులో**
**పల వర్ధిల్లిన మీద నే విధమునన్ భావింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,ఈలోకంలో రకరకాల సామాజిక స్థాయి వారుంటారు. రకరకాల మానసిక స్థాయి గలవారుంటారు. స్వభావాల్లోనూ రకరకాల తేడాలున్న వారుంటారు .ఒకరికీ ఒకరికీ మధ్య అనేకమైన అంతరాలు ఉంటాయి. బలవంతుడూ_బలహీనుడూ, గొప్ప విజ్ఞాన వంతుడూ_పరమ మూఢుడూ, ఉత్తమ కులంలో జన్మించిన వడూ _హీనకులజుడూ, పరమక్రూరుడూ_ మహాశాంతి పరుడూ ఎవరికైనా గానీ, పరస్పర వ్యతిరేక స్వభావంగల వారికైనా గానీ మనసు లోపల నీపై భక్తి అంకురించి వర్ధిల్లితే చాలు- అంతా ఒకటే. నీదృష్టిలో అందరూ ఒకటే. శివభక్తికి చిన్నా_పెద్దా

తారతమ్యాలు లేవు.ఎక్కువ తక్కువలూ లేవు. నా తండ్రీ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

62

**శా. కామోద్రేక విజృంభణమ్మును,సమగ్ర క్రోధమున్,లోభమున్,**
**వ్యామోహంబు,మదంబు,మచ్చరము దీవ్రంబైన పంచేంద్రియో**
**ద్దామాటోపము గ్రాచి పెంపెసగు తత్త్వ జ్ఞానికిం గాక తా**
**సామాన్యాత్ముల కేల నూలుకొను నీ సద్భక్తి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీపై భక్తి అనేది సాధారణ మాత్రులకు లభ్యంకాదు. దానికైమనిషి తన్నుతాను యోగ్యునిగా చేసుకోవాలి. ప్రతివాని జీవితంలోనూ ఆరుగురు శత్రువు లుంటారు. ముందు ఆ ఆరుగురు శత్రువులునూ జయించాలి. మనిషియొక్క పంచేంద్రియాల ప్రకోపము ఈ శత్రువులను ఎగదోస్తూ ఉంటుంది. ఆ ఆరు శత్రువులూ ఇవి. 1) కామము. ఇది ప్రతి దానిపైనా ఆశ, కోరిక కలిగి ఉండడం. అనుభవించా లనుకోవడం. ఇది చాలా ఉద్దామమైనది. ముఖ్యంగా దీనిని ఎప్పుడూ అదుపులో ఉంచుకోవాలి. 2) క్రోధము. క్రోధమంటే కోపము. ఇది ఒక చెడ్డ మానసికోద్వేగము. దీనిని త్యజించాలి. 3) లోభము. ప్రతిదీ తనకే కావాలనుకోవడం, ఇక దాన్ని వదలలేక పోవడం. 4) మోహము. ఏదైనా ఒక దాని మీద

మనసు లగ్నం చేసుకొని ఇక అదే లోకంగా ఉండి దాని నుంచి మనసును మళ్ళించుకో లేక పోవడం. 5) మదము. మదమంటే పొగరు. గర్వాతిరేకం. ఇతరులనెవరినీ లెక్కజేయక తానే సర్వజ్ఞుడినని అనుకుంటూ ఉద్ధతితో ప్రవర్తించడం. 6) మాత్సర్యము. అంటే ఈర్ష్య. పక్కవాణ్ణి చూసి కుళ్ళు కోవడం. ఇతరులకేది ఉన్నా అది నాగులే దే అని ఉడుక్కోవడం. ఈ ఆరు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను నిగ్రహించి నిత్యమూ వాటిని అదుపులో ఉంచుకునే తత్త్వజ్ఞానికి మాత్రమే నీ సద్భక్తి కలిగి పెంపొందుతుంది. వాటికి పూర్తిగా లొంగి పోయిన వాడికి నీపై భక్తి కుదరనే కుదరదు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

63

**మ. ఉరు పక్షంబులు వచ్చునంతకు నిరుద్యోగంబునం వృక్షకో**
**టర మధ్యంబున నుండు పక్షి గతి,నిష్ఠంగోరి నీ భక్తి వి**
**స్తర మాత్మం బ్రభవించు నంతకును నీ సంసార కారాగృహాం**
**తర గేహంబున నుండి జీవు డతి వంతం బొందు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,ఈ సంసారం ఒక చెట్టు తొర్ర వంటిది. జీవుడు ఆ చెట్టు తొర్ర లోని పిట్ట కూన లాంటి వాడు. అప్పుడే పుట్టిన పక్షి, రెక్కల్లేవు కాబట్టి బయటకు రాలేదు. ఎక్కడికీ పోలేదు. పనీ పాటా లేకుండా ఆ చెట్టు తొర్రలోనే అవస్థలు పడుతుంటుంది. జీవుడు కూడా సంసారమనే చెట్టు తొర్రలో నానా బంధాలతో, అనేక సమస్యలతో బాధలు పడుతూనే ఉంటాడు. స్వేచ్ఛగా ఎగిరే అవకాశం పక్షికి రెక్కలొచ్చిందాకా ఉండదు. రెక్కలురాగానే హాయిగా ఆకాశవీధి లోకి ఎగిరి పోతుంది. నీపై సద్భక్తి అంకురించిన దాకా మానవుడు కూడా ఈ సంసార కారాగారమనే చెట్టుతొర్రలో బాధలు పడుతూనే ఉంటాడు. ఒకసారి మనసులో నీపై భక్తి అంకురించగానే ఈ

సంసార బంధాలను ఛేదించుకుని ఆ భక్తి పారవశ్యంలో నీకు దగ్గరవుతాడు. రెక్కలు లేకపోతే పక్షిపిల్ల గతి ఎంతో నీ భక్తి లేకపోతే మనిషి గతీ అంతే.    నా తండ్రీ ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

64

**శా. లింగారాధన,జంగమార్చనము లోలిస్ భక్తి కంగంబు ప్రా**
**ణాంగ వ్యాప్తియు నై స్ఫురించు,నిది తత్వార్థం బగుస్ గాన నా**
**యంగాభ్యర్చన జంగమాహితకరుండై చేసినం దా శవ**
**శృంగారంబగు వాని భక్తి మది జర్చింపంగ సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, లింగాన్ని ఆరాధించడమూ, జంగములను (అంటే శివభక్తులను) పూజించడమూ ఈ రెండూ భక్తికి అంగములు. వాటి వలననే ప్రాణాంగవ్యాప్తి జరుగుతుంది. అంటే శరీరంలోని పంచప్రాణాలకూ వికాసం కలుగుతుంది. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములు అనే ఐదూ ప్రాణాంగములు. ఇవి శరీరంలో వివిధ స్థానాలలో ఉండే వాయువులు. ఈ శరీర గత వాయువులే ఊపిరులు. ఇవిపోతే మరణమే. భక్తితత్పరతతోచేసే లింగారాధనా, జంగమార్చనా ఈ రెండూ భక్తికీ, ప్రాణాంగ వ్యాప్తికీ అంగములు. ఈ రెంటిలో దేనినీ కాదనరాదు. లింగార్చన మాత్రమే కావిస్తూ జంగములకు అహితంగా ప్రవర్తించేవారి భక్తి భక్తే కాదు. అది శవానికి చేసే

శృంగారం లాంటిది. అందుకని భక్తుడు లింగార్చనా, జంగమార్చనా రెండూ చేయాలి. జంగములు సాక్షాత్తూ శివరూపులే! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

65

**మ. అరయన్ కర్మవి ధావధాన విధివ ధ్యానోత్తమ జ్ఞానముల్**
**వరుసన్ బేర్కొన నాల్గు యోగములు,తత్త్వం బెందు నీ భక్తి వి**
**స్తర బాహ్య క్రియ లెల్ల బొల్లులగుటం,దద్భక్తియోగంబు దా**
**బరగం దక్కిన మూడు యోగములకుం బ్రాణంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నిన్ను చేరడానికి నాలుగు యోగాలున్నాయి. కర్మవిధి, అవధానవిధి, ధ్యానవిధి, జ్ఞానవిధి అనేవి. ఇవే కర్మయోగము, అవధానయోగము, భక్తియోగము, జ్ఞాన యోగములు. ఇవికాని ఇతర బాహ్య పద్ధతులేవైనా కేవలం దండగమారివి. పొల్లువి. కర్మవిధి అంటే నిష్కామంగా కర్మలు చేస్తూఉండడం. అవధానవిధి అంటే ఏకాగ్రబుద్ధితో ధారణ చేయడం. ధ్యానవిధి అంటే భక్తి యోగము. నిన్నే భక్తితో ధ్యానించడం. ఇక జ్ఞానయోగ మంటే నీతత్త్వంయొక్క తెలివిడి కలిగి ఉండడం. ఈనాలుగు యోగాలూ ముఖ్యమైనవే కాని, భక్తి విధి అనేది మిగతా మూడింటికీ ప్రాణమైనటు వంటిది. భక్తిలేనిదే కర్మలు చేసినా, ధారణ చేసినా, జ్ఞానాన్ని సంపాదించినా

ప్రయోజనము ఉండదు. నా తండ్రీ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

66

**మ. అమరంగా ధనమిచ్చి కాతురు మహీయఃప్రీతి ప్రాణంబు,బ్రా ణము ,నర్థంబును నిచ్చి కాతుర భిమానంబు న్విశేషించి ,మా నము,బ్రాణంబు,ధనంబు నిచ్చికడు సన్మానంబుగా నుత్తమో త్తమ చారిత్రులు భక్తి గాతురు ప్రమోదం బంది సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, కొందరు ధనమిచ్చి ప్రాణాలు కాపాడు కుంటారు. మరికొందరు ధనాన్నీ, ప్రాణాన్నీ కూడా ఇచ్చి అభిమా నాన్నీ, ఆత్మగౌరవాన్నీ కాపాడుకుంటారు. అంటే వారి దృష్టిలో ప్రాణానికిసైనా, ధనానికన్నా ఆత్మాభిమానమే విశేషమైనది. కానీ ఉత్తమమైన చారిత్రమూ, ప్రవర్తనాకలిగినవారు ధనంకన్నా, ప్రాణం కన్నా, ఆఖరుకు అభిమానం కన్నా నీపై భక్తియే మిన్న అనుకొని ధన, ప్రాణ, మానాలుపోయినా నీ భక్తినిమాత్రం విడవకుండా కాపాడుకుంటారు. వారు చాలా ఉత్తములు. నీ భక్తిని మించినది మరేదీ లేదని నమ్ముతారు వారు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

67

**మ.అనుబంధేంద్రియ భూతవర్గము,యమాద్యష్టాంగ మంత్రోరు సా**
**ధన నుచ్చాటన జేసి బాపి,గురుసద్వాక్య ప్రకాశోత్తమాం**
**జన దృష్టిం బరికించి యేర్పరచి,వాంఛంగోరి,సాధించి చే**
**కొను చిన్మూర్తికి గాని భక్తి విధి గీల్కొదెందు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీపై భక్తి అంకురించాలంటే అదేమీ సామాన్య విషయం కాదు. అలవోకగా అది పట్టుబడదు. దానికి చాలా సాధన చేయాలి. ముందు ఇంద్రియాలనూ వాటి స్వభావాలనూ నిగ్రహించుకోవాలి. బాహ్యేంద్రియాలు ఐదూ, అంతరింద్రియాలు ఐదూ. కన్నూ, చెవీ, ముక్కూ, నోరు, చర్మమూ అనేవి బాహ్యేంద్రియాలు. వాటి స్వభావాలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే పంచతన్మాత్రలూ అంత రింద్రియాలు. వీటి ప్రభావాన్ని నిగ్రహించుకోవాలి. దానికి అష్టాంగ సాధనయే మార్గం. అష్టాంగములు భక్తి సాధన కొరకైన ఎనిమిది మార్గాలు.

ఆఎనిమిదీ1) యమము 2) నియమము3) ప్రాణాయామము4) ప్రత్యాహారము 5) ధ్యానము 6) ధారణ 7) మననము 8) సమాధి అనేవి.

1) యమము; శాంతిగా ఉండడం,హింసకు విముఖత.

2) నియమము; పద్ధతి గా, క్రమశిక్షణ తో ఉండడం.

3) ప్రాణాయామము; శ్వాసను మంత్రపూర్వకంగా నిరోధించడం

4) ప్రత్యాహారము; విషయ వాసనలనుంచి ఇంద్రియాలను మరల్చడం

5) ధ్యానము; చంచలత్వం లేకుండా భగవంతుని ఏకాగ్రం గా భావించడం.

6) ధారణ; భగవంతుని నే మనస్సులో నిరంతరమూ ఉంచుకోవడం.

7) మననము; భగవంతుడినే మరీమరీ చింతన గావించడం.

8)సమాధి; మనస్సనేదే లేనట్టి స్థితిని పొందడం.

ఇవన్నీ అష్టాంగాలు. భక్తిని సాధన చేసే మార్గాలు. మళ్ళీ ఈ అంగాలకు వేరే వేరే ఉపాంగాలుకూడా ఉన్నాయి. యమము నకు సత్యము, దయ, క్షమ, మితాహారము, ధృతి, ఆర్జవము,

బ్రహ్మచర్యము, ఆస్తేయము, అహింస, శౌచము అనేవి. అలానే ఇతర అంగాలకూ ఉపాంగాలున్నాయి.

ఈ అష్టాంగాలనూ, వాటిఉపాంగాలనూ అర్థం చేసుకుని ఆమార్గంలో సాధన చేయడం చాలా జటిలమైన పని. స్వయంగా సాధన చేసినంత మాత్రాన సరిపోదు. సద్గురుని ఆశ్రయించి ఆయన బోధనల వెలుగులో తన సాధనా ఫలితాన్ని స్థిరపరచుకోవాలి. అప్పుడుగాని, ఓ సర్వేశ్వరా! నీపై భక్తి కుదిరి స్థిరపడదు. అంటే ఎంతో నిష్ఠగా చేసిన సాధనైనా సద్గురువు లేనిదే సంపూర్ణం కాదు. పిండితార్థం ఏమిటంటే అష్టాంగ సాధన ద్వారా ఇంద్రియాల వ్యాపారాన్ని అణచివేసి, గురుని ఉపదేశం ద్వారా ఆ సాధనల ఫలితమైన భక్తిని అందుకోవాలి. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

68

**మ.కనకం బందు ఘనీభవించిన కళంకంబెల్ల సువ్యక్తిగా**
**ననలాస్యంబున వీగిపోవు గతి జీవాత్మం బ్రవేశించి చే**
**కొని వర్తించిన దుర్మల త్రయ పరిక్షోభంబు నీభక్తి చే**
**తను బాపంబడుగాని యొండొకటి చేతం బోదు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, సంసారబంధాలలోనూ, అంతులేని కోరికల వలలోనూ చిక్కుకున్న మనిషి ఆ బంధాలను తెంచుకోవడమూ, కోరికలను లేకుండా చేసుకోవడమూ చాలా కష్టమైన విషయం. ముఖ్యంగా మనిషి చూపు దినమూ, భార్యా, పుత్రులూ అనే ఈ మూటి మీదనే ఉంటుంది. చూపు అంటే ఈక్షణము. ఈ విధమైన ఈక్షణములు మూడు.అవి ధనేక్షణ, దారేక్షణ, పుత్రేక్షణ అనేవి. వీటినే ఈక్షణత్రయం అంటారు. జీవాత్మను ఆవరించుకొని బ్రతుకు పరమేశ్వరుని చేరనీయ కుండా ఈ ఈక్షణత్రయం అనే మాలిన్యం అడ్డుపడు తుంటుంది. ఈ మాలిన్యం తొలిగిపోవాలి. బంగారంలో ఉండే మాలిన్యం అగ్నిలో పుటంపెడితే నిర్మూలమై పోయినట్లు ఈ ఈక్షణత్రయం

అనే మాలిన్యం కేవలం నీ భక్తి అనే అగ్ని ద్వారానే నిర్మూల మౌతుంది గాని వేరే మార్గమేదీ లేదు.నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

69

**మ.అమరంగా గురు మంత్ర కార్ముకమునం దాత్మాస్త్ర మష్టాంగ యో**
**గ మహాముష్టి వివేకి యేయుటయు, తత్కాండం బజాండాది త**
**త్త్వము లెల్లం వడి నుచ్చి పారి భవదుద్యత్ సూక్ష్మ కైవల్య ల**
**క్ష్యము నం దద్భుతశక్తి తోడ గమియంగా నాటు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,ఆత్మ మోక్షాన్ని సాధించేందుకు చేసే ప్రయత్నం కష్టసాధ్యమైన సాధన. అది ఒక యుద్ధం లాంటిది. యుద్ధంలో వీరుడైన వాడు విల్లు తీసుకుని గట్టిగా పిడికిలితో దాన్ని పట్టుకొని_ బాణాన్ని సంధించి గురిచూసి వదులుతాడు. అది లక్ష్యాన్ని ఛేదించాలి. గురి సరిగ్గా ఉండాలి. పిడికిలిపట్టు దృఢంగా ఉండాలి.బాణం పదును దేరి ఉండాలి. విల్లు సరైనదై ఉండాలి. ఇన్నీ సక్రమంగా ఉంటేనే బాణం లక్ష్యాన్ని తాకుతుంది. అలానే వివేకియైన వానికిగురి మోక్షం మీద ఉండాలి. మోక్షం సాధించాలంటే వివేకి గురూపదేశము అనే విల్లు స్వీకరించాలి. ఆత్మ అనే బాణాన్ని అష్టాంగ యోగము అనే పిడికిలితో దృఢంగా పట్టుకోవాలి. ( అష్టాంగ యోగము అంటే ఏమిటో 67వ పద్యంలో వివరించుకున్నాం) ఈ అష్టాంగయోగంఅనే పిడికిలితో పట్టుకుని

బాణం సంధిస్తే ఆ బాణం ఈ బ్రహ్మాండంలో జీవుణ్ణి ఆటంకపరచే అంతరాయాలన్నటినీ తొలిగించు కుంటూ పోయి, నీ వద్దకుచేరి, అతి సూక్ష్మమైన కైవల్యము అనే లక్ష్యాన్ని చేరుకుంటుంది. తాత్పర్యం ఏమిటంటే, గురూపదేశం ప్రకారం అష్టాంగయోగ సాధన ద్వారా మాత్రమే ఆత్మ కైవల్యాన్ని పొందగలుగుతుంది అని. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

70

**తనరం గాయ వహిత్రమందు హృదయ స్తంభాభి సంస్థానమై**

**చను నీ ధ్యాన పటంబు నూల్కొలిపి,భాస్వద్భక్తి వాతాహతి**

**న్వినుత జ్ఞాన పథంబు చేకొని సముద్వేగంబుమై జీవుడీ**

**ఘన సంసార మహార్ణవంబు గడుపంగా జాలు సర్వేశ్వరా!**

ఈ సంసారమనేది ఒక మహాసముద్రం. మనం సంసారంలో ఉన్నాం కాబట్టి ఎలాగైనా ఈ సముద్రాన్ని దాటాలి. దాటాలంటే ఒక పడవ కావాలి. మన శరీరమనే పడవతోనే ఈ సంసార సముద్రాన్ని దాటాలి గదా. పడవ కదలాలంటే ఒక తెరచాప కావాలి. దాన్ని కట్టడానికి ఒక స్థంభం కావాలి. తెర చాపను కదిలించడానికి గాలి కావాలి. శరీరం పడవ. హృదయం పడవ మధ్యలో నాటిన స్తంభం. దానికి కట్టే తెరచాప ధ్యానం. శివునిపై భక్తి అనే గాలితోనే హృదయానికి బంధించబడిన తెర చాపను కదిలించాలి. అప్పుడు తగినంత వేగంతో, సరియైన మార్గంలో అంటే జ్ఞాన పథంలో పడవను నడపాలి. అప్పుడే ప్రయాణికుడు సంసార సముద్రాన్ని దాటగలడు. తాత్పర్య

మేమిటంటే హృదయంలో ధ్యానాన్ని కల్పించుకుని, భక్తితో దానిని కదిలించుకుంటూ, జ్ఞానమార్గంలో ఈ శరీరాన్ని నడిపించుకుంటూ, సంసారాన్ని దాటడమే ఆవలితీరమై కైవల్యం చేరడానికి ఏకైక సాధనం. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

71

**మ.అకలంక స్థిర భక్తి మున్సగయ,నిన్నశ్రాంతముంజూచి పా**

**యక పూజించు మహామహుండు భవదభ్యర్చ్యుం డగుంగాక**

**దా**

**సకలేచ్ఛా విషయంబులస్ బొగయుచుస్ జాపల్యతం జేయు నా**

**బకవేషార్చన లేల నిన్ను నొగయింపం జాలు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, అన్నివేళలా నిన్నే నమ్మి ధ్యానిస్తూ, నిర్మలమైన,స్థిరమైన భక్తితో నిన్ను పూజించే వాడినే నీవు ఆదరించి చేరదీస్తావు. అలాంటివారి భక్తి నీకు తృప్తి కలిగిస్తుంది. అంతేకాని విషయ వాసనల్లో మునిగి, ఏవేవో ఆశలూ కోరికలూ పెంచుకొని, వాటిని సాధించుకునే ప్రయత్నాల్లో తలమునక లవుతూ, చాపల్యంతో ఏదో మొక్కుబడిగా, పైపై వేషాలతో కొంగధ్యానం చేసే వాడి భక్తి నీదాకా వస్తుందా అసలు. అలాంటి వాడి దొంగభక్తి నీకు తృప్తి కలిగిస్తుందా.నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

72

**మ. సమదోత్సాహ సుఖాభిలాషలును, నీ సంసార మాయా వినో**
**దములుస్,స్వర్గఫలా పవర్గ ఫల చిత్తభ్రాంతులుం,బూజ్యరా**
**జ్య మహాకాంక్షలు నెన్నిచూడ నివినీ సద్భక్తి కత్యంతరా**
**యములై మాటికి మాటి కడ్డుపడు కార్యశ్రేణి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, మనిషి మనసు కోరికల పుట్ట. మత్తెక్కించి ఉత్సాహాన్ని కలిగించే సుఖాల మీద వ్యామోహమూ, ఈ సంసారంలో ఒకదాని తర్వాత ఒకటిగా కలుగుతూనే ఉండే మాయ ఆశలూ, స్వర్గమనీ మోక్షమనీ వాటి మీద మనసులో కలిగే అనేకానేక భ్రాంతులూ గొప్ప అధికారం కోసమూ, సామ్రాజ్యప్రాప్తి కోసమూ కలిగే మహాత్వా కాంక్షలూ, ఇవన్నీ నీపై భక్తి కలగనీయకుండా అడ్డుపడే అంతరాయాలు. ముందు మనిషి కోరికలన్నిటినీ చంపుకుంటే గాని, ఈ భ్రమలను తొలగించుకొని నిర్మలమైన మనస్సుతో ప్రయత్నిస్తే గాని నీ సద్భక్తి పట్టుబడదు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

73

**మ. మోహధ్వాంతములో మునింగిన మహామూఢుండతిభ్రష్టుడై**
**సోహం బంచు దొడంగి నీకు గడు దూరాత్ముండగుంగాని దు**
**ష్టాహంకార గుణంబు మాని,మది సొంపారంగ,సద్భక్తి దా**
**సోహంబన్న భవత్పదార్చకుడు నీపై యుండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా! ఏ వస్తువును చూడాలన్నా ముందు చీకట్లోంచి వెలుతురులోకి రావాలి. మోహమనేది ఒక పెను చీకటి. అది అహంకారాన్ని కలిగిస్తుంది. మోహము అనే ఆ పెను చీకటిలో కొట్టుమిట్టాడుతూ, మూఢత్వంలో మునిగి భ్రష్టుడైన వాడు 'సోహం' (నువ్వే నేను) అని ఎంత అరిచినా కూడా వాడు నీ దగ్గరకు చేరలేడు. నీకు దూరాత్ముడే. దుష్టమైన ఆ అహంకారగుణాన్ని తొలగించుకొని, మోహపు చీకటి నుండి బయటపడి 'దాసోహం' అంటూ నీ పాదాల వద్దకు చేరిన వాడికే సోహం అనుకునే అర్హత ఉంటుంది. అతనే నీవౌతావు.నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

74

**శా. చావంబుట్టుచు,బుట్టజచ్చుచు మహా చండాల సంసార పా**
**రావారంబున గూలి తా జెడుటకుం బ్రవ్యక్తిగా నాత్మలో**
**సేవంబొందక, యేను నీవనుట తానే జ్ఞాన మో శ్రీ మహా**
**దేవా! యిట్టి గుతర్కముం గలదె చింతింపంగ సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా! కోరికలనన్నిటినీ వీడి, ఈ వ్యామోహాల నన్నిటినీ వదిలించుకొని నీ భక్తిలో తలమునకలౌతూ, నీ సామీప్యాన్ని సాధించి, క్రమంగా నీ పాదాల దగ్గరకు చేరితే ఆపైన నా తండ్రీ! నీవే నేను ( సోహం) అనే భావం కుదురుతుంది. అంతేకాని చస్తూ పుడుతూ, పుడుతూ చస్తూ ఈ హీనాతి హీనమైన సంసారమనే సాగరంలో పూర్తిగా మునిగిపోయి ఏ మాత్రం ఆత్మను శివాధీనం చేయకుండా, నీ సేవయే లేకుండా, నేను శివసారూప్యాన్ని సాధించాను అని అనుకోవడం _ అదేం తెలివి! అంతకంటే వితండమైన వాదం మరొకటి ఉంటుందా! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

75

**మ. రసికుండై భవదంఘ్రి పద్మయుగ మారాధించుచో దుర్మద**
**వ్యసనాటోపము చిక్కులం బొరలుచున్ వర్తించు చున్నట్టి పా**
**లసు పూజావిభవం బదొప్పునె ,భువిన్ లక్షింప నారంభముం**
**గసవుం బెంచిన చేను బోలు దలపంగా మీద సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ పాదాలను సేవించాలంటే ఎంతో భక్తితో, ఏకాగ్రతతో, రసికతతో ఆరాధించాలి. కానీ అహంకారమూ, దుర్వ్యసనాలూ అనేకంగా ఆ ఏకాగ్రతకు అడ్డుపడి చిక్కులుపెడుతూ ఉంటాయి. ఆ చిక్కులను అధిక మించాలి. అలా కాకుండా అహంకారానికి లొంగి దుర్వ్యసనాలకు లోబడిన మూర్ఖుడు చేసే పూజ , అదెంత గొప్పగా, వైభవంగా చేసినా అది శుద్ధ దండుగ. అది మొదటినించీ కలుపుమొక్కలు నిండివున్న చేను లాంటిది. ఆ కలుపు తొలగించకపోతే పంట ఫలితం చేతి కందదు. అహంకారాన్నీ, దుర్వ్యసనాలనూ తొలగించుకోకపోతే పూజా ఫలమూ దక్కదు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

76

**మ.అమితోత్సాహము నంది నీకు తన సర్వార్థంబులున్ గూర్చి నే మముతో నిచ్చుటకంటె,శౌర్యగుణ సామర్థ్యం బునన్ జేసి ప్రాణము నీకిచ్చుటకంటె,దుస్తర భవోన్మాదంబు మర్దించి చిత్తము నీ కిచ్చుట పెక్కు భంగుల మహౌదార్యంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, కొంతమంది భక్తులు మహా ఉత్సాహంతో తమకున్న ధనధాన్యాలనూ ఆస్తినీ మొత్తం నీకు సమర్పిస్తారు. మంచిదే! మరికొంతమంది వీరభక్తులు తమ శౌర్యగుణం ప్రదర్శించి తమ ప్రాణాలను కూడా నీకు అర్పణగావిస్తారు. అదీ గొప్పదే. కానీ భక్తుడు ఈ సంసారం మీది పిచ్చి వ్యామోహాన్ని వదుల్చుకొని చిత్తమును నీకు సమర్పించడం అనేది వీటన్నిటి కన్నా మహా ఉదారమైన, అతిగొప్ప ఆరాధనా విశేషం. నీవు భక్తులనుండి వారి ధనాన్నీ, ప్రాణాన్నీ ఆశించవు. నిష్కామంగా, హృదయపూర్తిగా నిన్ను సేవించడమే నీవు కోరే పూజ. నా తండ్రీ ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

77

**మ.ఘన వైరి ప్రకరంబు ధాటి ననిలో ఖండించు కంటెన్,మృగేం**

**ద్రుని జేపట్టుట కంటె ,వారినిధిలో దోగాడు కంటెన్,మహా**

**శని దా వేయుటకంటె ఘోర భవ దుశ్చారిత్ర వారించి రం**

**జన తో జిత్తము శిక్ష జేయుట మహా శౌర్యంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, చాలామంది తాము మహా శౌర్యవంతుల మనుకుంటుంటారు. శౌర్యాన్ని ప్రదర్శిస్తూనూ ఉంటారు. యుద్ధంలో శత్రువులు ధాటిగా పైబడినప్పుడు వారి ఆటోపాన్ని ఆపి శౌర్యం చూపిస్తుంటారు. అరణ్యంలో పోయేటప్పుడు సింహం ఎదురైతే ఒంటరిగా దానిని ఎదుర్కొని పట్టి దాని ఔద్ధత్యాన్ని అణచి పరాక్రమంతో దాన్ని మట్టి గరిపిస్తారు. ఎత్తైన తరంగాలతోనూ తిమి తిమింగలాలతోనూ మొసళ్ళతోనూ నిండిన భీకరమైన సాగరాన్ని, అడ్డంకులనన్నిటినీ అధిగమిస్తూ మొక్కవోని శౌర్యంతో దాటగలుగుతారు. యుద్ధంలో పిడుగులు కురిపిస్తూ శత్రువులు గుండెల్లో భయోత్పాతం సృష్టిస్తుంటారు. కానీ స్వామీ! ఈ పరాక్రమాలన్నిటికన్నా అన్ని కోరికలూ

అణచుకొని, జననమరణ దుఃఖంతో కూడిన ఈ మహా సంసారసాగరాన్ని దాటే విధంగా మనస్సును నిగ్రహించుకోవడం అనేది చాలా గొప్ప శౌర్యం. బయటి శత్రువులను ఓడించే పరాక్రమం పరాక్రమమే కాదు .కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరుగురు అంతశ్శత్రువులను నిర్జించగలిగిన శౌర్యమే అసలైన శౌర్యం. నీ పాదాల దగ్గరకు చేర్చే శౌర్యం. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

78

**మ. అమితామోద నవప్రసూనముల నిన్నర్పించుచో,గద్య ప**
**ద్యము లూహించి నుతించుచో,వివిధ గీత వ్రాతముల్పాడుచో,**
**నమృతాహారము లిచ్చుచో,నిపుణుడై యాటాడుచో,నందు జి**
**త్తము సద్భక్తి యె నీవు చేకొను పదార్థంబెల్ల సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,గొప్ప సువాసనగల పుష్పాలనేకం తెచ్చి, వాటితో నిన్ను అలంకరించి పూజలు చేస్తారు కొందరు భక్తులు. తమకున్న శక్తులన్నిటినీ నీముందు ప్రదర్శించి తమ విద్యలతో నిన్ను అర్చిస్తారు కొందరు. నీపైన కవిత్వాలు రాస్తారు, పదాలూ పద్యాలూ వ్రాసి నిన్ను కీర్తిస్తారు, అద్భుతమైన కీర్తనలు పాడుతూ గాత్రాలతో వాయిద్యాలతో సంగీతంతో నీ ముందు వాటిని ప్రదర్శించి పరవశించి అది నీకు చేసే పూజగా భావించి సంతోషిస్తారు కొందరు. అతి రుచికరమైన భక్ష్య భోజ్యాలనూ ఫలాలనూ నీకు నివేదన చేస్తారు. నృత్యమో, కోలాటమో, భజనలో ఏవో తమకు తెలిసిన ఆటలు నీ ముందు ప్రదర్శిస్తారు. తాము ఏయే విద్యల్లో నిపుణులో ఆ విద్యలన్నీ నీ

ముందు చూపించి తృప్తి పడతారు. కానీ స్వామీ! నీవు వీటన్నింటినీ యథాతథంగా స్వీకరించవు. ఇచ్చేవాడి చిత్తంలో భక్తి భావముందా లేదా అనేది మాత్రమే చూసి ఆభక్తినే స్వీకరిస్తావు. హృదయంలో భక్తిభావం ఉంటేనే ఆ పూజలను అంగీకరిస్తావు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

79

**మ. కడుచిత్రంబుగ జేయగా నొఱ సురంగం బయ్యెనే,ఖడ్గమం**

**దిడకున్నం జెడురూప దేమి గొఱ ,దానింబెక్కు పాటింపగా**

**నొడలెబ్బంగులనోపునే,నియతితో నూహించి నిన్నాత్మలో**

**నిడకున్నం జను రూపు నేమి కొఱ తా నీక్షింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,ఖడ్గం ఉంచడానికి అందంగా చిత్రంగా సొరంగంలాగా ఉండే ఒక ఒఱను తయారు చేస్తారు. కత్తి బయట ఉండడానికి వీల్లేదు. ఒఱ కత్తికి రక్షణ. ఒఱలో ఉండకుండా బయట ఉంటే పొరపాటున దాని పదునుకు ఇతరులకు హాని జరగవచ్చు. కత్తికూడా పదును కోల్పోయి తుప్పు పట్టవచ్చు. కత్తికి ఒఱలో ఉండడమే ఉచితం. నాకు ఒఱ అక్కర్లేదు అని కత్తి అనుకుంటే ఒఱకు వచ్చిన కొఱత ఏమీలేదు. ఒఱలో ఉంటేనే కత్తికి రక్షణ. జీవుడు కత్తిలాంటి వాడు. పరమాత్మ అనే ఒఱలో ఉంటేనే జీవునికి సార్థకత. రక్షణ. అందుకని జీవుడు నియతితో ప్రయత్నించి పరమాత్మపైన నిన్ను చేరి రక్షణ పొందాలి. కాదని నిరాకరిస్తే జీవునికే నష్టంగాని పరమాత్మకేమి కొఱత?

పరమాత్మను చేరుకోవడమే జీవుని కర్తవ్యం. దాని వల్లనే జీవునికి సార్థకత.నా తండ్రీ! సర్వేశ్వరా! నీపాదాలకు మ్రొక్కులు!

80

**మ. జ్వర సంతాప విశోషితాంగుడు సుధా సంకాశ దివ్యాన్న పా**

**న రసశ్రేణి భుజింప రోయుగతి ,నున్మాదేంద్రియ ధ్వాంత దు**

**స్తర సంసార మద ప్రమత్తుడు మహా సౌఖ్యోత్సవంబైన మీ**

**చరణారాధన యందు బుద్ధి జొనుపం జాలండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,నీ పాదసేవ అనేది మహా సౌఖ్య కరమైన ఉత్సవం. దానిని పొందడానికి అరి షడ్వర్గాలను అధిగమించిన, నిర్మమమైన మనస్సు ఉండాలి. ఇంద్రియాలు కల్పించే చీకటిలో, సంసార మహా సాగరంలో మునిగి కొట్టుమిట్టాడు తున్న మానవుడు ఆ మహా సౌఖ్యానికి దగ్గర కాలేడు. బాగా జ్వరంతో బాధపడుతూ, కృశించిపోయిన శరీరం కలవాడికి అమృత సమానమైన భోజన పానీయాదులి చ్చినా వాడికి అవి రుచించవు. జ్వరం పూర్తిగా తగ్గిపోయి సంపూర్ణ ఆరోగ్యం కలిగితేగాని వాడికి తిండి మీది అరుచి తొలగదు. అలానే _సంసారమనే మోహపు చీకటిలో మునిగి వున్న వాడికి నీ పాదారాధన లోని మహాసౌఖ్యం అవగతం కాదు. ఇంద్రియ

వ్యామోహాన్ని వదుల్చుకొని చిత్తమును నీమీద ఏకాగ్రం కావించు కొని వస్తేనే జీవుడికి ఆ సౌఖ్యం అనుభూత మౌతుంది.నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

81

**మ. కలయం గాష్ఠయుగంబు గూర్చి తరువంగాబుట్టి తత్సాధన**

**బుల్ రెంటిన్ దహియించు వహ్ని గతి దా బొల్పొంద గాయంబు సం**

**ధిల సత్కర్మముతో మథింపగ భవచ్చిద్భక్తి సద్వహ్నియు**

**జ్వలమై కాయము కర్మముం జెరుచు తత్వంబెన్నసర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, రెండు కర్రలను తీసుకుని వాటిని ఒకదానితో ఒకటి తీవ్రమైన రాపిడి చేస్తే అగ్ని పుడుతుంది. ఆ నిప్పే రెండు కట్టెలనూ కాల్చివేస్తుంది. ఆలోచిస్తే ఆ ప్రక్రియల గొప్ప తత్త్వందాగున్నది. అలా నిప్పు పుట్టాలంటే తీవ్రమైన రాపిడి అవసరం. ఈ శరీరంతో పాటు జీవుడు గత అనేక జన్మల్లో చేసుకున్న కర్మమూ వెనుతగిలి వస్తుంది. ఈ శరీరంతో ఆ కర్మాన్ని తీవ్రాతి తీవ్రంగా మథిస్తే మోక్షాన్ని సాధించేందుకు కారకమైన నీయొక్క చిద్భక్తి అనే సద్వహ్ని, అంటే మంచినిప్పు పుడుతుంది. ఆ మహా భక్తియే కర్మను కాల్చివేస్తుంది. శరీరానికీ మోక్షాన్నీ ప్రసాదిస్తుంది. జన్మల పరంపర నుండి వెంటబడి వచ్చిన కర్మ దాని ఫలాన్ని అనుభవించిన దాకా వదలదు. కాయం మారినా కర్మం మారదు. అది నశించి పోవాలంటే నీపై

భక్తి ఒక్కటే సాధనం. జీవుని కర్మను దహించి ముక్తిని ప్రసాదించేది కేవలం నీపై భక్తి మాత్రమే. అది కాయ కర్మల మథనంలో ప్రవహించే అగ్ని. నా తండ్రీ ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

82

**మ.స్థిరబుద్ధిం దనసొమ్ము భక్తవర సుక్షేత్రంబులం బీజమై**
**పరగంగా వెదబెట్టి, మీద నతి సంతుష్టుండగుం గాక,దా**
**నరి షడ్వర్గము పాలుసేసి,భవ మాయా గ్రస్తుడై యిచ్చ నె**
**వ్వరి వేడంజనువాడొకో విషయ దుర్వ్యాపారి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, ఒక మంచి విత్తనాన్ని సారవంతమైన క్షేత్రంలో విత్తితే మొలిచి పూలూ పండ్లూ ధాన్యమూ ఇస్తుంది. రైతుకు తృప్తి కలుగుతుంది. అలాగే మానవుడు తన బుద్ధి అనే స్థిరమైన విత్తనాన్ని శివభక్తుల పూజ అనే సుక్షేత్రంలో నాటితే అది పరమేశ్వరునికి దగ్గరయ్యే దారిని చూపుతుంది. ముక్తిని సుకరం చేస్తుంది. అలామానవుడి జన్మకు సాఫల్యం లభిస్తుంది. అయితే ఆబుద్ధి స్థిరమైనదై ఉండాలి. తాలువిత్తనంలాగ ఉండ గూడదు. ఈ సంసార మాయా బంధాలలో చిక్కి అరిషడ్వర్గాలనే శత్రువులనుపోషిస్తూ విషయదుర్వ్యాపారాల్లో కొట్టుమిట్టాడుతూ ఉంటే అది మంచి విత్తనమూ కాదు, మంచి క్షేత్రమూ గాదు. అటువంటి ఇంద్రియలోలుడైన మానవుడు తన విత్తనానికి

ఫలితం చేకూరలేదని ఎంత వాపోయినా ఏంలాభం. ఎవరి దగ్గరికి పోయి మొత్తుకున్నా ఏం ఫలితం! జీవుడు స్థిరమైన భక్తితో భక్తవరులను సేవిస్తుంటేనే ముక్తికి అర్హుడౌతాడు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

83

**శా.కాయంబన్నది వారి బుద్బుద సదృక్షం,బందు రూపింప లే**

**బ్రాయంబన్నది శారదాంబుద తటిత్ప్రఖ్యంబగుస్,దత్సుఖ**

**శ్రేయంబన్నది మాయ!యిట్లెరిగియుస్ శీఘ్రంబ నీ ధ్యాన సం**

**స్థాయీ భావన బొందడేమిటికయో! సంసారి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, ఈ సంసార మనేది చాలా చిత్రమైనది. అందులో మునిగిఉన్నవాడికి అదెంతో విశాలమైనదీ, శాశ్వతమైనదీ అనిపిస్తుంది. అందులోనే ఎల్లకాలమూ ఉండి మహాసౌఖ్యాలను పొందుతూనే ఉండిపోతానని నమ్ముతుంటాడు. నిజానికి ఈ విశాల మహాప్రపంచంలో వాడి స్థానమెంత, ఈ మహా కాల పరిమాణంలో వాడి బ్రతుకు యొక్క ఆయుర్దాయమెంత? ఈ శరీరం, పారే నీటిమీద లేచే ఒక చిన్న బుడగ లాంటిది. ఈ శరీర ప్రస్థానమనే బుడగలో వాడి యౌవన కాలం గడువు ఒక మెరుపు మెరిసినంత సేపు. బుడగ బ్రతుకు మహా ఉంటే లిప్తో, రెండు లిప్తలో! మెరుపు బతుకు బుడగంత కూడా ఉండదు గదా. ఇలా కనిపించి అలా మాయమౌతుంది.

ఇక ఆ మెరుపు అనే యౌవన కాలంలో పొందే సుఖం యొక్క పరిమాణమెంత ఉంటుంది? మెరుపు మెరిసేదే క్షణంలో ఏ వెయ్యోవంతో! ఇక దానిలో సుఖమెంత? కేవలం మాయ! బ్రతుకు బుడగ, బ్రతుకులోని యౌవనం ఒక మెరుపు, ఆ మెరుపు కాలంలో దొరికే సుఖం మాయ కాకపోతే మరేమిటి! ఇంత క్షణభంగురమైన సంసారాన్నీ, జీవితాన్నీ, దానిలోని యౌవనాన్నీ, ఆ యౌవనంలోని సుఖమనే భ్రాంతినీ నమ్ముకుని శాశ్వతానంద సంధాయకమైన నీ పాదసీమను చేరే ప్రయత్నమే చేయడే ఈ సంసారి! ఎంత మూర్ఖత్వం! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

84

**మ. భవదీయ స్థిరభక్తి లబ్ధియు ,భవద్భక్తైక గోష్ఠీ మహో**

**త్సవ లీలా విభవంబు,నీ అనుదిన ధ్యానానుమోదంబులౌ**

**నివి నిత్యస్థితు లారయంగ,విధి దేవేంద్రాది భూతాఖిలో**

**త్సవ మోహ స్థితులెల్ల మిథ్యలవి,తత్త్వంబెన్న సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ మీద భక్తి ప్రాప్తించడం బహుళ మైన పుణ్యాల ఫలితం. ఇక నీ భక్తుల సన్నిధి లో కూర్చుని,వారితో నీ లీలల గురించి సద్గోష్ఠి సలుపుతూ ఉండడమనేది ఒక మహోత్సవం. అదొక వైభోగం. ఇక ప్రతిరోజూ నిన్ను గురించి ధ్యానం చేస్తూ పరవశంతో చొక్కి పోవడం భక్తుని దినచర్య. ఈ మూడూ, అంటే నీపై భక్తీ, శివభక్తులతో గోష్ఠి,ప్రతి దినమూ శివ ధ్యానమూ, ఇవి నిత్యమైన స్థితులు. శాశ్వతానంద సంధాయకాలు. అంతేకాని బ్రహ్మ, ఇంద్రుడూఅని ఇతర దేవతలతో, భూతాలతో జరిపే మోహస్థితులన్నీ కేవలం మిథ్యలు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

85

**మ. తనయుక్తిం భవదంఘ్రి సేవ గల సద్భక్తుండు పాపంబు చే**
**సిన పుణ్యంబగు,భక్తిహీనుడు శృతుల్ చేపట్టి పుణ్యంబు చే**
**సిన పాపంబగు,దీనికంతటికి జర్చింపంగ జండేశ్వరుం**
**డును దక్షుండును సాక్షులెన్న నగరాట్కోదండ! సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా! మేరు పర్వతమును ధనుస్సుగా చేసుకొని త్రిపురాసురుల మూడు పురములనూ నాశనం కావించిన దేవా! నీపైన స్థిరమైన భక్తి ఉండే మానవుడు ఏమిచేసినా సహిస్తావు. అనుగ్రహిస్తావు కూడా. నీపై భక్తి అనేదే లేకుండా నిన్ను తిరస్కరించే వాడు ఎంత పుణ్య కార్యం చేసినా ఆమోదించవు. వాడికి గర్వభంగం చేస్తావు. ఈ రెండు విశేషాలకూ చండీశ్వరుని కథా, దక్షుని కథా ఉదాహరణాలు.

విశాలుడు అనే బ్రాహ్మణబాలుడు భక్తి పారవశ్యంతో ఇసుక లింగమునుచేసి తాను కాసే ఆవుల పాలతో ఆ లింగాన్ని ప్రతిరోజూ అభిషేకంచేస్తూ మైమరచి పోతుంటాడు. ఒకరోజు ఆ బాలుని తండ్రి వచ్చి చూస్తాడు. అతనికి లింగం కనిపించదు.

తన కొడుకు కళ్ళు మూసుకొని ఇసుకలో పాలు పారబోయడం మాత్రమే కనిపిస్తుంది. పాలు వృధా చేస్తున్న కొడుకుపై కోపంతో అతను పాలకుండను తంతే అది పగిలి పాలు నేలపాల వుతాయి. ఆ విశాలుడు తను చేసే అభిషేకానికి కలిగిన విఘ్నాన్ని చూసి తండ్రి అనికూడా చూడకుండా గొడ్డలి విసురుతాడు. అతని తండ్రి కాళ్ళు రెండూ తెగిపోతాయి. విశాలుని భక్తి పారవశ్యానికి ప్రీతుడైన శివుడు, అతడు పితృహత్య అనే మహాపాతకాన్ని చేసినా క్షమించి, అనుగ్రహించి అతన్ని తన పరివారంతో ఒకడిగా చేర్చుకొని , తన నిర్మాల్యాన్ని స్వీకరించే అర్హతను అతనికి అనుగ్రహిస్తాడు. ఆ విశాలుడే చండీశ్వరుడై శివపరివారంలో ఒకడిగా ఉండిపోతాడు. శివాలయాల్లో బయట శివాభిషేకజలం బయటకు వచ్చే తూము పక్కన చండీశ్వరుని విగ్రహముంటుంది. శివునిపై అఖండమైన భక్తి ఉంటే అతను చేసిన మహాపాపాన్నికూడా పరమేశ్వరుడు క్షమిస్తాడనడానికి చండీశ్వరుని కథే ఉదాహరణ.

ఇక భక్తి లేకుండా శివనిందా, శివనిరాకరణమూ చేసేవాడు ఎంత పుణ్యకార్యం చేసినా దాన్ని శివుడంగీకరించ డనడానికి దక్షుడి కథే దృష్టాంతం. దక్షుడు ప్రజాపతి. సాక్షాత్తూ

శివుని భార్య ఐన సతీదేవికి తండ్రి.మామనైన నన్ను గౌరవించడే అని శివుని ద్వేషిస్తూ, నిందిస్తూ ఉంటాడు. మూర్ఖుడు కాకపోతే అతన్ని శివుడు గౌరవించడమేమిటి. మామ అయినంత మాత్రాన అతను శివునికన్నా ఉన్నతుడౌతాడా. ఒకసారి అతను యజ్ఞం తలపెడతాడు. కానీ శివుణ్ణి ఆహ్వానించడు. ఎవరెంతచెప్పినా వినకుండా శివుని నిందిస్తూనే ఉంటాడు. యజ్ఞం అనేది పుణ్యకార్యమైనా శివుని తిరస్కరిస్తూ చేసే పుణ్యానికి ఏం ఫలితం ఉంటుంది? ఆ యాగాన్ని శివుడు ధ్వంసం చేసి దక్షుడికి గర్వభంగం కావిస్తాడు.

శివభక్తి సర్వపాపహరణము . శివనింద సర్వనాశనానికి కారణము. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

86

**శా.ప్రారంభించి చకోరపోతము మహీయజ్యోత్స్నయం దుత్సవ**

**శ్రీ రంజిల్లుచు వేడ్క నుండు గతి,నాచిత్తంబు నీ దివ్య శృం**

**గార ధ్యానమునం దహర్నిశము జొక్కంజేయవే,దేవ! శ్రీ**

**గౌరీ లోచన నర్తకీ నటన రంగస్థాన! సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, చకోరపక్షికి వెన్నెల ఆహారము .వెన్నెలే జీవనము దానికి. వెన్నెలను కాక మరిదేనినీ ఆశించదు. గొప్పదైనటువంటి ఆ జ్యోత్స్నలోనే వేడుకగా జీవిస్తూ ఉంటుంది. అలా చకోరపక్షి వెన్నెల్లోని చల్లదనాన్నీ, కమ్మదనాన్నీ ఉత్సాహంతో ఆస్వాదిస్తూ ఉండిపోయే విధంగా నా మనస్సును నీ భవ్యమైన, శృంగారవంతమైన, సుఖప్రదమైన ధ్యానంలోనే ఎల్లప్పుడూ పరవశిస్తూ ఉండిపోయేటట్లు అనుగ్రహించు. పార్వతీదేవి కనులు ఎప్పుడూ నాట్యం చేస్తూ ఉండే రంగస్థలం వంటి నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

87

**మ. తరులం బువ్వులు పిందెలై యొదవి తత్తజ్జాతితో బండ్లగున్**
**హర! మీ పాద పయోజ పూజితములై యత్యద్భుతం బవ్విరుల్**
**కరులౌ,నశ్వములౌ ,ననర్ఘమణులౌ,గర్పూరమౌ,హారమౌ**
**దరుణీ రత్నములౌ,బటీరతరులౌ తథ్యంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, చెట్టుకు పూవు పూస్తే అది క్రమంగా పిందెగా మారి ఆ చెట్టుకు సంబంధించిన పండవుతుంది. అలా ఏ చెట్టుజాతి పూలు ఆ చెట్టుజాతి పండ్లవుతాయి. పువ్వు పండు గావడం సహజంగా జరిగే ప్రక్రియ. కానీ, పరమశివా! ఆపువ్వో పండో స్థిరమైనభక్తితో నీ పాదాల దగ్గర సమర్పిస్తే అవే ఏనుగు లౌతాయి. గుర్రాలవుతాయి. విలువైన మణిమాణిక్యా లవుతాయి. కర్పూరాలౌతాయి. మణిహారాలవుతాయి. అంద చందాలొలికే అంగనలౌతాయి. చందనపు చెట్లవుతాయి. అంతా నీ దయ! నీ అనుగ్రహం! నీ పాదాల దగ్గర భక్తి పారవశ్యంతో కూచుని ఒక పూవో పండో సమర్పిస్తే, ఇంకాస్పష్టంగాచెప్పాలంటే హృదయమే పుష్పంగా నీకు సమర్పిస్తే నీవు రథ, గజ,

తురగాది వైభవాలూ, ధన, కనక, రత్నరాసులూ, కర్పూర, చందన చర్చలతోనూ, విలాసాలతోనూ గడచిపోయే రాసిక్య జీవన సౌభాగ్యాలూ ప్రసాదిస్తావు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

88

**మ.ఒక పుష్పంబు భవత్పద ద్వయముపై నొప్పంగ సద్భక్తి రం**
**జకుడై పెట్టిన పుణ్యమూర్తికి బునర్జన్మంబు లేదన్న,బా**
**యక కాల త్రితయోపచారముల నిన్నర్చించుచో బెద్ద నై**
**ష్ఠికుడై యుండెడి వాడు నీవగుట దా జిత్రంబె సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీవు భక్త సులభుడవు. నీ పాదాల చెంత భక్తితో ఒక పూవును సమర్పించిన వాడికి మళ్ళీ జన్మం లేకుండా చేస్తావు. ఇక నిన్ను నిత్యమూ ముప్పొద్దులా షోడశోపచారాలు చేస్తూ పూజించే వాడి సంగతి చెప్పాలా! అతడు నీవేకావడంలో ఆశ్చర్య ఏముంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

యథావాక్కుల అన్నమయ్య సత్రసాల అనే శివక్షేత్రంలో కృష్ణానది తీరాన కూచుని ఈ శతకం వ్రాశాడట. తను వ్రాసిన పద్యాల తాటాకులను ఒక్కొక్కటీ ఏరోజుకారోజు కృష్ణలో వదిలేవాడట. ఆ ఆకు నదికి ఎదురెక్కి తిరిగివస్తే ఆ పద్యాన్ని శివుడు అంగీకరించినట్లు భావించి స్వీకరించే వాడట. అలా

రాకపోతే తాను గండ్రకత్తెర వేసుకుంటానని శపథం చేశాడట. అతను వ్రాసిన తరులం బువ్వుల బిందెలం అనే పద్యం (పైన 87 నెం.) గల ఆకు తిరిగిరాకపోయేసరికి తన పద్యాన్ని శివుడం గీకరించ లేదని భావించి గండ్రకత్తెర వేసుకోబోతుండగా ఒక పసుల కాపరి వచ్చి తనకు కృష్ణలో దొరికిందని ఒక తాటాకు ఇచ్చాడట. దానిమీద ఈ పద్యం (88 నెం) ఉందట. తన పద్యాన్ని శివుడు సంస్కరించి, సరిజేసి పంపాడని భావించి దాన్ని అన్నమయ్య స్వీకరించాడట. ఇది జనప్రవాదంలో ఉన్నకథ.

తరులం బువ్వుల అనే పద్యంలోని భావం _ స్వామీ, నీ పాదాల దగ్గర భక్తితో ఒక పువ్వు ఉంచితే నీవు సకల సంపదలూ ఇస్తావు అని. అంటే భక్తుడు శివుణ్ణి కోరికలు కోరుతున్నాడనీ, తన పూజకు ప్రతిఫలం ఆశిస్తున్నాడనీ అర్థం. అది కోరికలతో కూడిన పూజ. నిష్కామమైనది కాదు. సకామమైనది. ఇక ఈ రెండో పద్యంలో భావం. భక్తితో స్వామి పాదాలవద్ద ఒక పూవు సమర్పిస్తే జన్మరాహిత్యం కలుగు తుందనీ, ముప్పొద్దులా షోడశో పచారాలతో పూజిస్తూ ఉంటే

శివత్వమే లభిస్తుంది అని. ఇందులో అదిస్తావు, ఇదిస్తావు అనే ముచ్చటే లేదు.

పిండితార్థం ఏమిటంటే ఐహికమైన కోరికలపై మోహాన్ని వదిలించుకొని శివుని పాదాలాశ్రయిస్తే ముక్తి లభిస్తుంది అని. ఆ సంగతినే చెపుతుంది ఈ కృష్ణలో తాటాకు వదలడమూ, గండ్రకత్తెర వేసుకోవాలనుకోడమూ అనే కథ.

నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

89

**శా.ఆనందంబును బొందు నప్పుడు ను,నత్యాశ్చర్య కార్యార్థ భా**
**వానీకంబులు దోచు నప్పుడు ను,రోగాపాయ దుఃఖాతుర**
**గ్లానిం బొంది చరించు నప్పుడు ను,సత్కార్యంబున న్నీవు నా**
**ధ్యానంబం దుదయింపు మయ్య!దివిజేంద్రస్తుత్య! సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, ఇంద్రాది దేవతల పూజలందుకొనే స్వామీ! నీవు ఎల్లప్పుడూ నా ధ్యానంలో ఉండిపోవయ్యా ! ధ్యానమైతే చేస్తానుగాని ఆ ధ్యానంలో నిన్ను దర్శించడం ఎంత కష్టసాధ్యం! నీ కరుణలేకుండా అది సాధ్యం కాదుగదా. కష్ట సుఖాలన్నిట్లో నిన్ను ధ్యానిస్తూనే ఉంటాను. సంతోషంగా ఉన్నప్పుడూ, ఎంతోభారమైన కార్యాన్ని నిర్వహించాలను కున్నప్పుడు హృదయంలో రకరకాలైన భావాలు కలిగి ఏమీ తోచక ఆశ్చర్యంతో తలమునకలయ్యేటప్పుడూ, జబ్బు చేసినప్పుడూ, ఏదైనా ముప్పు ముంచుకొస్తున్నప్పుడూ, దుఃఖంతో ఆత్రుతతో, వేదనతో అలమటించేటప్పుడూ, ఏదైనా సత్కార్యం చేసేటప్పుడూ_ఎప్పుడూ నిన్ను ధ్యానిస్తూనే

ఉంటాను. నా ధ్యానంలో దర్శన మీయవయ్యా! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

90

**శా.నానాశాస్త్ర సముచ్చయాగమ పురాణ ప్రౌఢులై తత్త్వ వి**

**జ్ఞాన ధ్యాన సమాధి విద్యలవి విస్పష్టంబుగా నేర్చి రే**

**దాన న్నేర్పరులెల్ల నేరరు భవత్సద్భక్తి విద్యా సమా**

**ధాన ప్రస్ఫుట శక్తి నీ కరుణ చేతం గాని సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,ఒక వ్యక్తి అనేక శాస్త్రాలు నేర్చుకోవచ్చు. వేదాలన్నీ పూర్తిగా అర్థం చేసుకో వచ్చు. అలా నేర్చుకున్న వేద పురాణ శాస్త్రాల విద్య ద్వారా తత్త్వ జ్ఞానమేమిటో, ధ్యానమేమిటో సమాధి విద్యలంటేఎలాంటివో అన్నీ తెలుసుకోవచ్చు. కానీ ఇవ్వెన్ని నేర్చినా ఏం లాభం? అన్నిటికన్నా ముఖ్యమైనదీ, నీపై కుదురు కోవలసినదీ నీపైన భక్తి కదా! ఆ సద్భక్తిని వారు చదువుకున్న శాస్త్రాలూ పురాణాలూ నేర్పజాలవు. అది కేవలం నీ కరుణ వలననే లభిస్తుంది. శాస్త్ర పాండిత్యం నీ భక్తే లేనప్పుడు నిష్ప్రయోజనం. భక్తి పాండిత్యంతో సమకూ రాదు. నీ కరుణవలననే అది సంప్రాప్తిస్తుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

91

**మ.ప్రకటింపంగ మదీయచిత్తమది దా పంచేంద్రియోద్వృత్తమై**
**ప్రకట ప్రాప్తిని నోలుగాని మఱినీ పాదాబ్జ సంసేవనం**
**బొకవేళన్ భజియింప నొల్లదు,నిజం బూహింపగా నట్ల యీ**
**గకు దుర్గంధము గాక సహ్య మగునే కస్తూరి, సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నా మనసు చాలా బలహీనమైనది. తన్ను తాను నియంత్రించుకోలేదు. పైగా ఇతర ప్రభావాలకు సులభంగా లోబడి పోతుంది. పంచేంద్రియాల, అంటే కనులూ, చెవులూ, నాసికా, నాలుకా, చర్మమూ అనే ఐదుకర్మేంద్రియాల ప్రభావం చాలా బలీయమైనది. ఆ ప్రభావం మనస్సును చాలా త్వరగానూ, పకడ్బందీగానూ పట్టుకుంటుంది. దాన్ని వదల్చు కోవడం మహాకష్టం. మనసును ఉద్రేకింపజేసే దృశ్యాలను కనులు చూస్తేనో, మోహం కలిగించే ముచ్చటలను చెవులు వింటేనో, మోదకమైన వాసనను ముక్కు అనుభవిస్తేనో, మంచిదా కాదా అనే విపేచన లేకుండా కేవలం రుచిగా ఉంది గదాఅని ఏదంటే దాన్ని నాలుక ఆస్వాదిస్తేనో, మనసును తీవ్రంగా లోబరచుకునేంత హాయిని కలిగించే స్పర్శ కలిగితేనో

వాటికి మనసు బాగా లోబడి పోతుంది. పంచేంద్రియాలు కలిగించే ఆ ఉద్రేకాలు ఇచ్చే హాయికి సొక్కిపోతుంది మనసు. ఆ మైకంలో నీపై భక్తిని తలవనే తలవదు. మనసు ఈగ లాంటిది. దుర్గంధాన్ని ఆనందించినట్లు అది కస్తూరి సువాసనను ఆనందించలేదు. ఎందుకంటే అది ఈగ కాబట్టి. మనసు కస్తూరి సుగంధాన్ని ఆనందించాలంటే ముందు ఈగ స్థాయి నుంచి మనిషి స్థాయికి ఎదగాలి అప్పుడు దుర్గంధములోని అసహ్యం అర్థమౌతుంది. పంచేంద్రియాల ప్రభావాన్ని వదిలించుకుంటేగాని నీపై భక్తి కుదరదు. ఒకసారి కుదిరిందంటే మరలా ఇంద్రియాల దుష్ప్రభావాన్ని దరిచేరనీయదు. నామనస్సును మంచి త్రోవలో నడపవయ్యా! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

92

**మ.మలినాంగుండగుటేమి కష్టము మనోమార్గంబు నీ భక్తి ని**
**ర్మల సౌభాగ్య నిధాన దీపశిఖయై రంజిల్లదే భూషణో**
**జ్వల దేహుండగుటేమి తేజము మనోవ్యావృత్తి దుర్మోహ సం**
**చల దుష్పంకము బొంది పీడ బడగా జర్చింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, పరిశుభ్రత చాలా ముఖ్యమైనదే. కానీ పైపై పరిశుభ్రత, అంటే శరీరం మాత్రమే మలినం కాకుండా ఉంచుకుంటే సరిపోదు. అంతరంగం అంతా స్వచ్ఛంగా ఉంచుకోవాలి మనిషి. మనస్సులో నీ యెడ భక్తి అనే సౌభాగ్యం దీపశిఖ లాగా వెలుగుతూ వుంటేనే ఆ వ్యక్తి మనస్సు శుభ్రంగా ఉన్నట్లు. అప్పుడు శరీరపు శుభ్రతా శుభ్రతలు అంత లెక్కలోకి రావు

ఒక మనిషి శరీరం నిండా బంగారు నగలు దిగవేసుకుని ఆహా నేనెంత తేజస్సుతో మెరిసిపోతున్నాను అని మురిసి పోతుంటాడు. కానీ అతని మనసు మాత్రం ఇంద్రియ వ్యామోహం అనే బురదలో ఉంటే అతని కెన్ని ఆభరణాలు ఉంటే

మాత్రం ఏం ప్రయోజనం. అలాంటి భూషణాలవల్ల కలిగే తేజం అదెంత తేజం. దీని అర్థం ఏమిటంటే మనిషి స్వచ్ఛంగా ఉన్నాడా లేదా అనేది అతని ఒంటిమీద ఉన్న ఆభరణాల వల్ల నిర్ణయింపబడదు. అతని అంతరంగంలో గల భక్తి అతని స్వచ్ఛతకు గుర్తు. పైపై పరిశుభ్రతకన్నా అంతరంగ స్వచ్ఛత ముఖ్యమైనది. పంచేంద్రియ వ్యవహారాలను వదిలించుకొని నీపై భక్తిని హృదయంలో పెంపొందించుకుంటే అదీ అసలైన శుభ్రత. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

93

**మ.ఇల నా చిత్తము యోగ సాధనల యందీదాడగా గొంత ని**
**శ్చలతం జేరగ వచ్చు,లేక తన వాంఛావృత్తి బోనిచ్చినం**
**బొలుపై నీ దెస జేర దట్టి దకటా!భావించినంగాక కే**
**వల సంబోధన నేల నిల్చు బుజుపై వర్తింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, ఈ మనస్సెంతో చంచలమైనది. నిలకడ ఎరగనే ఎరుగదు. తన వాంఛలవెంట పరుగెత్తి పోతూనే ఉంటుంది. కోరికలపై వ్యామోహంతో నీ వైపే చూడదు. మనసంతా అలా కోరికలతో నిండిఉండగా శివా శివా అంటూ ఊరికే పైపై సంబోధనలు చేస్తూంటే ప్రయోజన మేముంటుంది. యోగ సాధన చేస్తే కొంత నిశ్చలత సాధించవచ్చు గాని ఇంద్రియ వ్యాపారాలను నియంత్రించుకుంటే మరింతగానిశ్చలత వస్తుంది, ఏకాగ్రత సిద్ధిస్తుంది. పైపై నామస్మరణతో లాభం ఉండదు. అంతరంగశుద్ధీ, యోగ సాధనా, మనోనిశ్చలతను కలిగిస్తాయి. మనస్సు నిశ్చలం గావించుకొని ఏకాగ్రతతో నిన్ను సేవిస్తేనే నీ పాదాల దగ్గరికి చేరవీలౌతుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

94

**మ.ఉదకం బింకిన లావు మాలి కడుపై యష్టింపగా రొంపిలో**

**గదలం జాలని మీను వాన గురియం గ్రమ్మెక్కి పెన్నీటిలో**

**బొదలం గన్న విధంబునన్ భవముతో బోరాడు మర్త్యుండుదా**

**హృదయాబ్జంబున నిన్ను గొల్వ గనునే యింపొంద సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,నీరు నిండా ఉన్న చెరువులో చేపలు సుఖంగా స్వేచ్ఛగా తిరుగుతూ ఈదులాడుతూ ఉంటాయి. ఎండలు వచ్చి నీరంతా ఇంకిపోయి కేవలం బురద మాత్రమే ఉంటే చేపలు బురదలో ఇరుక్కుపోయి కదల్లేక బయటకు రాలేక అవస్థలు పడుతూ ఉంటాయి. మళ్ళీ ఒక వాన కురిసి చెరువులోకి నీళ్ళు రాగానే హాయిగా ఆనీటిలో చేప కదుల్తుంది. పరమశివా! ఈ సంసారం ఒక నీరెండిపోయి బురద మాత్రమే మిగిలిన చెరువు లాంటిది.బురదలో చేప చావలేక, బ్రతకలేక ఎలా అల్లాడుతుంటుందో మనిషి కూడా ఈ సంసారమనే బురదలో చిక్కుకుని అలానే బాధలు పడుతుంటాడు. ఆ జీవుడి హృదయంలోకి నీ కృపావర్షం కురిసి నిన్ను సేవించాలనే ఆకాంక్షా, నీ పాదాబ్జాలపై చిత్తమూ ఇవి

కొత్తనీటి జల్లు లాగా ప్రవేశిస్తే ఆ ఇరుక్కున్న రొంపిలోనుంచి విముక్తి లభిస్తుంది. జీవుని ఆత్మకు సుఖమూ, స్వేచ్ఛా, విడుదలా లభిస్తాయి. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

95

**మ. భవదీయార్చన జేయుచో ప్రథమ పుష్పం బెన్న సత్యంబు, రెం
డవ పుష్పంబు దయాగుణంబును,విశిష్టం బేకనిష్ఠా సమో
త్సవ సంపత్తి తృతీయ పుష్పమది ,భాస్వద్భక్తి సంయుక్తి యో
గ విధానం బవిలేని పూజలు మదిం గైకోవు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,హృదయం నిండా సద్భక్తి నింపుకొని యోగసాధన తో నిన్ను పూజించే భక్తుని పూజలను నీవు ఎంతో ఆదరంతో స్వీకరిస్తావు. అయితే ఆ పూజకు ఉపయోగించే పూలల్లో సత్యము అనేది మొదటిపువ్వై ఉండాలి. హృదయంలో దయాగుణం కలిగి ఉండటం అనేది రెండో పువ్వు. ఏకాగ్రనిష్ఠ అనేది మూడో పుష్పము. ఈ మూడు గుణాలూ లేకుండా అర్థం పర్థంలేని ఆడంబర మైన పూలతో చేసే పూజలను నీవు స్వీకరించనే స్వీకరించవు. సత్యనిష్ఠా, దయాగుణమూ, ఏకాగ్రతా లేనివాడి భక్తి భక్తీ కాదు, వాడు చేసే పూజ పూజా కాదు. నీ భక్తుల్లో సత్య ధర్మాలనూ, ఇతర జీవులయెడ కరుణనూ నీవు కోరుకుంటావు. ఆ గుణాలు కలిగిన వారి పూజనే నీవు స్వీకరిస్తావు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

మహానుభావుడు పోతన భాగవతం లో ఒక చిన్న పద్యం చెప్పాడు. ఆ చిన్న పద్యంలో అతి విశాలమైన అర్థాన్నీ, ఒక శాశ్వతమైన సత్యాన్నీ కూర్చాడు. అది ఏదంటే

" చేతులారంగ శి వుని పూజింపడేని,
నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని,
దయయు సత్యంబు లోనుగా దలపడేని
,కలుగనేటికి,తల్లుల కడుపు చేటు!" అనేది.

నీవు శివుని పూజించినా,హరిని కీర్తించినాహృదయంలో దయా, సత్యగుణమూ అనేవి లేకుంటే అసలు నీ బ్రతుకే వృధా అంటున్నాడు. మనిషి మనిషి అనిపించుకోవాలి అంటే ఈ రెండుగుణాలూ, భక్తితో దైవపూజ చేయడానికి ఈ రెండిటితో పాటుగా ఏకాగ్రనిష్ఠా అనేగుణమూ అతి ముఖ్యమైనవని మహాత్ములందరూ ఘోషిస్తున్నారు!

96

**మ.అమరేంద్రాద్రి శరాసనంబు,హరి దివ్యాస్త్రంబు, భూమండలం**
**బమరంగా రథ, మర్క చంద్రులు తదీయాంగంబులై యొప్పు జి**
**త్రము నీకుం బురలక్ష్య మేయు నెడ, నుద్యద్భాతి నత్యల్ప కా**
**ర్యము లందైనను దా మహా ఘనము నీ యత్నంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,త్రిపురాసురులు అనే రాక్షసులు మూడు ఎగిరే పట్టణాలలో తిరుగుతూ లోకాలన్నిటినీ అల్లకల్లోలం చేస్తూ ఉంటే వారిని నిర్మూలించడానికి నీవు పూనుకున్నావు. స్వామీ! నీ ముందు వారెంత! చిటికెలో వారిని భస్మం చేయగలవు. ఐనా, చాలా పెద్ద ప్రయత్నం చేశావు. దేవతా పర్వతమైన మేరువును ధనుస్సుగా చేసుకొన్నావు. సాక్షాత్తూ విష్ణుమూర్తిని బాణంగా అమర్చుకున్నావు. భూమండలం రథమైంది. సూర్య చంద్రులా రథానికి చక్రాలైనారు. నీవు సులభంగా నెరవేర్చగల అత్యల్పమైన కార్యానికి ఎంత మహనీయమైన సాధన సంపత్తిని సమకూర్చుకున్నావు! ఎంత తీవ్రమైన ప్రయత్నం చేశావు! మనిషి ఎంత చిన్నపని కోసమైనా మంచి సాధన సంపత్తిని

కూర్చుకొని గట్టిగా ప్రయత్నం చేయాలి గాని అల్పమైనదే గదా అని ఉపేక్షిస్తే ఏకు మేకు అయ్యే పరిస్థితి ఏర్పడి, చివరకు గోటితో పోయేదానికి గొడ్డలి కావాల్సి రావచ్చని లోకానికి బోధించావు. నా తండ్రీ ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

97

**మ.దివిజేంద్రత్వము,బద్మజత్వము,జగత్సేవ్య స్థిరానర్గళ**
**త్వవ రూపంబగు కేశవత్వమును ,నీ సద్భక్తి సంవృద్ధిలో**
**లవ మాత్ర స్థితులెన్న,భక్తి జనితోల్లాసావనోద్యత్సుఖా**
**ర్జవ సౌభాగ్యము మాన మెవ్వరికి జెప్పన్వచ్చు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, దేవేంద్ర పదవీ, బ్రహ్మ పదమూ, లోకాలన్నీ సేవించే శాశ్వతమూ, అనర్గళమూ అయిన విష్ణు పదమూ_ ఇవ్వన్నీ నీపై సద్భక్తికి సంబంధించినంత వరకూ అతి చిన్న, లవలేశ మాత్రాలైన పదవులు. స్వామీ! నీ భక్తి వలన కలిగే ఉత్సాహమూ, తృప్తీ, మహా సౌఖ్యమూ, ఋజుత్వమూ, సౌభాగ్యమూ- వీటి పరిమాణపు కొలమానం నిర్వచించడం ఎవరికి సాధ్య మౌతుంది. నీ ప్రభావం అనంతమైనది. ఇంత అని చెప్పడానికి వీలుకానిది. నీ అనుగ్రహం ముందు బ్రహ్మ, విష్ణు, మహేంద్రాది పదవులన్నీ చాలా చిన్నవి. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

98

**మ.పరమార్థంబుగ నా మనంబున భవద్భక్తి ప్రవాహంబు వి**
**స్తరమై పుట్టదు,పుట్టినం బ్రబల దంతం గొంత వర్ధిల్లెనే**
**విరసంబై యట మీద జిక్కువడు,భావింపంగ నెట్లన్న న**
**స్థిరుడం గాన,జడుండ గాన,బకవేషిం గాన సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీపై భక్తిలేని జన్మ ఏం జన్మ! ఎంతో నిష్ఠా, ఏకాగ్రతా చిత్తశుద్ధిగల వాడికిగాని మనస్సులో నీపై భక్తి కలుగదు. నేనూ ఉన్నాను. ఎందుకూ! నా మనసులో నీపై భక్తి పుట్టదు. పుట్టిందా, ఏమాత్రమూ విస్తరించి పెరగదు. ఏదో కొంచెం పెరిగిందా, అది అలాగే శుద్ధంగా ఉండకుండా విరసంగా, వితండంగా, అడ్డదిడ్డంగా ఉంటుంది. ఎందుకంటే నేనో స్థిరత్వం లేని చంచలుడిని. ఒట్టి మొద్దును. కొంగలాగా దొంగ ధ్యానం చేసే కపటిని. వేషగాణ్ణి. మోసగాణ్ణి. నాకెలా నీపై భక్తి అలవడుతుంది. ఈ చపలత్వాన్నీ, చంచలత్వాన్నీ, కపటాన్నీ, జడత్వాన్నీ నాలో నుంచి నిర్మూలంకావించి, నాలో నీపై సద్భక్తిని ప్రభవింప జేయవయ్యా! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

99

**శా.శ్రీకంఠాయ నమోనమో! నతసురజ్యేష్ఠాయ!రుద్రాయ! లిం**
**గాకారాయ !నమోనమో!విగత సారాయ!శాంతాయ!చం**
**ద్రాకల్పాయ!నమో నమో!దురిత సంహారాయతే యంచు ని**
**న్నాకాంక్షం బ్రణుతించు మానవుడు నీపై యుండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,లోకాలను దహించ బోయే హాలాహల విషాన్ని లోకశుభంకరంగా మ్రింగి గొంతులో నిలుపుకున్న స్వామీ! నమస్కారము! ఇంద్రాది దేవతలచే నిత్యమూ పూజింపబడే దేవా! నమస్కారము! రుద్రుడవూ భయంకరుడవూ అయిన స్వామీ! నమస్కారము! లింగాకారంతో వెలుగుతూ లోకాలన్నిటినీ పరిపాలించే మహాదేవా! నమస్కారము! జనన మరణాలూ, సంసారమూ లేనివాడా, జన్మబంధాలనూ సంసార బంధాలనూ తొలగించే పరమాత్మా! నమస్కారము! పరమ శాంతమూర్తి పై జగాలకు శుభాలూ, మంగళాలూ ప్రసాదించే తండ్రీ! నీకు నమస్కారము! చంద్రుణ్ణి ఆభరణంగా కొప్పులో అమరించుకున్న రాజశేఖరా! నీకు నమస్కారము! సర్వ పాపాలనూ నిర్మూలం గావించి భక్తజనాలను బ్రోచే తండ్రీ! నీకు

నమస్కారము! ఇలా ప్రతి నిత్యమూ నిన్ను స్మరిస్తూ, భక్తితో పూజిస్తూ, నీ లీలలను కీర్తిస్తూ ఉండే మానవుడు శివత్వం పొంది అతనే నీవౌతాడు. అందుకు సందేహం లేదు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

100

**మ.భువనోత్పత్తి విధించుచో భవుడవై,పొల్పొందగాదాని ను**

**త్సవలీలం బ్రభవించుచో మృడుడవై,సర్వంబు గల్పాంత భై**

**రవసంక్షోభ నటించుచో హరుడవై,త్రైగుణ్య శక్తిం దుదిన్**

**శివనామాంకము దాల్చు నీ మహిమ దా చిత్రంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,ఈ చరాచర రూపమైన సకల భువనాల సృష్టికీ, స్థితికీ, లయమునకూ నీవే కారకుడవు. బ్రహ్మ అనీ, విష్ణువనీ, ఈశ్వరుడనీ వేరువేరు పేర్లతో, వేరువేరు రూపాలతో నీవే ఈ పనులన్నీ నిర్వహిస్తావు. అసలు నీ పేర్లలోనే అవ్వన్నీ ఉన్నాయి. నీవు భవుడవు. మృడుడవు, హరుడవు. భవము అంటే జన్మ. ప్రాణికోటికి జన్మ నిచ్చి, సృష్టి కార్యాన్ని నిర్వహించే నీవు భవుడవు. మృడుడుఅంటే సుఖములొసగే వాడు, సుఖంగా ఉండే వాడూ. నీవు సృష్టించిన ఈ లోకాలన్నిటినీ సుఖస్థితిలో నీవే ఉంచుతావు. అందుకే నీవు మృడుడవు. ఇక హరుడవూ నీవే. హరుడంటే హరించి వేసేవాడు. అంతా లయం కావించేవాడు. కల్పాంతప్రళయకాల సంక్షోభంలో తాండవనృత్యం

చేస్తూ సర్వాన్నీ లయంచేసి పునస్సృష్టికి అవకాశం కల్పించుకుంటావు. బ్రహ్మపై సృష్టికీ, విష్ణువుపై స్థితికీ, ఈశ్వరుడిపై లయానికీ నీవే కారకుడివి. ఈ మూడుగుణాల శక్తీ కలిగివుండి, మంగళకరుడుగా ప్రవర్తమాన మయ్యే శివుడు అనే పేరూ నీదే! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

101

**మ. కు శైలంబులు పాలు పెల్లగిలి దిక్కూలంబునం గూలినం**
**జలజాత ప్రియ శీతభానులు యథా సంచారము ల్దప్పినం ఛ**
**జలధుల్మేరల నాక్రమించి సముదంచద్భంగి నుప్పొంగినన్**
**దలకం డుబ్బడు చొప్పుదప్పడు భవద్భక్తుండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,ఒకసారి మనస్సులో నీపై గాఢమైన భక్తి నాటుకున్నాక ఇక ఆ భక్తునికి సర్వమూ నీవే! ఈ లోకంలో ఏం జరుగుతుందో అతనికి అనవసరం. అతను పట్టించుకోడు. ఏమి జరిగినా చలించడు. మంచి జరిగినా ఉబ్బిపోడు. తన మార్గమేదో తనదేగా నిన్నే భావిస్తూ ఉంటాడు. కులపర్వతాలన్నీ తమ పాదుల్లోంచి పెల్లగించబడి దిక్కులవతలికి విసరివేయబడ్డా అతను చలించడు. సూర్యచంద్రులు తమ సంచార విధినీ, తమ మార్గాన్నీ తప్పి విపరీతధోరణిలో నడుస్తున్నా అతను ఏ మాత్రమూ కదలడు. సప్తసాగరాలూ తమ చెలియలి కట్టలను అతిక్రమించి ఉప్పొంగి పడుతున్నా అతనేమీ పట్టించుకోడు. నీపై ఏకాగ్రనిష్ఠా, గాఢమైన భక్తీ ఉండి సర్వమూ నీవే అని

హృదయంలో నమ్మే నీ భక్తుడికి ఈ బాహ్య ప్రపంచంలోని ఏ సంఘటనా పట్టించుకోవాల్సినదిగా అనిపించదు. లోకపు పోకడలతో అతనే సంబంధమూ పెట్టుకోడు. అతని సంబంధమంతా నీతోనే! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

102

**శా.శూలస్థాపితుడైన మానవునకుస్ శూలంబు దుర్వార వా**

**త్యాలిం గంపము నొందకుండుట సుఖంబై తోచు మాడ్కిన్ భవా**

**భీల జ్వాలల గ్రాగు మానవునకుస్ బింబాధరల్,హార వ**

**స్త్రాలంకారము లించుకించుక సుఖంబై తోచు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, పూర్వకాలంలో సర్వశక్తిమంతులై తమను అడిగేవారులేని దుర్మార్గులైనరాజులు పాలించే కాలంలో నేరస్తులకువేసే శిక్షలు భయంకరంగా ఉండేవి. దొంగలను కొరత వేసే వారు. కొరత అంటే శూలంతో పొడిచి ఆ కొర్రుతో సహా వ్రేలాడదీసేవారు. వాడలా బాధపడుతూనే ఉండి పోతాడు. కదలకుండా స్థిరంగా ఉన్నప్పుడు నొప్పి తక్కువగా ఉంటుంది. కొంచెం గాలివచ్చి వ్రేలాడే వాడు అటూ ఇటూ ఊగి కదుల్తున్నప్పుడు నొప్పి బాగా ఎక్కువై బాధపెడుతుంది. స్వామీ! భయంకరమైన ఈ సంసారబాధల్లో ఉండే మనిషి కూడా ఆ కొరతవేయబడ్డ మనిషి లాంటి వాడే. కదలిక లేనప్పుడు కొంచెం సుఖంగాఉంది అని వాడు అనుకున్నట్లే

కొద్దిపాటి భోగాలూ, ఇంద్రియ తృప్తి కలిగినవాడు తాను సుఖము నుభవిస్తున్నానని అనుకుంటాడు. నిజానికి తానున్నది జన్మబంధాల బాధల మంటల్లో ననే సంగతి మరచి , ఆ కొద్దిపాటి భోగాలతో లభించే సుఖమే, అంటే కొర్రుతో వ్రేలాడే మనిషికి కదలిక లేనప్పుడున్న సుఖమే అసలు సుఖం అనుకుంటాడు గాని భవసాగరాన్నుంచి విముక్తుణ్ణి గావించి శాశ్వత సుఖాన్నిచ్చే మార్గమైన నీ పాద సమీపాన్ని వెతుక్కోడు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

(శూలస్థాపితుడు= శూలముచే స్థాపించబడిన వాడు, కొర్రుతో పొడవబడినవాడు. ఎంత చక్కని సముచితమైన పోలిక చెప్పాడో చూడండి, కవి)

103

శా.ఆకాశానల చంద్ర సూర్య పవమానా త్మాంబు విశ్వంభరా
ప్రాకామ్యాంచిత మూర్తి భేదముల నీ బ్రహ్మాండ నానాఘటా
నీక ప్రాకట జీవభావ విలస న్నిర్మాణ కర్మాద్భుత
స్తోక శ్రీకరమూర్తివై వెలుగు నీ సూక్ష్మంబు సర్వేశ్వరా!

ఓ పరమేశ్వరా,నీవు భక్తుల మనసులగ్గానీ మాటలగ్గానీ అందని స్థూల, సూక్ష్మ రూపాల్లో ప్రకాశించే జ్యోతిని. సగుణాత్మకమై బాహ్యానికి తోచేది నీ స్థూలరూపం. నిర్గుణాత్మకమై కేవలం భావానుభవానికి అనుభూత మయ్యేది నీ సూక్ష్మరూపం. కండ్లకగ్గానిపించే ఈ చరాచర భువన భాండాలన్నిటిలో అనేకానేక రూపాల్లో వెలుగుతూ ఈ సృష్టిని నిర్మాణం చేస్తావు. ఆకాశమూ, అగ్నీ, చంద్రుడూ, సూర్యుడూ, వాయువూ, ఆత్మా, జలమూ, విశాలమైన ఈ భూమీ ఇవ్వన్నీ నీరూపాలే! వేరువేరు రూపాలతో, పేర్లతో కనిపించే ఇవ్వన్నీ నీ స్థూలరూపపు అంగాలే! ఈ అన్ని రూపాల స్వభావశక్తితో లోకాలను అద్భుత నిర్మాణం కావిస్తావు. నీవు నిర్మించిన ఈ లోకాలన్నీ సుఖస్థితిలో ఉండడానికి నీవే సూర్యుడివై,

చంద్రుడిపై, అగ్నిపై, జలానిపై, వాయువుపై ఈ చరాచరాత్మకమైన లోకాలన్నీ తమ ఉనికిని కొనసాగించడానికీ, తమ మనికి సుఖప్రదం కావడానికీ ఏర్పాట్లు గావిస్తావు. బయటకు కనిపిస్తూ సర్వసృష్టినీ నియంత్రించే ఈ సాధనాలన్నిటి సమాహారమే నీ స్థూల రూపం. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( ఈ పద్యంలో పరమేశ్వరుని స్థూల రూపాన్ని వర్ణించిన అన్నమయ్య,తరువాతి పద్యంలో స్వామి సూక్ష్మ రూపాన్ని గురించి వివరించాడు.)

104

**మ. అతి వాగ్జాలమునై, అజాండనిలయంబై, యాది మధ్యాంత వ**

**ర్జితమై, నిర్గుణ నిష్కలంక పదమై, సిద్ధాంత మధ్యాత్మ సం**

**యుతమై, కోటి రవి ప్రకాశయుతమై, యోంకార మంత్రాది**

**సంస్తుతమై, యెంచ నచింత్యమై వెలుగు నీ సూక్ష్మంబు**

**సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, చంద్ర సూర్యాది వేర్వేరు రూపాల్లో కనిపిస్తూ సగుణాత్మకమై లోకాలను పోషించేది నీ స్థూల రూపమైతే, ఉనికిలో ఉన్న లోకాలకు ఒక ఆత్మనూ, ఆలోచనలనూ, ఒక స్వభావాన్నీ ప్రసాదించేది నీ సూక్ష్మ రూపం. ఈ సృష్టిలోని సర్వశబ్దాత్మకమైన సకలవాక్కులూ, సాహిత్యమూ నీవే. బ్రహ్మాండమంతా ఆవరించి ఉండే కండ్లకకనిపించని మహా శక్తివీ నీవే. దానికి మొదలూ మధ్యా తుదీ అనేవే లేవు. ఒక రూపముఅంటూ నిర్ధారించలేని కళంకంలేని, నిర్మలమైన ఆకృతి అది. అది కోట్లాది సూర్యుల తేజస్సుతో వెలుగుతూ ఉంటుంది. ఆత్మకు మాత్రమే అనుభూతమయ్యే ఆధ్యాత్మిక భావాలతో కూడుకున్నది అది. ఆది ప్రణవ నాదమైన ఓం కారం ఏ మహా

శక్తిని సంస్తుతిస్తూ ఉంటుందో అట్టి దివ్యాకృతి అది. పరమాత్మా! అలాంటిది నీ సూక్ష్మరూపం. అది అచింత్యము. అంటే ఆలోచనలకు కూడా అందనిది. సూర్య చంద్రాది రూపాల్లో కండ్లక్కనిపించే సగుణాత్మకమైన స్థూల రూపంలోనూ, కేవలం హృదయాలకూ భావాలకూ మాత్రమేతోచే నిర్గుణాత్మకమైన సూక్ష్మరూపంలోనూ వెలిగే నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

105

**మ.అజుడై సృష్టి యొనర్చు రాజసముచే,నందంబుగా తా నధో**
**క్షజుడై వర్ధిలజేయు సాత్వికము సంప్రవ్యక్తిగా,గోపతి**
**ధ్వజుడై సంహృతిజేయు దామసమునం,తత్సర్వముం గూడగా**
**నిజ విస్ఫూర్తి వెలుంగు దుర్యమగుచున్ నీ యాజ్ఞ సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీవు త్రిగుణాత్మకుడవు. సాత్వికమూ, రాజసమూ, తామసమూ అనే మూడుగుణాలూ కలిసిన నాలుగో గుణము ( తురీయము) ఐన పరబ్రహ్మమూ నీవే. ఈ సత్వ, రజ, స్తమో గుణాలు మూడూ మూడు వేర్వేరు స్వభావాలకు ప్రతీకలు. సాత్విక గుణము సృష్టికీ, రాజసబుద్ధి స్థితికీ, తామసగుణము సర్వసంహారానికీ కారణభూతమైన వి. ఈ మూడు గుణాలూ కలిసి ఈ బ్రహ్మాండ భాండాల పుట్టువుకూ, మనికికీ, లయానికీ కారణాలు. నీవే బ్రహ్మవై సాత్వికభావంతో లోకాలను సృష్టి గావిస్తావు. నీవే విష్ణువువై రాజసభావంతో సృష్టింపబడిన లోకాలకు సుఖస్థితిని కల్పించి పోషిస్తావు. నీవే ఈశ్వరుడవై తామస గుణంతో సర్వ సంహారం కావిస్తావు. కేవలం నీ ఇచ్ఛయే, నీ ఆజ్ఞయే సత్వ రజ స్తమో గుణాల సమాహారంగా,

త్రిమూర్త్యాత్మకమై, త్రిగుణాల సంపుటియైన నాలుగో (తురీయ) రూపంతో, సృష్టిస్థితిలయాలక్రియలతో పరబ్రహ్మంగా వెలుగుతూ ఉంటుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( అజుడు= బ్రహ్మ. అధోక్షజుడు = విష్ణువు.

గోపతి = వృషభము,

ఎద్దు.గోపతిధ్వజుడు = ఈశ్వరుడు.

సంప్రవ్యక్తి = ప్రకటించబడుట.

సంహృతి = సంహారంకావించు,

నాశనము చేయు విస్ఫూర్తి = తేజస్సు

తుర్యము = తురీయము,నాలుగవది,బ్రహ్మము.)

106

మ.సకలా ధీశ్వర పట్ట భద్రుడవు,భిక్షాగామి,వత్యంత శాం
త కళాత్ముండవు, రౌద్ర మూర్తి, వతి సౌందర్యాంబికా సంగమా
ధిక లోలుండవు, దివ్య యోగివి, మదిం దెల్లంబుగా నెట్టివా
రికి దాశక్యమె నీ నిజంబరసి వర్ణింపంగ సర్వేశ్వరా!

ఓ పరమేశ్వరా, నీ నిజస్వభావం తెలుసుకుని అది ఇలాంటిది అని వివరించి వర్ణించడం ఎవరికి సాధ్య మవుతుంది. సృష్టిలోని పరస్పర విరుద్ధ మైన లక్షణాలన్నీ నీలోనే ఉన్నవి. ద్వంద్వాలుకలిగివున్నాకూడా నీవు ద్వంద్వాలకు అతీతుడవు. సృష్టిలోని సర్వ సౌభాగ్యాలకూ సంపదలకూ విభూతికీ నీవే అధిపతివి. ఐనా యోగిలాగా భిక్షాపాత్ర పట్టుకొని భిక్షకై బయలు దేరుతావు. శమ దమాది గుణాలతో పరమ శాంతమూర్తివి నీవు. అయినా రౌద్ర మూర్తివీ సంహార కారకుడివీ కూడా. ఒకవైపు సృష్టిలోని సర్వ సౌందర్యమూ కుప్పవోసినట్లుండే తల్లి పార్వతీ దేవి సంగతిలో వ్యామోహియైన లోలాత్ముడవు. మరోవైపు సర్వసంగాలనూ పరిత్యజించిన దివ్య యోగివి. ఎవరు చెప్ప గలరు దేవా నీవు విశిష్టుడవో, ముష్టివాడివో, రుద్రుడివో,

కరుణా సముద్రుడవో, యోగివో, భోగివో! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

ఈ పద్యంలో కవి శివుణ్ణి శాంతకళాత్ముండవు అని అన్నాడు. ఆయనకు శాంతము అనేది ఒక కళ అట! కళ అంటే లీలావిలాసంగా స్వీకరించే ఒక ఉత్తమసంస్కారయుత భావము. కేవలం స్వభావంగా మాత్రమే కాక కళగా కూడా శాంతగుణాన్ని స్వీకరించాడు స్వామి. ఇది కవియొక్క అందమైన ఊహ.

107

మ.భవ దుఃఖార్ణవ యానపాత్రము,పరబ్రహ్మంబు,యోగీంద్ర హృ
ద్భవన ప్రస్ఫురిత ప్రదీపము,నఘ ధ్వాంతార్కబింబం బతి
శ్రవణానంద కరంబు,సన్మునిగణ స్వాధ్యాయ పీఠంబు,మీ
శివ నామాంకము భక్త పుంగవ సదా సేవ్యంబు సర్వేశ్వరా!

ఓ పరమేశ్వరా,అత్యంత మంగళదాయకమైన ' శివా' అనే నీ నామము సంసార దుఃఖాల సముద్రాన్ని దాటించే నావ. అది సాక్షాత్తూ పరబ్రహ్మము.మహర్షులూ యోగులూ అందరి హృదయాలనే భవనాల్లో నిరంతరమూ వెలిగే దీపం. పాపాలనే చీకట్లను పోద్రోలే సూర్యబింబం. శివా, శివా అనే నీ నామము చెవులకు వినిపిస్తుంటే కలిగే ఆనంద పారవశ్యం చెప్పజాలనిది. మునులందరూ వల్లెవేసే వేదాధ్యయన పాఠాలసారమంతా అదే! దాన్నే భక్తులందరూ ఎప్పుడూ స్మరణ జేస్తూ పరవశించి పోతుంటారు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( దుఃఖార్ణవము= కష్టాల సముద్రము.యానపాత్రము= నావ.అఘుధ్వాంతము= పాపాల చీకటి. అర్కబింబము= సూర్యబింబము)

108

మ. అణిమా దృష్ట గుణ ప్రసిద్ధులు, త్రిలోకారాధ్యులు, ద్యద్వచో
మణి కోటి ప్రతిమా ప్రభా పటలు,లున్మాదేంద్రియ ధ్వాంత భీ
షణ దైత్యేంద్ర వినాశ కారణ మహా శౌర్యోన్నతుల్, లోక ర
క్షణ దక్షుల్ వినుతింప నీ ప్రమథ సంఘాతంబు సర్వేశ్వరా!

ఓ పరమేశ్వరా, నీ పరివారంలో ప్రమథులు ముఖ్యమైన వారు.ఈ ప్రమథ గణాలు నీ ఆజ్ఞలను లోకంలో ప్రవర్తింప జేస్తూ ఉంటారు. వారేమి సామాన్యులా! అణిమాది అష్టశక్తులనూ సాధించినవారు. ముల్లోకాల జనులందరిచేతా పూజలందుకునే వారు. వేదాది సర్వవాంగ్మయాన్నీ ఎరిగి ఆ విజ్ఞానంతో కోట్లాది మాణిక్యకాంతులతో ప్రకాశిస్తూ ఉండేవారు. చపలములైన ఇంద్రియములు కల్పించే చీకటి అనే రాక్షసులను నాశనం చేసే శౌర్యం కలిగిన వారు. అంటే ఇంద్రియ వ్యామోహాన్ని దరికి చేరనీయని వారు. నీ ఆజ్ఞతో ఈ లోకాలన్నిటినీ రక్షించే పనిలో నేర్పరులైన వారు. ఇట్టి సర్వశక్తిమంతులైన ప్రమథ గణ పరివారంతో నీవు లోకరక్షణా లోకపాలనా చేస్తూ ఉంటావు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( అష్టసిద్ధులు అనేవి ఎనిమిది ఐశ్వర్యాలు.ఆ ఎనిమిది ఐశ్వర్యాలనూ సిద్ధింపజేసుకున్న వారు మహా శక్తి వంతులు.అవి అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము అనేవి.) సంఘాతము= సమూహము.)

109

**మ.సకలాధీశ్వరులై,గణాధిపతులై,సర్వజ్ఞులై,నిత్యులై**
**యకలంకాత్మకులై,మహామహిములై,యంభోజగర్భాండర**
**క్షకులై,యుండుదు రెల్లవారును భవత్సద్భక్తి నానాగుణా**
**ధిక లీలా విధి నంతరంగముల వర్తింపంగ సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,నీపై భక్తి సర్వశక్తులూ ప్రసాదిస్తుంది. ఎవరైనా సరే, ఇతర సద్గుణాలన్నిటికంటే గొప్పగుణమైన భక్తి గుణాన్ని కలిగి ఉండి దాన్ని నిశ్చలంగా, నిర్మలంగా తమ అంతరంగాల్లో నింపుకుంటే వారికి అనంతమైన అధికారం ప్రాప్తిస్తుంది. వారు సకలాధీశ్వరులౌతారు. అంటే అన్నిటిమీదా ఆధిపత్యం సంపాదిస్తారు. వారు నీ గణాల్లో ఒకడై క్రమంగా గణాధిపత్యం సాధించుకుంటారు. వారు సర్వజ్ఞులౌతారు. అంటే అన్ని విషయాలూ తెలిసినవారౌతారు. నిన్ను పూర్తిగా తెలుసు కుంటే సర్వమూ తెలిసినట్లేగదా. వారు శాశ్వతులౌతారు. వారికి ఏ మాత్రమూ కల్మషమంటదు. గొప్ప మహిమలను సాధిస్తారు. తమ శక్తులతో ఈ లోకాలను కాపాడగల వారౌతారు. ఈ శక్తులన్నిటికీ నీ పాదాలమీద అచంచలమైన భక్తియే

మూలం. నీ భక్తి చేయజాలనిదేమీ లేదు. నా తండ్రీ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

110

**మ. అమరేంద్రాబ్జభవాచ్యుతాదులకు నీ యాజ్ఞా ప్రభావం బలం**
**ఘ్యము,నీకుస్ భవదీయ భక్త మహదాజ్ఞాపంబు నుద్యత్ప్రభా**
**వము లోకంబులలో నలంఘ్య మగుట న్వర్ణింపగా,నీ మహ**
**త్వముకంటెం గడుజెల్లు భక్తుల మహత్వం బెన్న సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, ఇంద్రుడూ, బ్రహ్మ, విష్ణువూ, ఇతర దేవతలూ వీరందరికీ నీ ఆజ్ఞ దాటరానిది. నీ ఆదేశం అనుసరించే వాళ్ళంతా తమ తమ విధులు నిర్వర్తిస్తుంటారు. అంత గొప్పవారూ నీ ఆజ్ఞానువర్తులైతే నీవేమో నీ భక్తుల ఆజ్ఞలను పాలిస్తుంటావు. శివభక్తులయొక్క ప్రభావం సర్వలోకాలలోనూ దాట వీలులేనట్టిది. దీన్ని బట్టి చూస్తే నీ గొప్పదనం కంటే నీ భక్తుల మహత్వమే గొప్పదనిపించడం లేదూ! బ్రహ్మేంద్రాది దేవతలకంటే కూడా నీ భక్తులే గొప్పవారు. నీపై భక్తిని అంతరంగంలో నింపుకొని నిండు మనసుతో నిన్నే స్మరిస్తూ, సేవిస్తూ, పూజిస్తూ ఉండే భక్తులకు అంత గొప్ప ప్రభావాన్ని నీవు ప్రసాదిస్తావన్న మాట! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( అబ్జభవుడు = బ్రహ్మ,మహదాజ్ఞాపంబు = గొప్ప ఆదేశము, ఆజ్ఞ. అలంఘ్యము = దాట రానిది.)

111

**మ.శివసాహిత్యుల సత్కరస్థలము కాశీ క్షేత్రమా హస్తదే**
**శవిశాలోన్నత శాఖ లారయగ పంచక్రోశమా పాణిసం**
**భవ శోభాన్విత చిత్రరేఖలు మహా భాగీరథీ తీర్థముల్**
**శివలింగం బల విశ్వనాథు డరయస్ సిద్ధంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,శివసాహిత్యులు అంటే శివుని గురించిన జ్ఞానము కలిగి ఆయన కథలూ గాథలూ చదువుతూ, మననం చేస్తూ, నిరంతరమూ ఆయనను పూజిస్తూ ఉండే భక్తులు. వీరి హస్తము, అది ఎప్పుడూ శివపూజ గావిస్తూ ఉంటుంది గాబట్టి, సాధారణమైన చేయి కాదు.ఆ కరతలము సాక్షాత్తూ కాశీక్షేత్రమే. శాఖలవంటి వ్రేళ్ళతో కూడిన ఆ చేయి యొక్క విస్తారము పంచ క్రోశం అంతది. కాశీక్షేత్రం ఐదు క్రోసుల వైశాల్యం కలిగింది కాబట్టి కాశీకి పంచక్రోశమనే పేరుంది. ఇక ఆ చేతిలో కనిపించే రకరకాల రేఖలన్నీ గంగా తీర్థాలే! ఆ చేతితో పూజించేబడే శివలింగం, అది ఏ ప్రాంతంలోనిదైనా కాశీక్షేత్ర మహాదైవతమైన విశ్వనాధుడే! శివ భక్తుడు సాక్షాత్తూ శివుడే కాబట్టి భక్తుని కరతలం కాశీ క్షేత్రం

కావడంలో ఆశ్చర్యమే ముంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

112

**మ. వరుసం బైకొనివచ్చు కర్మములు మున్వారించి, మాయామల**
**జ్వరముల్గూల్చి,యపార ఘోరతర సంసారాబ్ధి లంఘించి భీ**
**కర సూక్ష్మాంగ విచిత్ర కంచుకము వీకంబుచ్చి పోపైచి,తా**
**బరమ వ్యోమము జొచ్చు నీ యచల సద్భక్తుండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, పరమాత్మవైన నీ సన్నిధికి చేరడమే ప్రతిజీవి ఆరాటమూ. దేనికీ చలించని నీ సద్భక్తుడే దానిని సులభంగా సాధించగలడు. జన్మజన్మలనుండీ సంచితంగా వచ్చిన కర్మలన్నిటినీ తొలిగించివేస్తుంది నీ భక్తి.మాయతో కూడిన మహాపాపాల రుగ్మతలను పోగొడుతుంది. దాటడానికి శక్యంగాని ఈ భయంకరమైన సంసారము అనే సముద్రాన్ని సులభంగా తరింప జేస్తుంది. నీ సద్భక్తుడైనవాడు తనకర్మాలను తొలగించుకొని, పాపాలను వదిలించుకొని, సంసార సముద్రాన్ని దాటి, చివరకు వస్త్రపు తొడుగులాంటి ఈ శరీరాన్ని వదిలేసి ఆకాశమార్గాన నీ సన్నిధికి చేరుకుంటాడు. నీభక్తియే మోక్షానికి కారణం. శివభక్తుడు కానివాడు అది సాధించలేడు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( కంచుకము = వస్త్రపు తొడుగు,వ్యోమము = ఆకాశము.

అచల =. దేనికీ చలించని ది)

113

**మ. పరమార్థంబగు తత్వమార్గమున నీ పాదాబ్జ సద్భక్తు డొ**
**క్కరుడుందప్ప సరోజజాద్యమర సంఘాతంబులో నెల్ల దా**
**నెరయం గాచి కొనంగ జాలరు, మహానిర్భీతుడుస్ లేడతి**
**స్ఫురణం గాలుడు తన్ను వేచి వడి గొంపోనుండ సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, పుట్టిన ప్రతిజీవీ గిట్టవలసిందేకదా. యమధర్మరాజు తన పాశంతో బంధించి ప్రతివాడినీ మరణం పాలుకావిస్తుంటాడు. ఇదెవరూ తప్పించుకోలేరు. కానీ నీ సద్భక్తుడొక్కడే తత్వమార్గంలో_ అంటే నిన్ను గురించిన పరిపూర్ణ జ్ఞానం కలిగి_ ఏ మాత్రం భీతి లేకుండా మరణాన్ని ఎదుర్కొని అది నిన్ను చేరే దారి మాత్రమే అని భావించి నీ పాదాల సన్నిధికి చేరుకుంటాడు. నీ సద్భక్తునికి ఉండే ఈ నిర్భీతీ, మృత్యువును ఎదుర్కోగల సామర్థ్యమూ బ్రహ్మాది దేవతలకు కూడా లేదు. నీవు కాలాంతకుడవు. కాలునే అంతం చేసిన వాడివి. నీ భక్తులు నీరూపులే కదా. వారికి కాలుని భయమే ఉండదు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ అపాదాలకు మ్రొక్కులు!

(సరోజజాది= బ్రహ్మాది .అమర సంఘాతము= దేవతల సమూహము)

114

**మ. తనచారిత్రమె సన్నుతించు గురు భక్త శ్రేణి వర్ణింప గా**

**తనచిత్తంబు భవత్పదస్మరణ చేతన్నిన్ను మెప్పింపగా**

**ననుకూలస్ఫుట నిశ్చలత్వమున రా నభ్యంతరాంగస్థితి**

**న్వినుతింబొందిన తజ్ఞుడీ జగములో నీ మెచ్చు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, తజ్ఞుడు అంటే దానిని తెలిసినవాడు. అది అంటే పరమాత్మ. పరమాత్మ తత్వాన్ని పూర్తిగా తెలిసిన వివేకి తన మనస్సులో సదా నీ పాదపద్మ స్మరణ చేస్తుంటాడు. అనుకూలంగా, నిశ్చలంగా, స్పష్టంగా తన అంతరింద్రియ ములను వశం చేసుకుని, అరిషడ్వర్గాలను జయించి నీ స్మరణ చేస్తూ నిన్ను మెప్పిస్తుంటాడు. అటువంటి వివేకి యొక్క నడవడిని గురువులూ భక్తులూ పలుమార్లు పొగడుతుంటారు అలాంటి సద్వినుతిని పొందే భక్తుని నీవు కూడా మెచ్చుకుంటావు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

115

**మ. క్షితి నత్యుగ్ర తపంబు నందు జఠరాగ్నిం గాలగానేల,మి**
**మ్మతి భక్త స్థితి పూజసేయు మహనీయత్వంబు తా జాలదే**
**ప్రతిపక్షాలి నడంప, రోగభయ దుర్భారంబు వారింప ,న**
**ద్భుత సౌఖ్యంబులు బెంప, దివ్యసుఖముం బొందింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,అతిభక్త స్థితితో అంటే ఏకాగ్రనిష్ఠ గల మనసుతో, మదినిండా నిన్నే నింపుకొని నిన్ను పూజించే మహద్భాగ్యం శివద్రోహులను నిర్జించే శక్తినిస్తుంది. రోగాలనూ, భయాలనూ వాటికి సంబంధించిన సర్వ చింతలనూ పోగొడు తుంది. అద్భుతమైన సుఖశాంతులను కలిగించడమే గాక వాటిని పెంపు జేస్తుంది. దివ్యసుఖాలను అంటే పారలౌకిక మైన దైవత్వాది సుఖాలనూ ప్రసాదిస్తుంది. నిష్ఠతో నిన్ను హృదయం నిండా నింపుకొని సేవిస్తే ఇవన్నీ లభిస్తాయి. కడుపు కాల బెట్టుకుంటూ, ముక్కు మూసుకుని అడవిలో తపస్సు చేయడం అనవసరం. కష్టమైన బాహ్యాచరణలు అక్కర్లేదు. భక్తి ఉంటే చాలు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

116

**మ. శివ వాక్య స్ఫురితాక్షరద్వయ సక్య జ్జిహ్వా ప్రదేశాత్ముడై**

**భవ దుఃఖాంబుధి దాటజూచు తఱి దత్పంచాక్షరీ మంత్రము**

**త్సవ లీలం గడు శుద్ధుడై జపము వాంఛం జేయు భాస్వద్గుణా**

**ర్ణవ సౌభాగ్యము మానమెవ్వరికి గానన్వచ్చు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా! ఈ జన్మా, ఈ సంసారమూ దుఃఖభూయిష్టమైన మహాసముద్రం లాంటివి. ప్రతివాడూ ఈ సముద్రాన్ని తరించలేక లౌకిక వ్యవహారాలలో తలమునకలౌతూ బాధలనూ దుఃఖాలనూ అనుభవిస్తూనే ఉంటాడు. ఎవరి జిహ్వా మీద ' శివ' అనే రెండక్షరాలూ కలిగిన 'నమశ్శివాయ' అనే పంచాక్షరీ మంత్రం ఎల్లప్పుడూ ఉంటుందో, ఎవడు పరిశుద్ధుడై మహోత్సాహంతో, ఇష్టంగా ఆ మహా పంచాక్షరి మంత్రాన్ని జపం చేస్తూ ఉంటాడో అతడు సుకరంగా ఈ సంసార సముద్రాన్ని దాటగలడు. అలాంటివారి సౌభాగ్యమూ, వారి అభిమానమూ చాలా గొప్పవి. శివభక్తి హీనులకు దొరకనివి. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

117

**శా. ఏదేశంబున,నేదిశాముఖమునం, దేయూర,నేవాడ మీ**
**పాదాభ్యర్చన సేయు నిర్మలుడు సద్భక్తుండొకండుండె, నా యా**
**దేశంబును,నాదిశాముఖమును,న్నాయూరు,నావాడ గం**
**గాది స్నాన నదీ ప్రవాహ ఫలదంబైయొప్పు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీ భక్తుడెక్కడుంటాడో ఆ ప్రదేశం పుణ్యతీర్థంలాంటిది. ఏదిక్కులో, ఏదేశంలో, ఏఊరిలో, ఏవాడలో నీ పాదపద్మాలను నిరంతరమూ భక్తితో కొలిచే నిర్మలుడైన పుణ్యాత్ముడూ సద్భక్తుడూ ఉంటాడో, ఆదిక్కూ, ఆదేశమూ, ఆఊరూ, ఆవాడా, పవిత్ర గంగానదిలో స్నానం చేస్తే వచ్చే మహాఫలితాన్ని ఇచ్చే తీర్థం లాంటివి. శివాలయంలేని ఊరు ఊరూ కాదు. శివభక్తుడులేనివాడ వాడాకాదు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

118

**మ. ఒనరం జిత్తము శుద్ధి లేని నరుడుద్యోగంబునం గోరి చే**
**సిన పూజా విభవంబు సువ్రతములుస్ శీలంబులుస్ మంత్రసా**
**ధనముల్ తీర్థములుం దపంబులును మీదం జెట్టవా డభ్యసిం**
**చిన శస్త్రాస్త్ర కళా నిభంబులగు జర్చింపంగ సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా ,సద్బుద్ధి కలిగిన వ్యక్తి తన శక్తితో శస్త్రాలూ అస్త్రాలూ సంపాదించి వాటిని ప్రయోగించే విద్యలో మంచి ప్రావీణ్యం సంపాదించాడంటే దానివల్ల అతనికేకాక లోకానికీ మంచి ప్రయోజనముంటుంది. ఎందుకంటే అతడు మంచివాడు కాబట్టి తన విద్యలను మంచి పనులకే అంటే దుష్టులను ఎదిరించడానికీ, మంచివారిని రక్షించడానికీ మాత్రమే ఉపయోగిస్తాడు కనుక. మరి అలాంటి విద్యలూ సాధనాలూ ఒక ధూర్తుని చేతుల్లో ఉంటే ఎంతో ప్రమాదం. వాడు అధర్మానికి ప్రోద్బలంగానే వాటిని వాడుతాడు. దానివల్ల లోకానికి హాని కలుగుతుంది. అలాగే చిత్తశుద్ధిలేని శివపూజలు కూడా. నిష్ఠలేకుండా, నీపై ఏకాగ్రమైన బుద్ధి లేకుండా మనస్సు నిర్మలంగా ఉంచుకోకుండా చేసే పూజలూ, వ్రతాలూ, జప

తపాలూ, తీర్థయాత్రలూ, మంత్రతంత్రాలూ ఇవన్నీ దుష్టుని చేతుల్లోని విద్యలలాంటివి. లోకానికి అపకారం చేకూర్చేవి. ఏ మాత్రం ప్రయోజనం లేనివి. చిత్తశుద్ధిగల శివభక్తునికి లోకం సుఖంగా ఉండాలనే చింత ఉంటుంది. అతనుచేసేపూజాదికాలు ఆ ఆదర్శానికి ప్రోత్సాహకాలు గానే ఉంటాయి. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

119

**మ. క్రమసంయుక్తి మనంబు బుద్ధియు నహంకారంబు జిత్తంబు**
**నా**
**యమలాంతఃకరణంబు నక్షర చతుష్కావాప్తి గావించి పం**
**చమ వర్ణంబుగ నాత్మగూర్చి కడు వాంఛన్ యోగి పంచాక్షరీ**
**సుమహా మంత్రము తోడ నైక్య పదవిన్ శోభిల్లు సర్వేశ్వరా!**

ఆదిశంకర భగవత్పాదులు సృష్టించిన మహా వాంగ్మయంలో నిర్వాణషట్కం అనే ఆరు శ్లోకాల స్తుతి ఒకటి ఉన్నది. దానిలోని తొలిశ్లోకం " మనో బుద్ధ్యహంకార చిత్తా నినాహం, నచ శ్రోత్ర జిహ్వే నచ ఘ్రాణ నేత్రం, నచ వ్యోమ భూమిర్, న తేజో న వాయుః, చిదానంద రూప, శివోహం శివోహం " అనేది. పరమజ్ఞానంకలిగిన భక్తుడు తాను సాక్షాత్తూ శివుడే అని తెలుసుకుంటాడు. శివోహం అంటే నేను శివుడను అని. మనస్సు( mind) బుద్ధి ( intellect) అహంకారము( ego) చిత్తము (inner self) ఇవ్వేవీ నేను కాను. భూమీ, గాలీ, నీరూ, నిప్పూ, రోదసీ_అనే పంచభూతాలూ నేనుకాను. వీటి తన్మాత్రలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలుగానీ, వీటి బాహ్య

రూపాలైన పంచేంద్రియాలు అనగా కండ్లూ, ముక్కూ, చెవులూ, నాలుకా, చర్మమూ_ ఇవేవీ నేను కాను. నేను వీటన్నింటికీ అతీతమైన వాడిని. నేను శివుడను, నేను శివుడను! అని దీని అర్థం. పై పద్యంలో అన్నమయ్య మహాశివ మంత్రమైన పంచాక్షరీ మంత్రంలోని ఐదు అక్షరాలతో పైవాటినన్నిటినీ అనుసంధానంచేసి శివతత్వాన్ని రూపిస్తున్నాడు. క్రమంగా మనస్సు, బుద్ధి, అహంకారము, చిత్తము _ అనే నాలుగింటినీ శుద్ధమైన అంతఃకరణంతో నాలుగు మంత్రాక్షరాలుగా భావించి ఐదో అక్షరంగా ఆత్మను (హృదయాన్ని) జోడిస్తే అది పరమ పావనమైన పంచాక్షరీ మంత్ర మౌతుంది. పరమ యోగులు పంచాక్షరీ మహా మంత్రం ద్వారా మనో బుద్ధి అహంకార చిత్త ఆత్మలకు అతీతమైనటువంటి సారూప్యమును అంటే నీతోటి ఐక్యము అనే పదవిని సాధించి తామే శివులౌతారు. శివోహం, శివోహం అనే మహర్దశకు చేరుకుంటారు! నా తండ్రీ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

120

**మ.భవదీయానన పంచకంబు వలనం బంచాక్షరీ మంత్రము**
**ద్భవమై,తత్పద వర్ణ పద్ధతుల శుంభ త్పంచభూతంబు లు**
**ద్భవనంబై యఖిలంబు బుట్టెను,లసత్పంచాక్షరీ మంత్రమీ**
**భువనాండంబుల తల్లియై సఫలతం బొందించు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,నీవు ఐదు ముఖాలు కలవాడవు.ఆ ఐదు ముఖాలూ సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశాన అనేవి. ఆ ఐదు ముఖాల్లోంచీ పంచాక్షరీ మంత్రం ఉద్భవించింది. ఆ మంత్రంలోని ఐదు అక్షరాలలోనుంచి పంచ భూతాలు, అనగా భూమి, ఆపస్సు, తేజస్సు, వాయువు, ఆకాశమూ అనే ఐదుభూతాలూ ఉద్భవించినవి. పంచ భూతాత్మకమైన ఈ సకల బ్రహ్మాండ భాండాలకూ ఈ పంచాక్షరీ మంత్రమే జనని. ఈ మహా మంత్రమే తల్లిలాగా లోకాలన్నిటికీ సఫలతను ప్రసాదిస్తుంది. సృష్టి స్థితి లయకారకుడవూ, పంచముఖుడవూ, పంచభూతాతీతుడవూ, పంచాక్షరీ మహా మంత్రమునకు మూలకందమవూ ఐన నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

121

**మ.పటు శాస్త్రాగమ దృష్టి నిర్విధమునన్ భావించి,వీక్షించి యు**
**ద్భట వృత్తిన్ భవదీయ భక్తి నికర బ్రహ్మాండకుండైన నా**
**దట లో గాచుకొనంగవచ్చు విదితోద్దండ ప్రతాపోత్కట**
**స్ఫుట కోపానలమూర్తియై యముడు గొంపోకుండ సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,పుట్టిన ప్రతి జీవికీ మృత్యువు తప్పదు గదా. ఎవ్వరూ దానినుంచి తప్పించుకోలేరు. యముడు ఎవరినీ వదిలడు. యముని పరాక్రమం ప్రచండమైనది. విదితమైనది. అంటే అందరికీ తెలిసిందే. అతిశయమైనది. స్పష్టమైనది. దానిని గురించి ఎవరికీ ఏసందేహాలూ లేనట్టిది. అటువంటి భీషణ పరాక్రమంతో మహాగ్నిలాగా మండిపోయే రూపం ఆయనది. ఆయననుండి తప్పించుకోవడం ఎవరికీ సాధ్యంకాదు. అయితే సకల శాస్త్రాలనూ,వేదాలూతెలుసుకొని, భావగతం కావించుకుని వాటిలో చెప్పిన విధంగా నీ మీద తిరుగులేని భక్తితో, నిష్ఠతో నిన్నాశ్రయించినవాడు ఆ యముని బారిని పడకుండా కాచు కోగలడు. నీవు అంతకాంతకుడవు. అంతకుడు అంటే

యముడు. యమునికే యముడవు నీవు. శివభక్తుడు సాక్షాత్తూ శివుడే. కాబట్టి శివుని లక్షణాలన్నీ శివభక్తునికీ ఉంటాయి. అయితే నిక్కమైన శివభక్తుడు కావాలంటే పైన చెప్పిన విధంగా వేదశాస్త్రాదులను అవగతం కావించుకొని అందులో చెప్పిన విధంగా అత్యంతనిష్ఠతో శివుని సేవించి పూజించాల్సిందే. (నిన్ను ఆశ్రయించి నీ పరమభక్తుడైన మార్కండేయుడు యముని జయించాడు కాదా) నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( పటు శాస్త్రాగమ= గొప్పవైన శాస్త్రాలూ వేదాలూ. ఉద్భట వృత్తి= తీవ్రమైన పూనిక. విదిత= తెలిసిన. ఉద్దండ= ప్రచండమైన. ప్రతాప= శౌర్యము యొక్క. ఉత్కట= అతిశయము. స్ఫుట=స్పష్టమైన.కోపానలము= కోపమనే అగ్ని. మూర్తి= రూపము)

122

మ.కలవారై,మతిమంతులై,రసికులై,గంభీరులై,ధీరులై
లలనా మన్మధులై, సముజ్వలవచోలాలిత్యులై, నిత్యులై
బలవిభ్రాజితులై, యశోభరితులై భాసిల్లు భాగ్యోదయుల్
తొలిజన్మంబులమిమ్ముగొల్చిన మహాత్ముల్ వారు సర్వేశ్వరా!

ఓ పరమేశ్వరా, నిన్ను పూజించే వారికి నీవు సర్వమూ అనుగ్రహిస్తావు. జన్మలు మారినా కూడా శివపూజా ఫలితమైన అనుగ్రహం లభిస్తూనే ఉంటుంది. ఈ జన్మలో భాగ్యవంతులై, మేధావంతులై, రసికత కలిగినవారై, గంభీరమైనవారై, శౌర్య పరాక్రమాలు కలిగినవారై, స్త్రీలను ఆకర్షించేలా మనోహర రూపము కలిగిన వారై, అద్భుతమైన వాక్చతురత్వము కలిగిన వారై, శాశ్వతులై, గొప్ప బలసంపద గలిగిన వారై, గొప్ప కీర్తిని సాధించినవారై_ ఉన్నారంటే వారు వారి గతజన్మల్లో. నిన్ను నిష్ఠగా, భక్తితో పూజించి సేవించిన వారై ఉంటారు. శివపూజ సకలైశ్వర్యాలనూ ప్రసాదిస్తుంది.కల్పం మారినా కర్మ మారదు. జన్మలు మారినా శివపూజా ఫలితం లభించకుండా ఉండదు.

సర్వ సౌభాగ్యాలకూ కారణం నీ పూజ. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

123

**మ.ఖలులై,యాచకులై,విరుద్ధ వికటాకారాంగులై,పంగులై,**
**బలహీనాతురులై,రుజాపటల తాప చ్ఛన్నులై,ఖిన్నులై**
**చలనాందోళిత చిత్తులై,మలినులై,జాత్యంధులై,మందులై**
**తొలిజన్మమ్మున మిమ్ముగొల్వని దురాత్ముల్ వారు సర్వేశ్వరా!**

కవి పై పద్యంలో(122) గతజన్మల్లో శివపూజ చేసినవారికి లభించే సౌఖ్యాల గురించి చెప్పాడు. ఈ పద్యంలో గతజన్మల్లో శివపూజ అనేదే ఎరుగని పాషండులకు లభించే ఫలితమెట్టిదో వివరిస్తున్నాడు. అలాంటివారు దుర్మార్గులు గానూ, అడుక్కుతినేవారిగానూ, విపరీతమూ వికారమూ ఐన ఆకారం గలవారిగానూ, కుంటివారుగానూ ,బలహీనులుగానూ ఆతురమైన బుద్ధి గలవారిగానూ, అంటే ఎప్పుడూ ఏదో ఒక చింతతో బాధపడేవారిగానూ, రకరకాల రోగాలతో బాధపడేవారి గానూ, ఎప్పుడూ విచారంతో ఉండేవారిగానూ, నిత్యమూ చలిస్తూ ఆందోళనతోఉండే మనస్సుగలవారిగానూ, మాలిన్యం గలవారిగానూ, పుట్టుగ్రుడ్డివారిగానూ, మూర్ఖులుగానూ పుడతారు. ఈ జన్మలో ఇలా బాధలతో రోగాలతో దురదృష్టంతో

ఉన్నారూ అంటే గతజన్మల్లో శివపూజ అనేదే చేయలేదన్న మాట. ఓ పరమేశ్వరా! నిన్ను పూజించేవారికి సర్వ సౌభాగ్యాలూ ఇస్తావు. నిన్ను నిరాకరించేవాడిని సర్వభ్రష్టుణ్ణి కావిస్తావు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

124

**శా.ఏయే వేళల,నేవయస్సున నరుండే భూమి నేయూరిలో**

**నేయే కర్మము నాచరించు నశుభంబేని న్శుభంబేని దా**

**నాయావేళల నావయస్సున నరుండా భూమి నాయూరిలో**

**నాయా కర్మములెల్ల దా గుడుచు తథ్యంబింత సర్వేశ్వరా!**

అత్యుత్కటై పుణ్యపాపై ఇహమేవ ఫలముచ్యతే అని ఒక సూక్తి ఉంది. అంటే అతి మిక్కుటంగా పుణ్యం గానీ పాపంగానీ చేస్తే పైజన్మలదాకా అక్కర్లేదు, ఈ జన్మలోనే, ఈ ఇహ లోకంలోనే ఫలితం అనుభవించి తీరుతాడు అని దాని అర్థం. అన్నమయ్య_ మిక్కుటమే గాదు నీవు ఎలాంటి కర్మ ఏ మోతాదులో చేసినా దానికి అనుగుణమైన ఫలితం నుంచి తప్పించుకో లేవు అంటున్నాడు. ఏవేళలో, ఏవయసులో, ఏఊళ్ళో మనిషి మంచిపనిగానీ చెడ్డపనిగానీ చేస్తాడో ఆఊళ్ళోనే, ఆప్రాయంలోనే, ఆభూమిలోనే, ఆసమయంలోనే ఆయా కర్మలకు అనుగుణమైన ఫలితాన్ని అనుభవించి తీరుతాడు. దానిని తప్పించుకోలేడు. ఇది తథ్యం. ఏదేశంలో, ఏఊరిలో, ఏ వయస్సులో అని ప్రత్యేకంగా చెప్పడానికి కారణం

లేకపోలేదు. యువకుడు తన వయస్సుకు తగినట్లే నడుచుకోవాలి. వృద్ధుడు తన వయస్సుకు తగినట్లుగా పెద్దరికంగా ప్రవర్తించాలిగాని యువకుడిలాగా వేషాలు వేయకూడదు. తర్వాత ఏఊరిలో అంటే ప్రతి ప్రదేశానికీ స్థల ప్రాధాన్యత ఉంటుంది. కాశీకి పోయి అక్కడ తప్పుడు పనులు చేస్తే ఆ పాపఫలం ఇంకా ఎక్కువగా అనుభవించక తప్పదు. అంటే ఇతరచోట్ల చేయవచ్చని కాదు. ఏయే వేళల అన్నాడు. ఉదయం చేయాల్సినపనులు ఉదయమూ రాత్రి చేయాల్సినవి రాత్రీ మాత్రమే చేయాలి. జీవితం ఒక క్రమపద్ధతిలో కాలానుగుణంగా, స్థలానుగుణంగా, వయోనుగుణంగా సాగాలి. అలాకాకుండా ప్రవర్తిస్తే తగిన ఫలితం ఉండి తీరుతుంది.నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

125

**శా.ఆడంబోయినచోట బాలురు వినోదార్థంబు పాషాణముల్**
**గూడం బెట్టి శివాలయంబనుచు పేర్కొన్నంతటం జేసి వా**
**రాడంబోయి సురాంగనా కలిత దివ్యారామ చింతామణి**
**క్రీడాశైల విహారులౌదురుమిముం గీర్తింప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, చిన్నపిల్లలు వారి వయస్సుకు తగినట్లు నలుగురైదుగురు కలిసి ఆడుకుంటుంటారు. ఏవో మామూలు ఆటలు కాకుండా నాలుగు రాళ్ళు పెట్టి ఇది శివాలయమనీ, లోపల మరో గుండ్రటి రాయి పెట్టి ఇది శివలింగమనీ అంటూ వారి ధోరణిలో వారు పూజలూ ఊరేగింపులూ చేస్తూ ఉంటారు. వారు పసివారైనా తెలిసీ తెలియక చేస్తున్నా ఆ శివాలయనిర్మాణమూ ఆ పూజా వృధాగా పోదు. వారు ఆడంబోయినప్పుడు, అంటే అక్కడికి పోయినప్పుడు, అక్కడికి అంటే మరణానంతరం పరలోకం పోయినప్పుడు, స్వర్గారామంలో దేవతా స్త్రీలతో కలిసి చింతామణీ రత్నమూ అవీ ఉండే చోట, క్రీడా పర్వతాల మీద విహరిస్తూ మిమ్ములను సేవించే అదృష్టం పొందుతారు.

అందుకని పిల్లలకు శివభక్తిని పసితనం నుంచే అలవాటు చేయాలి.పెద్దయ్యాక వారు అదే దారిలో సాగుతారు. శివభక్తులౌతారు. తమపూజలకు తగిన ఫలితం పొందుతారు. శివుని గూర్చి చేసిన ఏ కార్యమూ పిల్లలు చేసినా పెద్దలు చేసినా అది వృధా కాదు.దాని ఫలితం తప్పక ఉంటుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

126

**మ.సమయోద్దిష్ట సహస్ర పంకరుహ పూజా పూరణార్థంబు నే**
**త్రము విష్ణుండు సుభక్తి యేర్పడ భవత్పాదంబు లర్చించి చ**
**క్రము దా గైకొని దైత్యకోటి ననిలో ఖండించె దా నీ పద**
**క్షమతా సేవ సమస్త దేవతలకుస్ సత్త్వంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, విష్ణుమూర్తికి ఒక సందర్భంలో రాక్షసులను చంపడం చాలా కష్టమైంది. తగిన ఆయుధం కావలసివచ్చింది. నిన్ను గూర్చి ఘోరమైన తపస్సు చేశాడు. వేయి తామరలతో నిన్ను పూజించాలని నియమం పెట్టుకొని పూజ ప్రారంభించాడు. ఒక పూవు తక్కువయింది. అప్పుడు తన నేత్రాన్ని పెకలించి దానితో పూజించడానికి సంకల్పించి కన్ను పెరుక్కో బోయాడు. దయామయా! నీవు సాక్షాత్కరించి విష్ణువుకు సుదర్శన చక్రాన్ని ప్రసాదించావు. దానితో విష్ణుమూర్తికి అసురులను విధించడం సులువైంది. నీ పదసేవా, నీ పూజా బ్రహ్మ, విష్ణు, మహేంద్రాది సమస్త దేవతలకూ శక్తిని సమకూరుస్తుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

127

**మ.అమరన్వేద పురాణ శాస్త్రములు మున్నా కాంక్ష తత్త్వప్రభే**
**దము రూపింపగ నేరవన్న మరియా తత్త్వంబు లెట్లన్న ను**
**త్తమ సంతోషమె కోరుకొన్న నరుడుత్సాహించి నీ భక్త స**
**త్తమ పూజారతి సేర్చునే నతడు తత్త్వజ్ఞుండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, బ్రహ్మానందం అనే మాట ఒకటి ఉన్నది. అది మానుషానందం కంటే, అనగా మనిషిపొందే గరిష్ఠమైన ఆనందానికంటే ఎన్నోరెట్లు గొప్పది.అది ఉత్తమ సంతోషం. అటువంటి ఉత్తమ సంతోషాన్ని కేవలం తత్త్వజ్ఞుడు మాత్రమే సాధించగలడు. తత్వంఅనేది ఎలా సిద్ధిస్తుందో వేదాలుగానీ పురాణాలు గానీ శాస్త్రాలు గానీ చెప్పలేవు. అసలైన తత్త్వమేదో అవి నిరూపించజాలవు. అవ్వన్నీ తెలుసుకొని భావగతం కావించుకున్నాగూడా శివభక్తులైనవారిని సేవించకపోతే ప్రయోజనం శూన్యం. ఎవరైతే నీ భక్తులను పూజించడంలో ఆనందాన్ని అనుభవిస్తాడో అతడే ఆ తత్త్వాన్ని ఆకళింపు చేసుకో గలుగుతాడు. అతడే నిజమైన తత్త్వజ్ఞుడు. అతనే ఉత్తమ సంతోషాన్ని, అంటే బ్రహ్మానంద సహోదరమైన స్థితిని

అందుకోగలడు. శివభక్తుడు సాక్షాత్తూ శివుడే. శివభక్తులసేవా, వారి పూజా బ్రహ్మానంద స్థితిని సాధించుకునే సాధనాలు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

128

మ. అమితోద్యద్భవదీయ తత్త్వము మహీయస్తోత్ర వాణీవిలా
సములై యొప్పు సమస్త వేదములు శాస్త్ర శ్రేణియున్దివ్య వి
భ్రమ నాదంబులు నెన్నిచూడ నవి నీ పంచాక్షరీ మంత్ర భా
వములై యుండు సమస్త లక్షణములన్ వర్ణింప సర్వేశ్వరా!

ఓ పరమేశ్వరా, సకల వేదాలూ, సర్వ శాస్త్రాలూ లోకంలోని సర్వవాంగ్మయమూ అన్నీ సరస్వతీదేవి విలాసాలే. అఖిలమైన నాదాలూ, సంగీతాది సర్వ కళారూపాలూ అన్నీ ఆమె విలాసాలే. వీటన్నిటి సారాంశమూ ఒకటే. నీ మహనీయ తత్త్వమునూ, నీ పంచాక్షరీ మంత్ర ప్రభావాన్నీ ప్రకట పరచడమే. అన్ని వేదాలూ , శాస్త్రాలూ, పురాణాలూ వీటి సారమే పంచాక్షరీ మంత్రం. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

129

శా. సంకీర్ణాకలితాక్షర త్రయము,భాస్వన్నాద బిందు క్రమా
లంకార ద్వితయంబుతో గలిసి లీలన్ దివ్య యోగీంద్ర హృ
త్పంకోద్భూతము లందు రూఢమగుచుం,పంచాక్షరీ మంత్ర మ
య్యోంకారాత్మకమౌ లసన్మునిగణం బూహింప సర్వేశ్వరా!

ఓ పరమేశ్వరా, నీ మహిత తత్త్వాత్మికమైన పంచాక్షరీ మంత్రము ఐదు అక్షరాలతో కూడినది. అందులో మూడ క్షరములు 'శివాయ' అనేవి సంకీర్ణమైనవి. అంటే గహనమై సులభంగా సాధించ జాలనివి. రెండక్షరాలు ' నమః' అనేవి నాద బిందువులచే అలంకరించబడి సంగీతమయమైనవి. నాదము సామవేదమునకు సంబంధించినది. ఆ మూడూ, ఈ రెండూ అక్షరాలను జోడించి దివ్య యోగీంద్రులూ, మహర్షి గణమూ ఆది ప్రణవ రూపమైన ఓం కారముతో కూర్చి ఓం నమఃశివాయ అనే పంచాక్షరీ మంత్రముగా తమ హృదయ పద్మాలలో రూఢి పరచుకొని నిత్యమూ ధ్యానిస్తుంటారు. మహర్షులకూ యోగులకూ వారి వారి తపస్సులకు అభిగమ్యమైనది దివ్య పంచాక్షరీ

మంత్రమే! అది సర్వ సిద్ధులనూ ప్రసాదిస్తుంది. సర్వ పాపాలనూ నిర్మూలిస్తుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

130

**మ. అమల జ్ఞాన విభాస భాసురత న య్యష్టాంగ పూజావిధి**
**క్రమ యోగంబుల నిన్ను నెల్లపుడు జోకం గొల్వగానేల ని**
**క్కము నీ భక్తుల గోష్ఠి చాలు కడు వీకస్ ఘోర సంసార దుః**
**ఖము లెల్లం బెడవాప,నిన్ను వెలయంగా జూప సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, వేద పురాణ శాస్త్రాదులద్వారా నిర్మలమైన దివ్యజ్ఞానాన్ని సంపాదించుకున్న భక్తులు అష్టాంగ పద్ధతిలో నిన్ను పూజిస్తుంటారు. అష్టాంగములు అంటే ఎనిమిది రకాల పూజా విధానాలు. అవి యమము, నియమము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధ్యానము, ధారణ, మననము, సమాధి అనేవి.

1) యమము= హింసకు దూరంగా ఉంటూ శాంతితో ఉండడం.

2) నియమము= ఒక క్రమపద్ధతి తో క్రమశిక్షణతో జీవించడం

3) ప్రాణాయామము=శ్వాసను నియంత్రించుకోవడం

4) ప్రత్యాహారము= ఇంద్రియవాసనలకు లొంగక పోవడం

5) ధ్యానము= నిరంతరమూ శివునే చింతిస్తూ ఉండడం.

6) ధారణ= శివుని దప్ప మరొకటి మనసులోకి రానీయకుండా ఉండడం.

7)మననము= మనసులో శివునే మరీమరీ జపించడం

8) సమాధి= నిర్వికల్ప మైన స్థితిలో,మరే భావనా లేని స్థిరత్వములో మనసునూ శరీరాన్నీ ఉంచుకోవడం.

ఈ ఎనిమిదీ పూజకు అంగములు. జ్ఞానులైన భక్తులు ఈ అష్టాంగ మార్గంలో నిన్ను ఆరాధిస్తారు. ఇదంతా చాలా క్లిష్టమైనది. కష్టమైనది. ఇంత కష్టపడనక్కరలేకుండా సదా శివభక్తుల గోష్ఠిలో ఉంటూ, వారిని సేవిస్తూ ఉంటే చాలు, సంసార దుఃఖాలన్నీ తొలిగిపోయి నీ సాన్నిధ్యాన్నికి చేరి నిన్ను దర్శించుకోవచ్చు. ఎందుకంటే శివభక్తుడంటే శివుడే గదా! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( పైన చెప్పిన అష్టాంగ విధి మనది.బౌద్ధ మతానుయాయులకు వారి అష్టాంగ మార్గం వేరే ఉంది.ఆ అష్టాంగాలూ1) సమ్యక్ దృష్టి 2) సమ్యక్ సంకల్పము3) సమ్యక్ వచనము 4) సమ్యక్ కర్మ 5) సమ్యక్ జీవనము

6) సమ్యక్ స్మృతి 7) సమ్యక్ సాధన 8) సమ్యక్ సమాధి అనేవి. సమ్యక్ అంటే స్థిరమైన, స్పష్టమైన, సంపూర్ణమైన అని అర్థం.)

131

**మ. పరమార్థంబుగ దత్త్వము న్నెరుగ నొప్పం దీర్చి,డెందంబు నీ**
**కరుణా స్థానము జేర్పలేక తన వంకం బోవగా నిచ్చిరే**
**నరకాబ్ధిం బడవైచు దక్షణము లోనం గాని,దత్త్వక్షమం**
**బరయం చిత్తము శూకలాశ్వము నిభంబై యుండు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, మనిషి వేదాలు చదువుతాడు. ఉపనిషత్తులూ పురాణాలూ శాస్త్రాలూ అన్నీ నేర్చుకుంటాడు. వాటి సారమంతా తెలుసుకుంటాడు. తత్త్వమేదో తెలుసు కుంటాడు. ఎన్ని నేరిస్తే మాత్రం ఏం ప్రయోజనం. నీ పై నిక్కమైన భక్తి లేనపుడు, కరుణామూర్తి వైన నీపాదాలపై చిత్తాన్ని లగ్నం చేయక పోతే ఎంత నేర్చినా వృధాయే గదా! మనసును దాని ఇష్ట ప్రకారం పరుగెత్తనిస్తే ఎట్లా? అసలే మనసు శూకలాశ్వము లాంటిది. శూకలాశ్వము అంటే ఏ అదుపుకూ లొంగకుండా, రౌతు మాట వినకుండా , దానిష్టం ప్రకారమేపోయే గుర్రం లాంటిది. దాన్ని నియంత్రించి వశంలోకి తెచ్చుకొని నీపైనే కుదురుగా ఉండేటట్లు చేసుకోవాలి. ఎందుకంటే బుద్ధి

దుర్మార్గమైనది. అహంకారానికి లొంగుతుంది. ఇంద్రియాల ప్రభావానికి ఆకర్షింపబడి మనసును అటు లాక్కు పోతుంది. కాబట్టి మనసును బుద్ధి మాటవిననీకుండా అదుపులో ఉంచుకోవడం అవసరం. లేకపోతే, నరకమనే సముద్రంలో మునిగి పోవడమే! సందేహమే లేదు. నా మనసెప్పుడూ నీపై నే స్థిరంగా నిలిచేటట్లు చేయవయ్యా! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

132

**మ.భవదంఘ్రి ద్వితయార్చనంబును,భవత్ప్రఖ్యాత సద్భక్త పుం**
**గవ గోష్ఠీ విభవంబులు,న్విమల సూక్ష్మధ్యాన యోగంబు నా**
**నివి సంపూర్ణ సుఖంబులెన్న మరి దేవేంద్రాది భోగంబులు**
**త్సవ సంబంధములెల్ల దుఃస్థితులు తథ్యంబెన్న సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, దేవతలు మహాభోగాలు అనుభవిస్తుంటారనుకొని, మనుషులూ వారివారి పూర్వజన్మ కర్మఫలానుసారం దేవేంద్రభోగాలను ఆశించి, దొరికి కొందరు సంతోషిస్తుంటారు. దొరక్క కొందరు బాధలు పడుతుంటారు. నిజానికి ఇహలోక భోగాలు ఏమి భోగాలు. అవి కేవలం దుఃస్థితులు. తెలియక వారు ఆహా భోగాలను అనుభవిస్తున్నాం అనుకుంటారేగాని అవి అసలు సౌఖ్యాలేకావు. నీపాదాలను నిత్యమూ పూజిస్తూ ఉండడంలోనూ, శివ రూపులైన సద్భక్తుల గోష్ఠిలో నిరంతరమూ మునిగి తేలుతూ ఉండడంలోనూ, నిర్మలమైన, సూక్ష్మమైన ధ్యాన యోగంలో రమిస్తూ ఉండడంలోనూ ఉండే సౌఖ్యం సంపూర్ణమైన సౌఖ్యం. ఇతర భోగాలన్నీ

దాని ముందు ఎందుకూ పనికి రానివి. ఒకసారి ఆ సౌఖ్యం రుచి చూసిన మనిషి ఇతర సుఖాలనబడేటటువంటివాటిని తలవను గూడా తలవడు. ఇది నిజం. నాకు ఇతర భోగాలు అక్కర్లేదు. నిన్ను సేవిస్తూ పొందే సంపూర్ణ సౌఖ్యం ప్రసాదించు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

133

మ.

**తమ లింగార్చన కంటె జంగమము సౌందర్యంబుగా గొల్చు టు**

**త్తమ భక్తి స్థితి,లింగ జంగముల సత్సామ్యంబుగా జేత మ**

**ధ్యమ భక్తి స్థితి,లింగపూజ నధికుండై జంగమోపాసనా**

**క్షముడై యుండుట భక్తియందది కనిష్ఠం బెన్న సర్వేశ్వరా!**

అన్ని పద్యాల్లోనూ కవి జంగముల అంటే ఉత్తమ శివభక్తులను సాక్షాత్తూ శివుడుగానే పేర్కొన్నాడు. వారిని పూజించడం అంటే శివుణ్ణి పూజించడమే అని చెప్పాడు. ఈ పద్యంలో ఇంకా ఒక మెట్టు పైకి పోయి లింగపూజ కంటే కూడా జంగమపూజ గొప్పదని చెపుతున్నాడు. శివభక్తి యొక్క మూడు స్థితులను తరతమ భేదాలతో నిర్ధారిస్తున్నాడు. ఉత్తమ భక్తిస్థితి, మధ్యమ భక్తి స్థితి, కనిష్ఠ భక్తి స్థితి అనే మూడు వేర్వేరు స్థితులుగా వర్గీకరించి విశదీకరిస్తున్నాడు. లింగార్చనకంటే జంగమార్చననే భక్తి శ్రద్ధలతో చేయడం ఉత్తమ స్థితి. లింగ పూజా జంగమపూజా సమానంగా చేయడం మధ్యమ భక్తి స్థితి.

లింగపూజ ఎక్కువగా చేస్తూ జంగమపూజ తక్కువగా చేయడం కనిష్ఠ భక్తిస్థితి అని తేడాలు చెపుతున్నాడు. వీరశైవుల దృష్టిలో జంగముల ప్రాధాన్యాన్ని ఇది తెలియ జేస్తున్నది.

కర్నాటకప్రాంతంలో బసవేశ్వరునికాలంలో వీరశైవం బాగా విజృంభించింది బసవేశ్వరుని కన్నడిగులు, ముఖ్యంగా లింగాయతులు గొప్పగా ఇప్పటికీ కొలుస్తారు. కులవైషమ్యాలు తీవ్రంగ ఉండే ఆనాటి సమాజంలో కులమనే దాన్ని వ్యతిరేకించి ఆచరించి చూపినందున ఆయన బాగా జనప్రియుడైనాడు. బసవేశ్వరుడు బిజ్జలుని ఆస్థానంలో ఉండేవాడు. రాజు ఆయనకు గొప్ప స్థానాన్ని ఇచ్చి చాలా భక్తితో పూజించేవాడు. ఆయన చెప్పినట్లే ప్రవర్తించేవాడు. బసవేశ్వరుడు వ్యాప్తి చేసిన వీరశైవం వలన ఆనాటి సమాజంలో శివభక్తులు బాగా పెరిగారు. వీరి హడావుడి సమాజంలో బాగా ఎక్కువగానే ఉండేది. నిజం చెప్పాలంటే వీరందరూ బసవని అనుయాయులు కాబట్టీ, బసవడు రాజుకంటే బలవంతుడు కాబట్టీ జనం వీరంటే భక్తితో పాటు భయమూ చూపేవారు. యధావాక్కుల అన్నమయ్య ఆ

కాలంవాడు. ఆ ప్రాంతానికి వోయాడేమోగాని ఆ ప్రభావం ఆయనమీద బాగా పనిచేసింది. అప్పుడు ప్రచలితం గా ఉన్న పరిస్థితులకు అనుగుణమైన భావాలే ఆయన పద్యాల్లో కనిపిస్తాయి.

నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

134

**మ.కర ఢక్కా రవ వాద్య మింపొదవ గంగా తుంగ రంగత్తరం**
**గ రవ ప్రస్ఫుట తాళ సమ్మిళిత తత్కంజాత పుంజ స్ఫుర**
**ద్వర పుష్పంధయ మందర ధ్వనులు గీతంబొప్పతౌర్యత్రికం**
**బిరవైయుండగ నీదు తాండవ మహం బేపారు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీవు సంధ్యాసమయాలలో కైలాస శిఖరమ్మీద తాండవ నృత్యాన్ని చేస్తావట. అది నృత్య, గీత, వాద్య సమ్మేళనంతో సర్వలోక సమ్మోహనకరంగా ఉంటుందిట. నీ ఆ తాండవ నృత్యానికి నీ చేతిలోని డమరుకం పక్కవాద్యంగా అమరిపోతుంది. నీ జటాజూటంలో ని దేవగంగా ప్రవాహపు టలలు ఎగిరెగిరిపడుతూ చేసే సవ్వడి తాళం వేస్తున్న ట్లుం ది. ఆగంగానదిలో వికసించి దివ్య పరిమళాలు వెదజల్లే తామర పూల సువాసనకు ఆకర్షితమై మూగే తుమ్మెదలు చేసే మధుర ధ్వనులే నీ నాట్యానికి పాట! నటరాజువు నీవు. తాండవ ప్రియుడవు. ఢమరుకం ఢక్కారవంతో, గంగానది అలల గళగళ రావపు తాళంతో, తుమ్మెదలపాటతో నీ తాండవం లోక

సమ్మోహకరంగా సాగుతుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

(కంజాత పుంజము= తామర పూల మొత్తము. పుష్పంధయము= తుమ్మెద.

తౌర్యత్రికము= నృత్య,వాద్య,గీత సమ్మేళనము)

Restless Inertia:

నీదు తాండవం అహంబు ఏపారు - అంటే నటరాజమూర్తి పాదాల నణచి ఉన్న "అపస్మార" సూచన అనిపిస్తోంది - లేక నేను పొరపాటుగా అర్థం చేసుకున్నానా - దయచేసి తప్పొప్పులు చెప్పగలరా? 🙏

Brundavana Rao:

అహము అంటే రూఢి అయిన అర్థము గర్వము. ఇక్కడ గొప్పతనము అనే అర్థం తీసుకోవచ్చు. ఏపారు అంటే అతిశయించు అని. ఇక్కడ తాండవముయొక్క గర్వము కాబట్టి తాండవముయొక్క పేరిమి అనుకోడం అసమంజసం

కాదు. అంతేకాదు. మహము అంటే ప్రకాశము, శోభ. తాండవ+మహము= తాండవమహము అని సమాసంగా స్వీకరించితే తాండవము యొక్క శోభ అని ఇంకా చక్కని అర్థం వస్తుంది. మీ ఆసక్తికి కృతజ్ఞతలు🙏

135

**మ.అజశక్రాదులు మిమ్మెరింగి నుతి సేయన్లేరు,నే నెంతవా**
**డ,జగద్రక్షణదక్ష!నిన్ను గొనియాడన్,నీ స్వభావంబు దా**
**స జనానుగ్రహ నిశ్చితం బగుట,నా జన్మ సాఫల్యమం**
**ద జడుండంచు నిరాకరింపక, ప్రసన్నుంబౌట సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, బ్రహ్మ సాక్షాత్తూ వాణీదేవి భర్త. ఆమె ఆయన నాలుక మీదనే ఉంటుంది. అంటే లోకంలోని సర్వ వాఙ్మయమూ ఆయన నాలుక మీదనే! ఐనా నిన్ను పూర్తిగా తెలుసుకొని ప్రస్తుతించడం ఆయనకు సాధ్యం కాదు. ఇంద్రునికి వేయికండ్లు. ఇతరులు చూసిందానికంటే వేయిరెట్లు ఎక్కువ స్పష్టంగా ప్రతిదాన్నీ చూడగలడు. కానీ నీ నిజరూపమేదో తెలుసుకొని పూర్తిగా ప్రస్తుతించడం ఆయనకూ శక్యంగాదు. లోకాలన్నీ కాపాడే స్వామీ! వారికే సాధ్యంకాని దానిని నేనేమి చేయగలను. నిన్ను ఏమాత్రం కొనియాడగలను. ఐతే ఒకటి మాత్రం నిశ్చితం. నీవు నీ దాసులను అనుగ్రహిస్తావు, వారు

ఎలాంటి వారైనా. నేను జడుడను. మూర్ఖుడను. ఐనా నన్ను నిరాకరింపక నా బ్రతుకు సాఫల్యం పొందేట్లు అనుగ్ర హిస్తావనేదీ నిశ్చితమే!

136

**శా.బాలుండాడెడు మాటలెల్ల నుపమింపం తండ్రికిం బ్రౌఢ భా**
**వాలాపంబులకంటె మించు గతి నే నజ్ఞాన భావంబునం**
**దాలోచించి రచించినట్టి కృతి ,యింపారంగ నీకు న్మహా**
**లాలిత్య స్తుతి కంటె గైకొను గదా శ్లాఘ్యంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నేను తెలిసీ తెలియని తెలివిడితో భావించి వ్రాసిన పద్య కృతి ఇది. పసి పిల్లవాడు మాట్లాడే తొక్కు పలుకులకు తండ్రి సంతోషిస్తాడుగదా. వాడు మాట్లాడే ముద్దు మాటలు ఏవో పసివాడిమాటల్లే అని కొట్టి పారేయడు తండ్రి. ప్రౌఢమైన భావాలతో పెద్దవాళ్ళు మాట్లాడుతుంటే వింటున్నంత ఆసక్తితో వింటాడు. ఆనందిస్తాడు. మళ్ళీమళ్ళీ మాట్లాడించుకొని వింటాడు. అజ్ఞానంతో ఏదో నాకు తోచిన కొద్దీ ఆలోచించి వ్రాసిన కృతి ఇది. నీ స్తుతి. దీన్ని లలితభావసంకలితంగానూ శ్లాఘ్యంగానూ భావించి స్వీకరించు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

(మహాకవి పోతన పసిబాలుర ముద్దు పలుకులను ఒకచిన్న పద్యంలో ఇలా చెప్పాడు. అనుదిన సంతోషణములు, జనిత శ్రమతాప దుఃఖసంశోషణముల్, తనయుల సంభాషణములు జనకులకుం కర్ణయుగళ సద్భూషణముల్! కొడుకులు పలికే మాటలు తండ్రులకు అనుదినమూ సంతోషం కలిగిస్తాయి. బయట కష్టంచేసి ఇంట్లోకి వస్తే ఆ శ్రమనూ, దిగుళ్ళనూ తొలిగించి వేస్తాయి. పుత్రుల పలుకులు తండ్రులు చెవులకు ఆభరణా ల్లాంటివి. ఆభరణాలు చెవినంటి పెట్టుకుని ఉన్నట్టు పిల్లల ముద్దు మాటలు కూడా చెవుల్లోనే ఉండి పదేపదే గుర్తుకొస్తుంటాయి) నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( పద్యంప్రారంభంలో అజ రుద్రాదులు అని ఉన్నది. అజుడు అంటే బ్రహ్మ.రుద్రుడు అంటే శివుడు.శివుణ్ణి స్తుతిస్తూ వ్రాసిన పద్యంలో శివుడు నిన్నుస్తుతించలేడు అనడం సరిగా లేదనిపించి అజశక్రాదులు అని నేనే మార్చాను.శక్రుడు అంటే

ఇంద్రుడు. ప్రాచీనులైన మహా కవులు వ్రాసిన దాంట్లో వేలు పెట్టడం ,అందునా నాలాంటి వాడికి, అనైతికం. ఐనా స్పష్టత కోసమూ, కేవలం ఈ సమూహంకోసమూ అలామార్చాను. సర్వేశ్వరునికి భిన్నుడైన మరో రుద్రుడు కవి ఉద్దేశంలో ఉండి ఉండవచ్చు. అయినా confusion లేకుండా ఉండేందుకు అలా మార్చాను.)

137

మ.అభిరమ్యంబుగ దూదికొండ మహనీయారాధ్య సోమేశ్వర
ప్రభు కారుణ్య వసంత సంజనిత మద్వాక్య ప్రసూనావళి
న్విభవం బొప్పగ గూర్చి యెంతయు లసద్విఖ్యాతి సంపత్సుఖ
ప్రభవంబైన భవత్పద ద్వయము నారాధింతు సర్వేశ్వరా!

ఓ పరమేశ్వరా, దూదికొండగ్రామంలో వెలసి పూజలందు కొంటున్న సోమేశ్వరస్వామీ! నీ పరమ కృప అనే వసంతంలో పూచాయి నా యీ వాక్యాలనే పూలు. వీటిని పద్య గుచ్ఛాలుగా, మాలికలుగా కూర్చి వైభవంగా నీ పాదాల వద్ద ఉంచాను. నీ పాదాలు సర్వసంపదలనూ అనుగ్రహిస్తాయి. గొప్పకీర్తిని ప్రసాదిస్తాయి .అటువంటి నీ పాదద్వయిదగ్గర ఎంతో అభిరామంగా, ఎంతో వైభవంగా ఈ పూలను సమర్పిస్తున్నాను. ఇవన్నీ నీ దయతో పూచిన పూలే! స్వీకరించు! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

(కర్నూలు జిల్లా దూదికొండ అనే ఊరు అన్నమయ్య స్వగ్రామం. అక్కడి సోమేశ్వరస్వామిని సేవించేవాడు. తరువాత మాచర్ల ప్రాంతంలోని కృష్ణాతీర గ్రామమైన సత్రశాలకు వచ్చాడు. సత్రశాలలోకూడా  ప్రసిద్ధిచెందిన మల్లికేశ్వర స్వామి ఆలయం ఉంది.శివరాత్రికి ఇతర ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకులాగానే విశేషంగా భక్తులు వస్తారు. అన్నమయ్య ఈ శతకం అక్కడే వ్రాశాడు. ఆ ముచ్చట ఇంతకు ముందు చెప్పుకున్నాము.

ఆరాధ్య సోమేశ్వరుడు అనే ఒక యోగో, గురువో దూదికొండలో ఉండేవాడనీ, అన్నమయ్య ఆయన శిష్యుడై ఉంటాడనీ కొందరు విమర్శకులు ఊహించారు. ఆ ఆరాధ్య సోమేశ్వరుడు పాల్కురికి సోమనాథుడని కొందరూ, కాదు వేరే ఆయన అని మరికొందరూ వాదాలు కూడా చేశారు. పాల్కురికి సోమన గొప్పకవి. వరంగల్ ప్రాంతంవాడు. వరంగల్ పక్కన పాల్కురికిఅనే గ్రామంకూడాఉంది. ఆయన వీరశైవాన్ని తన సాహిత్యంతో ప్రచారం కావించిన మంచికవి. బసవేశ్వరుని భావాలకు బాగా ప్రభావితమైన వాడు. కర్నాటక ప్రాంతంతో

బాగా సంబంధాలున్న వ్యక్తి. బసవపురాణమనే ద్విపద కావ్యమూ, వృషాధిప శతకమూ ఇంకా కొన్ని కృతులు రచించాడు. ఆయన భావాలు కొన్ని అన్నమయ్య శతకంలో ఉండడం చేతా, వారిద్దరి కాలాలూ దగ్గరదగ్గరగా ఉండడంచేతా అలా భావించారు. దూదికొండలోని ఆరాధ్యసోమేశ్వరప్రభువు అని అన్నమయ్య స్పష్టంగా చెపుతూ ఉంటే ఎక్కడి పాల్కురికి సోమన్నని దూదికొండకు తేవడం ఎందుకు. ఎక్కువగా కవుల స్థల కాల నిర్ణయాలవిషయంలో విమర్శకులు రకరకాల ఊహలు చేస్తుంటారు. ఆవూరి గుళ్ళో ఆరాధించబడే శివుడు ఆరాధ్య సోమేశ్వరుడు అనుకుంటే క్షేమంగా వుంటుందని నేనను కుంటున్నాను.)

138

శా.ధాత్రి న్భక్త జనానురంజనముగా దత్త్వ ప్రకాశంబుగా
చిత్రార్థాంచిత శబ్ద బంధురముగా,సేవ్యంబుగా,సజ్జన
శ్రోత్రానందముగా,శుభాంచితముగా శోధించి సర్వేశ్వర
స్తోత్రం బన్నయ చెప్పె నిజ్జగములో శోభిల్ల సర్వేశ్వరా!

ఓ పరమేశ్వరా, యథావాక్కుల అన్నమయ్యఅనే నేను సర్వేశ్వరుడ వైన నిన్ను స్తుతిస్తూ ఈ పద్యాలు చెప్పాను. ఇవి సద్భక్తులకు హృదయానందం కలిగిస్తాయి.ఈ పద్యాల్లో నీ పరమతత్త్వాన్ని ప్రకటపరచే ప్రయత్నం చేశాను. అందమైన, విశేషార్థాలతో కూడిన పదాలూ, భావాలూ ఉండి ఆనందం కలిగిస్తాయి ఈ పద్యాలు. చదువరులు వీనిని పూజ్య భావంతో స్వీకరిస్తారు. సత్పురుషులకు వీనులవిందు కలిగిస్తాయి. లోకాలకు హితాన్నీ, శుభాన్నీ కలిగిస్తాయి. నేను బాగా పరిశోధించి వ్రాసిన పద్యాలివి. నీ కృపతో ఈ కృతి శాశ్వతంగా శోభిస్తుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

పైన అన్నమయ్య తన శతక పద్యాలను గురించి చెప్పినవేవీ అతిశయోక్తులు కావనీ అక్షరాలా అక్షరసత్యాలనీ ఇన్ని రోజులనించీ చదువుతున్న పాఠకులు స్వానుభవంతో ఆనందించి అర్థం చేసుకొని ఉంటారు. అన్నమయ్య ఈ ఒక్క కృతి తప్ప వేరే ఏమీ వ్రాసిన దాఖలాలు లేవు. ఐనా ఆయన గొప్ప కవి అని చెప్పడానికి ఈ శతకం చాలు. పద్యాల్లోని ధారా, చిత్రశబ్దాలూ, విశేషభావాలూ, ప్రౌఢగైన సంస్కృత సమాసాలూ, భక్తి తత్పరతా చాలా ఉన్నతమైన స్థాయిని. ఆయన ఆశించినట్లే మనం ఇవ్వాళ దాదాపు ఎనిమిది వందల సంవత్సరాల తర్వాత కూడా ఈ పద్యాలను చదివి ఆనందిస్తూనే ఉన్నాము.

139

శా.శాకాబ్దంబులు వార్ధి షట్క పురజిత్సంఖ్యం ప్రవర్తింప సు

శ్లోకానంద కరంబుగా,మహిమతో శోభిల్ల సర్వేశ్వర

ప్రాకామ్య స్తవ మొప్పుజెప్పె శుభకృత్ప్రవ్యక్త వర్షంబునన్

శ్రీ కంఠార్పితమై వసుంధర పయిం జెన్నొంద సర్వేశ్వరా!

ఓ పరమేశ్వరా, గరళ కంఠా! నీకు సమర్పింపబడిన ఈ స్తోత్రం ఐశ్వర్యదాయిని. ప్రాకామ్య స్తవము ( ప్రాకామ్యము= ఐశ్వర్యము) ఇది మహామహిమతో శోభించేటట్లూ, సుశ్లోకులైన మహాత్ములకు ఆనందం కలిగించేటట్లూ, శాలివాహనశకం 1164 వసంవత్సరంలో శుభకృత్ సంవత్సరంలో రచించాను. నీకు అర్పింపబడిన ఈ స్తోత్రం ఈ భూమ్మీద శాశ్వతంగా నిలిచి పోతుంది. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

తను నివసించిన ప్రదేశాన్నీ, కృతి రచించిన కాలాన్నీ స్పష్టంగా చెప్పి సాహిత్య చరిత్ర పరిశోధకులకు చాలా మేలు చేశాడు అన్నమయ్య. తాను ఈ శతకాన్ని శాలివాహనశకం 1164 లో వచ్చిన శుభకృత్ నామ సంవత్సరంలో వ్రాశానని చెప్పాడు. ఎక్కడ చెప్పాడంటారా. ఈ పద్యంలోనే. శాకాబ్దంబులు అంటే శకసంవత్సరాలు. వార్ధి,షట్క, పురజిత్సంఖ్య అన్నాడు. వార్ధి అంటే సముద్రం. సముద్రాలు నాలుగు. చతు స్సముద్రాలుఅని కదా కవిసమయం. అందుకని 4. షట్కము అంటే ఆరు. 6. పురజిత్సంఖ్య, పురజిత్ అంటే పురములను, త్రిపురములను జయించినవాడు. రుద్రుడు. రుద్రులు పదకొండు మంది. ఏకాదశరుద్రులు కదా! 11. ఇప్పుడు చూడండి. 4611 వచ్చింది. సంవత్సరాల గణన లెక్కించేటప్పుడు ఈ సంఖ్యను తిరగేయాలిట. అప్పుడు 1164 అవుతుంది. అదీ సంగతి. అన్నమయ్య కాలానికి క్రీస్తుశకం మనకు తెలియదు. పాశ్చాత్యులు ఈ దేశానికి వచ్చాకనే

క్రీస్తుశకం ప్రకారం రోజులలెక్కింపు మొదలైంది. అంతకుముందు పదకొండో శతాబ్దంనుంచీ బానిసరాజులూ, లోడీలూ, ఖిల్జీలూ, తుగ్లక్లూ, మొగలులూఅంటూ ఒకరి తరువాత ఒకరు మహమ్మదీయులు దాడిగా వచ్చి, కొల్లగొట్టి, గుళ్ళు కూల్చి, జనాన్ని ఊచకోతలుకోసి తిరిగి వెళ్ళిపోయి కొందరూ, వచ్చి బలంతో, దౌర్జన్యంతో యుద్ధాలుచేసి, రాజ్యాలు లాక్కొని ఇక్కడే స్థిరపడి, యథాప్రకారం జనాలను చంపుతూ, గుళ్ళను కూలుస్తూ, మతాంతరీకరణాలూ మానభంగాలూ చేస్తూ బ్రిటీషువారు వచ్చి బలపడేదాకా పెత్తనం చేశారు. ఆ మహమ్మదీయులకు వేరే శకం బహుశా ఫసలీ శకం_ పారశీక శకం_ ఉండేదేమో. అంతకు మునుపు దేశంలో కొన్నిచోట్ల శాలివాహన శకమూ  కొన్నిచోట్ల విక్రమ శకమూ ఉండేవి. శాలివాహనశకం దక్షిణాదిలో ఉండేదిగామాల, ఇక్కడ అన్నమయ్య చెప్పిన లెక్క దాన్ననుసరించే. గణన ప్రకారం ఈ శాలివాహన శకానికీ, క్రీస్తుశకానికీ 78 సంవత్సరాల వార. అంటే

అన్నమయ్య చెప్పిన 1164 క్రీస్తుశకం ప్రకారం 1242 అవుతుంది.

ఈ ముప్పై తొమ్మిది పద్యాలు మాత్రమే కొన్ని పుస్తకాల్లో ఉన్నాయట. వావిళ్ళవారు ప్రకటించిన శతక సంపుటిలోని శతకంలో మరో ఐదు పద్యాలు అదనంగా ఉన్నాయని, వాటినీ ఇచ్చారు.ఆ ఐదింటినీ రేపటినుంచి.

K B K RAO GARU

మీరు చెప్పిన 780 సంవత్సరాల క్రితం శుభకృత్ నామ సంవత్సరం మళ్ళీ ఈ రాబోయే ఉగాది కి రావడం అనేది కాకతాళీయమేనా...

🙏🏻🙏🏻🙏🏻🙏🏻🙏🏻

BRUNDAVANA RAO

కాకతాళీయమైనా,తమాషాగా వుంది కదా!

అప్పటికీ ఇప్పటికీ 13 అరవై సంవత్సరాల ఆవృతులు గడిచిపోయాయి.ఎంత సరైన లెక్క!

140

మ.అరిషడ్వర్గ బలంబులో మలసి మాయావృత్తి నాయం దతి
స్ఫురణం జేసినవాడు మోహు డతనిన్ బోద్రోచి నీ భక్తితో
బరగం గూర్చి వివేకి జేసి నెరయం బాటించి నాయం దధీ
శ్వరుడై యుండగదయ్య! రౌప్య కుధర వ్యాపార! సర్వేశ్వరా!

ఓ పరమేశ్వరా, మనిషిని భ్రమకు గురిచేసి, లోబరచుకొని పతనం వైపుకు మళ్ళించే శత్రువులు ఆరుగురు. అరిషడ్వర్గాలు.అవికామమూ, క్రోధమూ, లోభమూ, మోహమూ, మదమూ, మాత్సర్యమూ అనేవి. వీటిల్లో మోహం అనేవాడు పట్టుకుని వదలడం లేదు. ఈమోహుడు నా నెత్తిమీదకూర్చుని, నన్ను లోబరచుకొని, నా ప్రవర్తనను నిర్దేశిస్తూ, నియంత్రిస్తూ నాపై పెత్తనం చలాయిస్తున్నాడు. ఎంత ప్రయత్నించినా వీడిని వదిలించుకోవడం సాధ్యం కావడంలేదు. అతన్ని పోద్రోచి, నీపై భక్తిని నాలో సంపూర్తిగా ఉండేటట్లు అనుగ్రహించు. నాకు వివేకాన్ని ప్రసాదించు. ఈమాయావిచ్ఛేదం కావించి నాకు

అధీశ్వరునిగా శాశ్వతంగా ఉండిపోవయ్యా! కైలాస పర్వతం మీద నివసించే స్వామీ! నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

(రౌప్యము= వెండి . కుధరము= కొండ. రౌప్య కుధరము= వెండి కొండ,కైలాసము.)

141

**మ.అమలామ్నాయ విధిప్రబోధము లసంఖ్యాకంబులై యుండు,నా**
**గమ మార్గోత్తమ మంత్ర తంత్రము లసంఖ్యాతంబులై యుండు, ద**
**త్రమముల్ నాకవి యేల!నీవు మెరయంగా నిన్ను సద్భక్తి యో**
**గమునం గొల్చి జయింప జేయు మిదె మత్కామ్యంబు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,పవిత్రమైన వేదాలు చెప్పే విధి విధానాలు ఒకటా, రెండా! లెక్కలేనన్ని. అలాగే వాటిల్లోని మంత్రాలూ, తంత్రాలూ మాత్రం తక్కువా. అవీ అసంఖ్యాకమైన వే. వేదాలు విధించిన పద్ధతుల్లో, ఆమంత్రతంత్రాలతో వాటిని నిర్వహించడం సామాన్యమైన పని కాదు. అవ్వన్నీ నాకెందుకయ్యా! ఒక మహాప్రకాశంతో నీవు మెరిసిపోతున్నావు. లోకాలూ, లోకస్థులూ, లోకాధిపతులూ అందరూ అంతమై పోయాక ఇక పెద్ద చీకటి తప్ప మరేమీలేని దశలో, ఆ పెను చీకటికి అవతల ఏకాకృతితో ప్రకాశిస్తూ ఉండే నిన్ను భక్తి యోగంతో కొలిచి ఉత్తీర్ణుడనయ్యేట్లు అనుగ్రహించు. కర్మ యోగమూ, ధ్యానయోగమూ, జ్ఞానయోగమూ ఈ మూడింటి

కన్నా ఉత్తమమైన, ఈ మూడింటికీ ప్రాణ భూతమైన భక్తియోగం తోనే నిన్ను సేవిస్తాను.తరించేటట్లు అనుగ్రహించు. అదే నా కోరిక!నా తండ్రీ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

( 65 వ పద్యంలో మిగిలిన యోగాలకంటే భక్తియోగమే ఉత్తమమని తన అభిప్రాయం చెప్పాడు. అమలము= దోషములేనిది, పవిత్రమైనది,. ఆమ్నాయము= వేదము. ఆగమము= వేదము. కామ్యము= కోరిక.)

142

**శా.కానీ దారసమన్వితుండు మిగులంగానీడు కందర్పునిన్**
**గోనీ మానవకోటిలో మరులు పైకోనీడు మోహంబునన్**
**రానీ రాజిత రాజ్య వైభవము పై రానీడు గర్వంబునున్**
**లో నీపైన మహాత్ము డన్యమునకున్ బో నీడు సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, లో నీపైన మహాత్ముడు అంటే ఎవరి ఆంతర్యంనిండా నీవే నిండి ఉంటావో అటువంటి మహనీయుడు- అంటే నిరంతరమూ నిన్నే హృదయంలో నిలుపుకొని సేవించే మహాత్ముడు ఏ అరిషడ్వర్గాలనూ దగ్గరికి రానీయడు. భార్యా పుత్రులతో కలిసి సంసారం చేస్తున్నా కూడా తామరాకు మీద నీటిబొట్టులాగా అంటీ ముట్టకుండా ఉంటాడే కాని మన్మధునికి లొంగిపోడు. కామాన్ని పైచేయి కానీయడు. ఈ సమాజంలో ఇతర జనాలతో కలిసి బ్రతుకుతుంటాడు కానీ మనసును మోహపరిచే దేనిమీదికీ చిత్తాన్ని పోనీయడు. మోహాన్ని దరిచేరనీయడు. అతని అదృష్టం కొద్దీ సకల సౌభాగ్యాలూ, రాజ్య

వైభవాలూ వస్తాయా, రానీ. అతను ఏమాత్రమూ గర్వాన్ని తలకెక్కనీయడు. అంటే మదాన్ని దరిచేరనీయడు. నీ నిక్కమైన భక్తుణ్ణి అరిషడ్వర్గాలు సమీపించలేవు. అసలతను మనసును మరి దేనిమీదికీ పోనీడు. మనసంతా నీవే అయితే ఇంకా శత్రువులెట్టా వస్తారు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

( దారసమన్వితుండు = భార్యను కలిగి ఉన్నవాడు)

143

**శా.ఏ నిన్నే శరణందు బాంధవులు గానీ,యెల్లవారుం బగే**
**గానీ, మృత్యువు తల్లక్రిందు వడనీ,కాలుండు గీపెట్టనీ**
**నానా కర్మచయంబు గింజుకొననీ ,నాకేమి నే రాజ నిం**
**తే,నీ చాటున దాగియున్నపుడు బీతే యింక సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా, నీవే నాకు ఎల్లప్పుడూ శరణం. నిన్నే నమ్మి ఉన్నాను. బంధువులు వద్దని వెళ్ళగొట్టనీ. ఇతరు లందరూ పగై పోనీ. మృత్యువు దాపుకు వచ్చి భయపెడుతూ ఉండనీ. యమధర్మరాజు ముంగిట వచ్చి కూచోనీ. నేను గత జన్మల్లో చేసిన శుభాశుభకర్మ సంచయమంతా వచ్చి ఫలితాన్ని అనుభవిద్దూ రా అంటూ గింజుకోనీ, ఏమైనా కానీ అవి నన్నేమీ చేయలేవు. నేను భయపడను. నీమాటున దాగి, నీవే నాకు శరణం అని నమ్మి ఉన్నప్పుడు నాకెందుకు భయం? నీ ప్రాపున ఉన్నాక నేనిక మహారాజునే! బంధువులు దూరం పెట్టడం, లోకం పగపట్టడం, శత్రువుల్లా ప్రవర్తించడం ఇవన్నీ సాధారణం. ఇక మృత్యువా, ఎవరికీ తప్పదు. కర్మఫలాన్ని

అనుభవించడమా, అదీ ఎవరూ తప్పించుకోలేరు. అయినా నీ అండన ఉండగా ఏది వచ్చినా నాకు భయమెందుకు. నా తండ్రీ! సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!

144

**మ.జయశక్తిస్ రవిచంద్ర తారకముగా జల్పైస్ యథావాక్కుల**
**న్వయ సంజాతుడు నన్నమార్యు డవనిస్ వర్ణించి నీ సత్కథా**
**క్రియ సంబోధన, నీదు భక్తిని మహా నిర్ణీత విశ్రాంతిగా**
**భయ విభ్రాంతులు లేక యీ శతకముం బ్రఖ్యాతి సర్వేశ్వరా!**

ఓ పరమేశ్వరా,శుభప్రదంగా, జయసంకల్పంతో యథా వాక్కులఅనే వంశంలో జన్మించిన అన్నమయ్య అనే నేను నిన్ను వర్ణిస్తూ, నీ సత్కథలను ప్రచురపరుస్తూ ఎంతో నిర్ణయాత్మకంగా, శాంతిగా, భక్తిగా ఈ శతకాన్ని రచించాను. ఏమాత్రం భయంకానీ భ్రమాదులు కానీ, సంకోచాలు కానీ లేకుండా విశ్రాంతిగా నీ సత్కథా గానం కావించాను.ఈ కృతి, లోకంలో సూర్య'చంద్రులూ నక్షత్రాలూ ఉన్నంత కాలమూ ఉంటుంది. నా తండ్రీ! సర్వేశ్వరా!నీ పాదాలకు మ్రొక్కులు!

ఈ నాటితో యథావాక్కుల అన్నమయ్యఅనే పదమూడో శతాబ్దపు శివకవి తన సర్వేశ్వర శతకములో వ్రాసిన అన్ని పద్యాలనూ మననం చేసుకున్నాము. ప్రతి పద్యానికీ

క్లుప్తంగా ఒక చిరు వ్యాఖ్య జోడించే అదృష్టం నాకు కలిగింది. నేను పద్యంలో పైపైన కనిపించే, చదవగానే స్ఫురించే అర్థాన్ని మాత్రమే, పదాన్వయ క్రమం ప్రకారం సంతరించాను. అంతర్గత వేదాంతార్థాలు ఏమైనా ఉంటే వాటి జోలికి పోలేదు. వాటిని వేదాంతజ్ఞులైన పండితులు మాత్రమే వివరించగలరు.

యథావాక్కుల అన్నమయ్య గొప్పకవి. పద్యాలన్నిటినీ అశ్వధాటితో పరిగెత్తించాడు. సర్వేశ్వరా అనే మకుటం తీసుకున్నాక అది మత్తేభంలోనూ, శార్దూలంలోనూ మాత్రమే వీలవుతుంది. ఈ రెండు వృత్తాలూ ఇతర వృత్తాలకన్నా కొంత వాడీ, దూకుడూ కలిగినవి. ఎక్కడా తెగని ధారతో, దీర్ఘమైన సమాసాలతో, గహనమైనభావాన్ని మరీ అంత సులభంకాని రీతిలో ప్రకటిస్తూ శివస్తుతి గావించి ఒక గొప్ప శతకాన్ని తెలుగు వారికి అందించి ఆంధ్ర సాహిత్యంలో తనకో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నాడు అన్నమయ్య.

గత ఐదు నెలలుగా ఈ శతక పద్యాలను రోజుకొకటిగా చూస్తున్న సమూహమిత్రులు నా పరిమిత జ్ఞానంతో వ్రాసిన వ్యాఖ్యానాలను కొంతైనా ఆనందించి ఉంటారని భావిస్తున్నాను.

గమనించారో లేదో, అన్నమయ్య ఇన్ని పద్యాలలో దేనిలోనూ అమ్మవారిని గురించి ఒక్క ముక్కా తడవలేదు. ఇది నాకు ఆశ్చర్యమనిపిస్తున్నది. శివునిలో సగభాగం అమ్మవారయితే ఆమె ఊసేలేని  శివస్తుతి ఏమిటా అనిపించింది. శివుడు సాంబుడు. సోముడు. స+అంబ= సాంబ, స+ఉమ= సోమ! ఆయన అలా చేయడం సరైందో కాదో నాకు తెలీదు గాని ఉన్న సంగతి మాత్రం అది.

పల్నాటి ప్రాంతంలో స్థిరపడిన అన్నమయ్య 1262 లో ఉన్నాడు.ఆనాటికి పల్నాటి యుద్ధం జరిగి 80 ఏండ్లయింది. ఆయుద్ధం 1182లో జరిగింది. అన్నమయ్యకు దాని గురించి తెలిసే ఉంటుంది. పల్నాటి యుద్ధం నాటికి ఆ ప్రాంతంలో వైష్ణవ శైవ విభేదాలు బాగానే ఉండేవి. భారతంలో పాండవ కౌరవుల జూదంలాగా  గురజాల రాజ్యంలో కోడిపందాలు జరిగాయి. రాజ్యం రెండు ముక్కలై మాచర్లా గురజాలా రాజ్యాలుగా విభజన జరిగింది. ఒక రాజ్యం పెత్తందారు, మంత్రి వైష్ణవుడైన బ్రహ్మనాయుడు. మరోరాజ్యంలో శైవమతానుయాయి అయిన నాగమ్మ పెత్తనం చెల్లేది. పరస్పర రాజ్యకాంక్షలకు మత భేదాలు

ఆజ్యంపోశాయి. ఫలితం యుద్ధం. జననాశనం. రాజులను బట్టి ప్రజల్లోనూ శైవ వైష్ణవ భేదాలు తీవ్రంగా ఉండి సమాజమూ తన్నుకు చస్తుంటుంది. అన్నమయ్య శైవాను యాయి.

ఆ ప్రభావం ఆయన సృష్టించిన సాహిత్యం మీద సహజంగానే ఉంటుందిగదా!

నేనూ సర్వేశ్వర శతకము గురించి విన్నానే కాని చూచి చదివే అదృష్టం కలగలేదు. మిత్రుడు చి.రమణ నాకీ అవకాశమిచ్చి ఈ పుణ్య సాహితీవరివస్యలో పాల్గొనేటట్లు చేసినందుకు చాలా చాలా ధన్యవాదాలు, కృతజ్ఞతలు. నన్ను భరించి ఈవ్రాతలను అవలోకించి అభినందించిన మిత్రులందరికీ కృతజ్ఞతలూ, నమస్సులూ. ఆ  సర్వేశ్వరుని చల్లని చూపుతో అందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నాను. నా తండ్రీ!  సర్వేశ్వరా! నీ పాదాలకు మ్రొక్కులు!



సర్వేశ్వర శతకము     యధావాక్కుల అన్నమయ్య



**తాత్పర్య వివరణ:** సిహెచ్. వి. బృందావన రావు